ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఖమ్మం

fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

15-4-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 73 పేజీలు: 8+16 వెల: 6.50

## అంబేద్కర్‌కు శత్రువులు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లే..

5లో

## నిప్పుతో చెలగాటమాడితే మీకే ముప్పు: యూనస్‌కు హాసీనా హెచ్చరిక

# ప్రతి భూమికి 'భూదార్'

## • పైలట్ ప్రాజెక్టుగా 4 మండలాలు • చట్టం అమలును కలెక్టర్లు పర్యవేక్షించాలి • భూ భారతి పోర్టల్‌ను ప్రారంభించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్14:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి పోర్టల్ ప్రారంభమైంది. రైతులకు అర్థమయ్యేలా సులభమైన భాషలో భూ భారతి పోర్టల్ రూపొందించింది. సోమవారం హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికగా ఈ భూ భారతి పోర్టల్‌ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రారంభించారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా మొదట ఆయన చిత్ర పటానికి సిఎం నివాళులర్పించారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని సిఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతరత్న బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా భూభారతి చట్టాన్ని ప్రజలకు అంకితం చేస్తున్నామని స్పష్టం చేశారు. 69 లక్షల రైతు కుటుంబాలకు భూభారతి చట్టాన్ని అంకితం చేస్తున్నామన్నారు. తెలంగాణలో జరిగిన పోరాటాలన్ని భూమి చుట్టూ తిరిగాయని ఆయన గుర్తు చేశారు. జల్.. జంగిల్.. జమీన్ నినాదంతోనే కుమురం భీమ్ పోరాడారని సిఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

తెలంగాణలో భూమి కోసం, విముక్తి కోసం దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ పోరాటం చేశారని, కమ్యూనిస్టు సోదరుల పోరాటాలన్నీ భూమి కోసమే జరిగాయి ఆయన గుర్తు చేశారు. ధరణి కారణంగా తహసీల్దార్ పైనే పెట్రోల్ పోసి తగలబెట్టే పరిస్థితి తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఇదే ధరణి కారణంగా తెలంగాణలో జంట హత్యలు సైతం జరిగాయని సిఎం వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని, ధరణిని బంగాళాఖాతంలో వేస్తుందని ఆనాడే చెప్పామని రేవంత్ గుర్తుచేశారు. భూగరిష్ఠ పరిమితి చట్టం తెచ్చి భూస్వాముల నుంచి.. మిగులు భూములను సేకరించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆయన స్పష్టంచేశారు. సేకరించిన మిగులు భూములను పేదలకు పంచింది ఇందిర ప్రభుత్వమన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం మంచి చట్టాన్ని రద్దు చేసి ధరణి తెచ్చిందని మండిపడ్డారు. అనాలోచితంగా తెచ్చిన ధరణి చట్టం ఎన్నో సమస్యలకు కారణమైందని విమర్శించారు. రెవెన్యూ సిబ్బందిని కెసిఆర్ ఎన్నో రకాలుగా అవమానించారని చెప్పారు. రెవెన్యూ సిబ్బంది అంటే ప్రజలను దోచుకునే వారిగా గతంలో చిత్రీకరించారని, గ్రామాల్లో సమస్యలను పరిష్కరించే ఉద్యోగులను సైతం తొలగించారన్నారు. రెవెన్యూ సిబ్బందిని కాంగ్రెస్ ప్రభుత్వం సంపూర్ణంగా విశ్వసిస్తుందని స్పష్టం చేశారు. కొందరివల్ల మొత్తం రెవెన్యూ శాఖను తాను దోషిగా చూడనని వారికి హామీ ఇచ్చారు. ప్రభుత్వం, అధికారులు వేర్వేరు కాదని ఆయన పేర్కొన్నారు. రెవెన్యూ సిబ్బంది, ప్రభుత్వం కలిసి నడిస్తేనే ఏదైనా సాధ్యమవుతోందని స్పష్టం చేశారు. ప్రతి మనిషికి ఆధార్ వలే.. ప్రతి భూమికి భూధార్ తెస్తామని ప్రకటించారు. ప్రతి భూమికి కచ్చితమైన సరిహద్దులతో రిజిస్ట్రేషన్ చేద్దామని ఆయన పిలుపు నిచ్చారు. ప్రతి భూమికి కొలతలు, హద్దులు వేసి రైతులకు ఇద్దామని ఈ సందర్భంగా



సిఎం పేర్కొన్నారు. గత పాలకులు రెవెన్యూ చట్టాలను మార్చి తెచ్చిన ధరణి ప్రజల పాలిట భూతంగా మారిందన్నారు. రెవెన్యూ అధికారులను దోపిడీదారులుగా చిత్రీకరించి లబ్ది పొందాలని ఆనాటి పాలకులు ఆలోచనచేశారు. చట్టాలను చుట్టాలుగా మార్చుకుని వేలాది ఎకరాలు కొల్లగొట్టిన మాట వాస్తవంకాదా? అని ప్రశ్నించారు. అందుకే పేదలకు మేలు చేసేందుకు నూతన ఆర్వోఆర్ చట్టాన్ని తీసుకొచ్చామని చెప్పారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే భూభారతిని ప్రారంభించుకున్నామని

>>2

## వక్ఫ్‌పేరుతో కాంగ్రెస్ ఓటుబ్యాంకు రాజకీయం

### హార్యానాలో ప్రధాని మోడీ



**హిస్సార్(హార్యానా), ఏప్రిల్ 14:** కాంగ్రెస్ పార్టీ వక్ఫ్ రూల్స్‌ను తమ స్వార్థానికి మార్చేసిందని కాంగ్రెస్ పార్టీపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీవ్ర విమర్శలు చేశారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్ పార్టీ "ఓటు బ్యాంకు వైరస్"ను వ్యాప్తి చేసిందని మండిపడ్డారు. అంతేకాకుండా ఎస్సీ, ఎస్టీ కాంగ్రెస్ రెండో తరగతి పౌరులుగా చూస్తోందని మోడీ ఆరోపించారు. హరియాణాలో పర్యటించిన మోడీ సోమవారం హిసార్ విమానాశ్రయం నుంచి అయోధ్యకు తొలి వాణిజ్య విమానాన్ని ప్రారంభించారు. హిసార్ ఎయిర్‌పోర్ట్‌లో కొత్త టెర్మినల్,ఇతర అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కాంగ్రెస్ పార్టీపై ధ్వజమెత్తారు. వక్ఫ్ పేరుతో భారత్‌లో లక్షల హెక్టార్ల భూమి ఉంది. వక్ఫ్ ఆస్తుల నుంచి ప్రయోజనాలను పేదలకు, ఇంకా అవసరమైన వారికి ఇచ్చి ఉంటే అదివారికి ప్రయోజనంచేకూర్చేది. కానీ ఈ ఆస్తులనుంచి భూ మాఫియా మాత్రమే ప్రయోజనం పొందుతోంది. ముస్లిం నవతరం సైకిళ్లకు పంక్చర్లు వేసుకుని బతకాల్సిన పనిలేదు. ఆ మాఫియా ఎవరి భూమిని దోపిడి చేస్తోంది? నిజానికి అనేకమంది ముస్లిం మహిళలు భారత ప్రభుత్వానికి లేఖలు రాసినతర్వాతే ఈ వక్ఫ్‌గురించి చర్చలు ప్రారంభమయ్యాయి. ఈ సవరించిన వక్ఫ్ చట్టంతో పేదల దోపిడి ఆగిపోతుంది. కొత్త వక్ఫ్ చట్టం ప్రకారం ఏ ఆదివాసీకి చెందిన భూమిపై లేదా ఆస్తిపై వక్ఫ్ బోర్డు చేయి వేయలేదు. పేద ముస్లింలు, పస్మాండ ముస్లింలు, ముస్లిం మహిళలు, ముస్లిం వితంతు మహిళలు, ముస్లిం పిల్లలు వారి హక్కులను పొందుతారు. ఇదే నిజమైన సామాజిక న్యాయం అని ప్రధాని నరేంద్ర మోడీ ఉన్నారు. కాంగ్రెస్ రాజ్యాంగాన్ని

>>2



## ఇంట్లోనే చంపేస్తాం!

### మరోసారి సల్మాన్‌కు హెచ్చరికలు

**ముంబయి, ఏప్రిల్ 14:** బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్‌కు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి వరుస హత్య బెదిరింపులు వస్తున్న విషయం తెలిసిందే. ఇటీవల కాలంలో సల్మాన్‌కు పలుమార్లు ప్రత్యక్షంగా, పరోక్షంగా బెదిరింపులు వచ్చాయి. తాజాగా మరోసారి అలాంటి బెదిరింపులే వచ్చాయి. ఈసారి దుండగులు వాట్సాప్‌ద్వారా బెదిరింపులకు పాల్పడ్డారు. సల్మాన్ ఖాన్‌ను అతని నివాసంలోనే చంపేస్తా మంటూ బెదిరించారు. అంతేకాదు అతని వాహ

>>2

## వర్గీకరణ అమలు చేస్తున్న తొలి రాష్ట్రం తెలంగాణ

### ఇకపై వచ్చే నోటిఫికేషన్లకు ఎస్సీ వర్గీకరణ వర్తింపు

### వర్గీకరణ జీవోను సిఎం రేవంత్‌కు అందించిన మంత్రులు

### అమల్లోకి వచ్చిన వర్గీకరణ చట్టం



ఎస్సీ వర్గీకరణ చట్టరూపంలోకి వచ్చిన ప్రతులను సిఎం రేవంత్‌కు అందజేస్తున్న మంత్రులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్14:** తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ జీవో విడుదలైంది. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ సర్కార్ ఈ జీవోను విడుదల చేసింది. ఈ జీవో కాపీని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి మంత్రివర్గ ఉప సంఘం చైర్మన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కో చైర్మన్ మంత్రి దామోదర రాజనర్సింహ్మా,సభ్యులు మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం సచివాలయంలో అందించారు. ఈనెల 8న ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన బిల్లును గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు సర్కార్ పంపించగా.. అందుకు గవర్నర్ ఆమోదం తెలిపారు. దీంతో ఇప్పటి వరకు ఒకే విధంగా అమలైన రిజర్వేషన్లు ఇకపై వర్గీకరణ ప్రకారం అందించనున్నారు. ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ భాషల్లో కూడా అధికారులు గెజిట్ విడుదల చేశారు. రాష్ట్రంలో మొత్తం 59 ఉప కులాలను మూడు గ్రూపులకు విభజించారు. గ్రూప్ ఏలో 15 ఉపకులాలకు ఒక శాతం రిజర్వేషన్లు కేటాయించారు. గ్రూప్ బీలో 18 ఉప కులాలకు 9 శాతం, గ్రూప్ సీలో 26 ఉప కులాలకు ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించారు. ఎస్సీ వర్గీకరణ అమలు అయిన నేపథ్యంలో ఇకపై ప్రభుత్వ ఉద్యోగాల్లో ఖాళీలను ఈ గ్రూపుల ప్రాధాన్యత ఆధారంగా భర్తీ చేయనున్నారు.

ఎస్సీ వర్గీకరణ జీవో విడుదల సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సచివాలయంలో మాట్లాడుతూ.. ఏప్రిల్ 14 (సోమవారం) నుంచి ఎస్సీ వర్గీకరణ అమలులోకి వస్తుందని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ జీవోను సిఎంకు అందజేశామన్నారు. ఎస్సీ వర్గీకరణను ఇప్పటివరకు ఏ పార్టీ ముందుకు తీసుకువెళ్లలేదన్నారు. అసెంబ్లీలో చర్చకే పరిమితం అయ్యాయని.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేసిందని చెప్పారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పువచ్చిన రెండుగంటల్లోనే తాము కీలక అడుగు ముందుకేశామన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసే వరకు ఉద్యోగ నోటిఫికేషన్ వేయమని చెప్పామన్నారు. చెప్పినట్లే ఇప్పటి వరకు నోటిఫికేషన్ ఇవ్వలేదని తెలిపారు.

మంగళవారం కేబినెట్ సబ్ కమిటీ సమావేశమై ఉద్యోగ భర్తీపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. షమీమ్ అక్తర్ ఇచ్చిన నివేదిక మేరకే రిజర్వేషన్ కల్పిస్తున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుకు రాష్ట్ర గవర్నర్ ఆమోదంతెలిపారన్నారు. సుప్రీంకోర్ట్ తీర్పు తర్వాత ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తున్న మొదటి రాష్ట్రం తెలంగాణ అని చెప్పుకొచ్చారు. మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసుకొని ముందు కెళ్లాం, కొన్ని వేల విజ్ఞప్తులు వచ్చాయి.

>>2

## ప్రజావాణిలో 68.4% ఫిర్యాదులు పరిష్కారం

### 54,619 అర్జీలు నమోదు

### సిఎం రేవంత్ సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్14:** ప్రజావాణి కార్యక్రమం విజయవంతంగా సాగుతోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. మహాత్మజ్యోతిభా ఫూలే ప్రజా భవన్‌లో వారంలో రెండు రోజులు కొనసాగుతున్న ప్రజావాణిలో ప్రజలుఇప్పటివరకు సమర్పించిన అర్జీలు, వాటిలో ఎన్ని పరిష్కారమయ్యాయి.. అర్జీల పరిష్కారానికి అధికారులు అనుసరిస్తున్న విధానాలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ప్రజావాణి నోడల్ ఆఫీసర్ దివ్యతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. వివిధ విభాగాలకు ప్రజావాణిలో ప్రత్యేక డెస్కులు ఏర్పాటు చేశామని, గల్ఫ్ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రవాసీ ప్రజావాణి ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు

>>2

## నేటి నుంచి టెట్ దరఖాస్తుల స్వీకరణ

### జూన్ 15 నుంచి 30 వరకు పరీక్షలు.. జులై 22న ఫలితాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** తెలంగాణలో నేటి నుంచి టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)కి దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఈ నెల 11న ప్రభుత్వం నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే. నేటి (మంగళవారం) నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించడం ప్రారంభించనున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఈ నెల 30 వరకు స్వీకరించనున్నారు. పేపర్-1, పేపర్-2కి రూ.750గా పరీక్ష ఫీజును నిర్ణయించారు. రెండు పేపర్లు రాయాలనుకునేవారు రూ. 1000 చెల్లించాల్సి ఉంటుంది. జూన్ 15 నుంచి 30 వరకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సిబిటి)

>>2

## 'భూభారతి'తో నా జన్మధన్యం

### రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 14 ,ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రజల భూములకు పూర్తి భద్రత, భరోసా కల్పించే భూభారతి చట్టాన్ని ప్రజలకు అందించడంతో తన జన్మధన్యమైందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గత ప్రభుత్వ దొరల హయాంలో నాలుగు గోడల మధ్య నలుగురు కలసి రూపొందించిన 2020 రెవెన్యూ చట్టం ధరణితో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోయిందని, రెవెన్యూ వ్యవస్థ కూడా తెల్లవారు ఝామున దొరగారి మదిలో మెదిలిన ఆలోచనలకు అనుగుణంగా పరిగెత్తలేకపోయారన్నారు. అందరి గుండెల్లో రైళ్లు పరిగెత్తించే ఈ చట్టాన్ని స్వార్థప్రయోజనాలకోసం ఉపయోగించుకోవడానికి గ్రామపరిపాలనాధికారుల వ్యవస్థను కూడా నాడురద్దు చేశారన్నారు. సిఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇతర సహచర మంత్రులు ఎంతో కృషి చేసి రూపొందించిన ఈ చట్టాన్ని అసెంబ్లీలో ప్రవేశపెడితే బిఆర్ఎస్ సభ్యులు ఏ విధంగా అపహాస్యం చేశారో, అడ్డుకోవడానికి ప్రయత్నించారో గమనించాలన్నారు. 2020 రెవెన్యూచట్టం మూడేళ్లలో ముగిగి పోగా, నేటి 2025 భూభారతి చట్టం వందేళ్లు వర్ధిల్లుతుంది. ఈ చట్టాన్ని సమర్థవంతంగా ప్రజలకు అందించేందుకుగాను 4 జిల్లాల్లోని 4 మండలాలను పైలట్ ప్రాజెక్ట్‌కింద ఎంపిక చేశామని తెలిపారు ఖమ్మం, మహబూబ్‌నగర్, ములుగు, కామారెడ్డి జిల్లాలను ఎంపికచేసినట్లు తెలిపారు. అధికారులే ప్రజల వద్దకువచ్చి సమస్యలు స్వీకరించి 15 రోజుల్లో పరిష్కరిస్తారన్నారు. ఈనెల 17 నుంచి కలెక్టర్లు రాష్ట్రంలో అన్ని మండలాల్లో ఈ చట్టంపై అవగాహనా సదస్సులు నిర్వహిస్తారని తెలిపారు. రాష్ట్రంలో అన్నివర్గాల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకొని, భేషిజాలకు పోకుండా అవసరమైన మార్పులుచేసి జూన్ 2 తేదీనాటికి సమగ్ర చట్టాన్ని ఉపయోగంలోకి తీసుకువస్తామన్నారు.

మే మొదటివారంలో రాష్ట్రంలో మిగిలిన 29 జిల్లాలలో ఒక్కో మండలాన్ని ప్రయోగాత్మకంగా ఎంపిక చేసి సమస్యలను స్వీకరించి భూభారతి చట్టాన్ని పటిష్టపరుస్తామన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పులను సవరిస్తామని, దీనికోసం ఎమ్మార్వో స్థాయిలో అధికారుల బృందం పనిచేస్తుందన్నారు. చట్టాన్ని ప్రజలకోసం ఇందిరమ్మప్రభుత్వం రూపొందించినా దీనిని సమగ్రంగా ప్రజలకు అందించాల్సిన బాధ్యత అధికారులదే అన్నారు.

## ఆలస్యంతో.. అసంతృప్తి..!

### మంత్రివర్గ విస్తరణ నిరవధిక వాయిదా

**హైదరాబాద్, ఏప్రిల్ 14,ప్రభాతవార్త:** రాష్ట్రమంత్రివర్గ విస్తరణ ఆలస్యమవతుండటంతో ఔత్సాహికులు అసంతృప్తిని బహిరంగ వేదికలపై వెళ్లగక్కుతున్నారు. ముఖ్యమంత్రి మంత్రిమండలిని నిర్ణయించుకొనే స్వేచ్ఛ కాంగ్రెస్‌లో ఉండకపోవడంతో ప్రతిబంధకంగా మారింది. తనకు మంత్రి పదవులు దక్కకుండా చేస్తున్నారంటూ ఏకంగా అధిష్టానంను లక్ష్యంగా విమర్శలు చేస్తున్నారు. సమిష్టి నిర్ణయంతో మంత్రిమండలి కూర్పుచేస్తామని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్‌కుమార్ అసంతృప్తిని జోకొడుతున్నారు. ప్రస్తుతం మంత్రి మండలిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు పదకొండు మందిమంత్రులు ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల నుంచి మంత్రివర్గ విస్తరణపై ఊహాగానాలు మొదలైనాయి. ఆషాఢం, హరియాణ ఓటమి, రాహుల్ విదేశి పర్యటన, ముఖ్యమంత్రి దావోస్‌పర్యటన, అంటూ మంత్రివర్గం విస్తరణ చేయకుండా గత పదహారు నెలలుగా వాయిదా వేస్తూ వచ్చారు. గతసంవత్సరం అక్టోబర్ నెల 16,17 తేదీల్లో మంత్రివర్గ విస్తరణపై తెలంగాణ నాయకులతో అధిష్టానం సమావేశమైనా ఏకాభిప్రాయం కుదరక వాయిదావేశారు.

ఉగాది రోజు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను విస్తరణ కోసమే కలిశారని ఎవరెవరికి మంత్రి పదవులు లభించవచ్చనే ఊహాగానాలతో చర్చలు సాగాయి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వివాదం ముందుకు రావడంతో ఏప్రిల్ మొదటివారం కొనసాగిన మంత్రివర్గ విస్తరణ తెరవెనక్కిపోయింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా విద్యాశాఖ,హోంశాఖ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వంటి కీలకశాఖలు నేనే పర్యవేక్షిస్తానని ఇటీవల నొక్కి చెప్పుతుండటంతో మంత్రివర్గ విస్తరణ అవకాశాలు తక్కువే అనే కాంగ్రెస్ ముఖ్యనేతలే అభిప్రాయపడుతున్నారు. దీనికి తోడు కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి అదిష్టానానికి లేఖరాయడంతో మంత్రివర్గ విస్తర

>>2

## రాజకీయ కుట్రలు చేస్తున్న బిఆర్ఎస్, బిజెపి

### డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క



మంచిర్యాలలో సోమవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డి.సిఎం భట్టి, మంత్రి శ్రీధర్ బాబు

**మంచిర్యాల, ఏప్రిల్ 14, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలు, బిసి కుల గణన, ఎస్సీ వర్గీకరణతో దళితులు, బీసీలు, గిరిజనులు లాభపడడం ఇష్టంలేని బిఆర్ఎస్, బిజెపి పక్షాలు రాష్ట్రంలో రాజకీయ అరాచకం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయి డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కఅన్నారు. సోమవారం ఆయన స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ బహిరంగసభలో ప్రసంగించారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం బీసీ కుల సర్వే, ఎస్సీ వర్గీకరణ వంటి పెద్ద కార్యక్రమాలు చేపట్టింది వాటిని అడ్డుకోలేక బిఆర్ఎస్, బిజెపి నేతలు రాజకీయ కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. నాడు పివి నరసింహారావు ఉమ్మడి రాష్ట్రంలో పెద్ద ఎత్తున భూసంస్కరణలు చేపట్టగా దానిని అడ్డుకునేందుకు జై ఆంధ్ర ఉద్యమం తెచ్చారని, అదే తరహాలో ప్రస్తుతం రాష్ట్రంలో బిఆర్ఎస్, బిజెపి రాజకీయాలు చేస్తున్నాయని అన్నారు. కుల గణన ద్వారా ఎవరి జనాభా ఎంతో గుర్తించి సంక్షేమ ఫలాలు పంచుతామని, సామాజిక పరివర్తన కాంగ్రెస్ సిద్ధాంతం ఇదే నిర్ణయంతో సిఎం రేవంత్ రెడ్డి యావత్ క్యాబినెట్ ముందుకు పోతుందని తెలిపారు.

ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవడం బిఆర్ఎస్, బిజెపి నేతల తరం కాదని అన్నారు. సామాజిక పరివర్తన కోసం కుల గణనసర్వేచేసి వదిలిపెట్టలేదని అసెంబ్లీలో తీర్మానం చేసి దేశవ్యాప్తంగా అమలు చేయాలని ఢిల్లీలో సిఎం

>>2

## కలెక్టర్లకు సిఎం సీరియస్ వార్నింగ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్14:** కలెక్టర్లపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టర్లతో సమావేశమైన సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ చాలా మంది రెగ్యులర్ వర్క్ షీట్ పంపడం లేదని,క్షేత్ర స్థాయికి వెళ్లడం లేదని పేర్కొన్నారు. పని తీరు మార్చుకోవడం లేదని, అలాంటి వాళ్లు... సిఎస్‌ను కలిసి మేము గ్రౌండ్ వర్క్ చేయలేం అని రిపోర్ట్ చేయండీ, ఎసి కింద పనిచేస్తాం అంటే, అక్కడ పోస్టింగ్ ఇస్తాం. మీరేం చేస్తున్నారు అనేది మా దగ్గర సమాచారం ఉంది అని చెప్పారు. ఇకపై డైలీ సిఎంఓకి మీ వర్క్ పర్ఫార్మెన్స్ పంపండి.

చాలాసార్లు చెప్పినా కొందరు మారడంలేదు అని వార్నింగ్ ఇచ్చారు. రోజు రెండు మండలాలు తిరిగి రెవెన్యూ సదస్సు పెట్టండీ, త్వరలో కలెక్టర్‌లతో సిఎం వన్ టు వన్ సమావేశాలు ఉంటాయని తెలిపారు.

భూభారతి,ఇందిరమ్మ ఇండ్లు,తాగునీటి సరఫరా అంశాల్లో నిర్లక్ష్యం సహించమని చెప్పారు. ఎక్కడా లోపాలు జరగకుండా చర్యలు తీసుకోండీ, భూభారతి చట్టంపై కలెక్టర్లకు పూర్తి అవగాహన ఉండాలని చెప్పారు. చట్టంపై ప్రజలకు సరళంగా వివరించాలని ఆదేశించారు.

## ట్రంప్‌కు షాకిచ్చిన చైనా

5లో



సోమవారం పార్లమెంటులోని బిఆర్ అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్రపతి ముర్ము

# భూభారతిపై క్షేత్రస్థాయి అవగాహన

## ఇందిరమ్మ ఇళ్లకు ఇన్‌ఛార్జి మంత్రుల అనుమతి

## వేసవి నీటిఎద్దడిపై తక్షణ ప్రణాళికలు

## జిల్లా కలెక్టర్లతో సిఎం రేవంత్ సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్14:** రైతుల భూ సమస్యల శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా ఎంతో అధ్యయనంతో తీసుకువచ్చిన భూ భారతి చట్టాన్ని క్షేత్ర స్థాయికి సమర్థంగా తీసుకెళ్లాలని జిల్లాల కలెక్టర్లకు ముఖ్య మంత్రి ఏ.రేవంత్ రెడ్డి సూచించారు.ఇందుకు ప్రతి మండలంలో సదస్సు నిర్వహించాలని, ప్రతి కలెక్టర్ మండల స్థాయి సదస్సులకు హాజరై అక్కడ రైతులు,ప్రజలు లేవనెత్తే సందేహాలకు వారికి అర్థమయ్యే భాషలో వివరించి పరిష్కారం చూపాలన్నారు. ఎంసీహెచ్‌ఆర్‌డిలో సోమవారం నిర్వహించిన సమావేశంలో భూ భారతి, ఇందిరమ్మ ఇళ్లు, వేసవి తాగు నీటి ప్రణాళికపై సిఎం జిల్లాల కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. భూ భారతి, ఇందిరమ్మ ఇళ్లను తాము ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామని,ఈ రెండింటిని క్షేత్ర స్థాయికి తీసుకెళ్లడంలో కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. భూభారతి చట్టాన్ని కలెక్టర్లు సమగ్రంగా అధ్యయనం చేయాలని సిఎం అన్నారు. గతంలో రెవెన్యూ సమస్యల పరిష్కారాన్ని పట్టించుకోకుండా రైతులను న్యాయస్థానాలకు పంపారని.. భూభారతి చట్టంలో రెవెన్యూ యంత్రాగమే ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని, అప్పీల్ వ్యవస్థ ఉన్న విషయాన్ని రైతులు, ప్రజలకు వెల్లడించాలని సిఎం తెలిపారు.భూభారతి పైలెట్ ప్రాజెక్టు సదస్సులను నారాయణ పేట జిల్లా మద్దూర్, ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, కామారెడ్డి జిల్లా లింగంపేట, ములుగు జిల్లా వెంకటాపూర్ మండలాల్లో నిర్వహిస్తారని, ఆయా మండల కేంద్రాల్లో సదస్సులకు కలెక్టర్లు కచ్చితంగా హాజరుకావాలని, ఆయా మండలాల్లో ప్రతి గ్రామంలో రెవెన్యూ సిబ్బందితో సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయించినందున జనాభా ప్రాతిపదికన, ఆయా గ్రామాలకు ఇళ్ల కేటాయింపు ఉండాలని, ఈ విషయంలో హేతుబద్ధత పాటించాలని సిఎం సూచించారు. నిర్దేశిత సమయం ఆధారంగా ఇళ్ల నిర్మాణాలు సాగించాలని, ఇందుకు కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సిఎం ఆదేశించారు. వేసవి కాలంలో ఎక్కడా తాగు నీటి సమస్య తలెత్తకుండా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. తాగు నీటి సరఫరా విషయంలో నీటి పారుదల శాఖ, తాగు నీటి సరఫరా శాఖ, విద్యుత్ శాఖ సమన్వయంతో పని చేయాలని ముఖ్యమంత్రి అన్నారు. కలెక్టర్లు సైతం డ్యాష్ బోర్డు ద్వారా ప్రతి గ్రామంలో తాగు నీటి వనరులు, సరఫరాపై పర్యవేక్షణ చేయాలని సూచించారు.ఎక్కడైనా సమస్య తలెత్తితే ఎలా పరిష్కరించాలనే దానిపై ప్రత్యామ్నాయ ప్రణాళిక ఉండాలన్నారు. పలు గ్రామాలకు తాగు నీటి సరఫరా పైపులైను వ్యవస్థ లేదని,పలు ఇళ్లకు నల్లాలు లేవని,ఆయా ప్రాంతాల్లోనూ తాగు నీటి సమస్య రాకుండా చూడాలని సిఎం అన్నారు.

## ప్రతి భూమికి 'భూదార్'

>> పేర్కొన్నారు. పైలట్ ప్రాజెక్టుగా నాలుగు మండలాల్లో చేపడుతున్నామని ప్రకటించారు. భూ భారాతితో వివాదాలు లేని భూములను రైతులకు కానుకగా ఇస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. వివాద రహిత భూ విధానాలను తీసుకురావాలని మా ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. రైతులకు అర్థమయ్యేలా సులభమైన భాషలో భూభారతి పోర్టల్ ఉంటుందని పేర్కొన్నారు. ఈ చట్టాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత రెవెన్యూ అధికారులపైనే ఉందని,రెవెన్యూ అధికారులను ప్రజలకు చేరువ చేయాలనేదే ఉద్దేశమన్నారు. గత పాలకుల్లా మిమ్మల్ని ప్రజల ముందు దోషులుగా నిలబెట్టే ఆలోచనకు మేం వ్యతిరేకమన్నారు. ఆనాటి ముఖ్యమంత్రి రెవెన్యూ అధికారులపై అసెంబ్లీ సాక్షిగా ఏం మాట్లాడారో మీకు తెలుసు అని గుర్తు చేశారు. మేం అవినీతికి పాల్పడే వ్యక్తులపైన కఠినంగా ఉంటాం.. కానీ వ్యవస్థపై కాదు మేం చేసే తప్పులకు మిమ్మల్ని దోషులుగా నిలబెట్టే విధానానికి నేను వ్యతిరేకం అని స్పష్టం చేశారు. భవిష్యత్‌లో ఆధార్ లాగే భూమికి సంబంధించి భూధార్ తీసుకొస్తామని చెప్పారు.

రాబోయే రోజుల్లో వ్యవసాయ భూములను సర్వే చేసి కొలతలు వేసి హద్దులు గుర్తిస్తాం, రెవెన్యూ అధికారులపై దురుద్దేశంతో కొందరు కల్పించిన అపోహలను తొలగిద్దామని చెప్పారు. కలెక్టర్లు ప్రతీ మండలంలో పర్యటించాలని ఈ వేదికగా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అందరి సహకారంతో చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు.జూన్ 2వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ పోర్టల్ అమలు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాకాలు చేస్తోంది. అయితే ఈ పోర్టల్‌ను అప్ డేట్ చేసేందుకు ప్రజలనుంచి సూచనలు,సలహాలను స్వీకరిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ఓ ప్రకటనలో వెల్లడించిన సంగతి తెలిసిందే. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వసలహాదారులు,సిఎస్ శాంతికుమారితోపాటు పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# ఆలస్యంతో.. అసంతృప్తి..!

>> జఐకు బ్రేక్ పడిందని కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో మంత్రి పదవులు ఆశించేవారి సంఖ్య పెరగడంతో ఆరుబెర్తులను సామాజిక సమీకరణాలకు అనుగుణంగా సర్దుబాటు చేయడం అధిష్టానంకు కూడా కత్తిమీద సాములా మారుతోన్నది. కాంగ్రెస్ పార్టీ అధికారంలో రాకముందు అవసరాన్ని బట్టి కొంత మందికి మంత్రి పదవులు ఎరగామాపి ఆశపెట్టారు. మంత్రి మండలిలోకి తీసుకోవడానికి భౌగోళిక, సామాజిక,కులంల పరమైన సమీకరణాలు అడ్డుపడుతున్నాయని కాంగ్రెస్ అధిష్టానం మదమతిప్పడంతో ఇన్నాళ్లు మంత్రి పదవులు వస్తాయని చెప్పుకొని తిరిగినవారు భంగపడి ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. మునుగుగోడు ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్‌రెడ్డి వండూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతనకార్యవర్గం సమావేశంలో మాట్లాడుతూ జానారెడ్డి అధిష్టానానికి లెటర్ పెట్టడంతో మంత్రివర్గ విస్తరణ ప్రక్రియ మొదటికి వచ్చిందని అసంతృప్తి వ్యక్తంచేశారు. సీనియర్ నేత జానారెడ్డి తనకు మంత్రి పదవి రాకుండా ధృతరాష్ట్రుడిలా అడ్డపడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరా ప్రేమ్‌సాగర్ అంబేద్కర్ జయంతి సాక్షిగా మాట్లాడుతూ మంత్రి పదవి తనకు ఇవ్వకుంటే అధిష్టానం తనతో కాదు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాకు ఆదివాసులకు పార్టీ కార్యకర్తలకు అన్యాయం చేసినట్లే అని మండిపడ్డారు. పదేళ్ళ పార్టీని కాపాడుకొంటే ఇదేనా మాకు ఇచ్చే గౌరవం అంటూ ఆయన నిలదీశారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మక్తల్ ఎమ్మెల్యే ముదిరాజ్ బిడ్డ శ్రీహరికి మంత్రివర్గంలో చోటు కల్పిస్తానని లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ప్రకటించారు. డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క, శ్రీధర్‌బాబు మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుకు శాసనసభ ఎన్నికల ముందే మంత్రివర్గంలో తీసుకొంటామని హామీ ఇచ్చారు. ఇటీవల ప్రేమ్‌సాగర్‌రావును పెద్ద పోస్టులో చూస్తారని మంత్రి శ్రీధర్‌బాబు మంచిర్యాల సభలో ప్రకటించారు. నలుగురు ఉమ్మడి హైదరాబాద్,రంగారెడ్డి,నిజామాబాద్ జిల్లా నుంచి కూడా మంత్రివర్గంలో ప్రాతినిధ్యంలేదు. ప్రస్తుతం ఆరు ఉమ్మడి జిల్లాల నుంచి మాత్రేమ మంత్రివర్గంలో ప్రాతినిధ్యం కలిగి ఉంది. ఖమ్మం జిల్లా నుంచి అత్యధికంగా ముగ్గురు మంత్రి వర్గంలో ప్రాతినిధ్యం కలిగి ఉండగా, మహబూబ్‌నగర్, నల్లగొండ, కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరేసి మంత్రులు ఉన్నారు. మెదక్ నుంచి దామోదర రాజనర్సింహ, వరంగల్ నుంచి కొండ సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సినినటుడు నాగార్జునపై విమర్శలు చేసిన కొండా సురేఖను పక్కనబెట్టి వరంగల్ జిల్లావాసిగా ప్రచారంలో ఉన్న విజయశాంతికి బిసి కోటాలో మంత్రి పదవి ఎఐసిసి కోటాలో ఇవ్వాలని కసరత్తు చేయడం కూడా స్థానిక నేతలకు మింగుడు పడటంలేదు.

# ఇద్దరు రైతుల బలవన్మరణం

**హైదరాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త :** వ్యవసాయం నిమిత్తం చేసిన అప్పులు తీరే మార్గం కనిపించక రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ములుగు జిల్లా మంగపేట మండలం మల్లూరు పంచాయతీ పరిధిలోని యాలం నర్సింహారావు (45) తనకున్న ఐదెకరాల పొలంతో పాటు, మరో 22 ఎకరాల పొలం కౌలుకు తీసుకున్నారు. పంటలు చేతికొచ్చాక ఇటీవల కురిసిన భారీ వడగండ్ల వానకు అన్ని పంటలు పూర్తిగా నేలపాలయ్యాయి. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన నర్సింహారావు దెబ్బతిన్న చేను వద్దనే పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆదిలాబాద్ జిల్లా దౌన గ్రామానికి చెందిన రైతు రాథోడ్ అరవింద్ (35) తనకున్న నాలుగెకరాల్లో పత్తి, కంది పంటలను సాగు చేశారు. ఈ వ్యవసాయ పెట్టుబడుల నిమత్తం 3లక్షల రూపాయలు అప్పు తీర్చలేక పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

# కుట్రలు చేస్తున్న బిఆర్ఎస్, బిజెపి

>> రేవంత్ రెడ్డి, మంత్రులు ధర్నా నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. దేశ సంపద పదిమంది క్రోనీ క్యాపిటల్స్ చేతిలో బందీ అయిందని దానిని బద్దలు కొట్టి దేశ ప్రజలకు పంచాలని ఇటీవల గుజరాత్‌లో రాహుల్ గాంధీ తీర్మానం చేశారని వివరించారు. రాహుల్ గాంధీ దార్శనికుడు, అదానీ అంబానీ వంటి క్రోనీ క్యాపిటల్స్ దేశ సంపదను దోపిడీ చేస్తున్న విషయాన్ని భారత్ జోడోయాత్ర ద్వారా దేశ ప్రజలకు చాటి దిశా నిర్దేశం చేశారని వివరించారు. సంపద సృష్టించాలి ప్రజలకు పంచాలన్న రాహుల్ గాంధీ మాటకు కట్టుబడి రాష్ట్ర క్యాబినెట్ మొత్తం పనిచేస్తుందన్నారు. బాబా సాహెబ్ అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును ప్రారంభించి సాగునీరు అందిస్తాం అని అన్నారు. సాధారణ ఎన్నికల ముందు ఇదే ఏప్రిల్ 14న మంచిర్యాల కేంద్రంలో తాను చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ సభకు ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరై సాధారణ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభంజనం సృష్టిస్తుందని ముందే చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఆనాడు పిసిసి అధ్యక్షుడుగా రేవంత్ రెడ్డి, సీఎల్పీ నేతగా తాను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించగా స్థానికులు చూపిన ఆదరణను మర్చిపోలేమని అన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. ప్రతి పాఠశాలను 25 ఎకరాల్లో 200 కోట్ల పెట్టుబడితో నిర్మిస్తున్నాం, రాష్ట్రంలో ఒకేసారి 58 పాఠశాలల నిర్మాణానికి 11,600 కోట్లు ఒకేసారి విడుదల చేశాం. దేశ చరిత్రలో ఎక్కడ ఇలాంటి సంఘటన జరగలేదన్నారు. అటవీ హక్కుల కింద గిరిజనులకు భూములు పంపిణీ చేస్తే గత పాలకులు మహిళలని చూడకుండా చెట్టుకు కట్టేసి కొట్టిన సంఘటనలు ఉన్నాయి. మేము అడవి బిడ్డల కోసం 12,500 కోట్లతో ఇందిరా గిరి జలవికాసం పథకం చేపడుతున్నామని ఈ పథకం ద్వారా సోలార్ విద్యుత్ ద్వారా పంపుసెట్ల నిర్వహణ, డ్రిప్పు, స్ప్రింక్లర్లను వినియోగించి గిరిజన రైతుల ద్వారా అవకాడో, వెదురు వంటి పంటలు సాగు చేయిస్తాం అన్నారు.

10 సంవత్సరాల పాలనలో టిఆర్ఎస్ మహిళలను మరిచిపోయింది. మేం అధికారంలోకి రాగానే కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలని నిర్ణయించాం. ఐదు సంవత్సరాల్లో మహిళా సంఘాలకు లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేస్తున్నము. అందులో భాగంగా మొదటి సంవత్సరం లక్ష్యానికి మించి 21 వేల కోట్లు వడ్డీ లేని రుణం కింద అందించాం. మహిళా సంఘాలతో సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు 1000 మెగావాట్ల ఒప్పందం కుదుర్చుకుందామని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ క్యాంటీన్లు, వారి నుంచి ఆర్టీసీకి లీజుకు బస్సులు తీసుకోవడం వంటి కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా మహిళ పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఉద్యోగాల కోసం యువత కోరి కొట్లాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నారు. వారి ఆశలు నిజం చేసేందుకు ఇప్పటికే 56,000 ఉద్యోగాలు భర్తీ చేసాం, ప్రభుత్వ ఉద్యోగాలు రాని యువత కోసం 9,000 కోట్ల తో రాజీవ్ యువ వికాసం స్వయం ఉపాధి పథకాన్ని ప్రారంభించాం. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజు నిరుద్యోగ యువకులకు రాజీవ్ యువ వికాసం కింద శాంక్షన్ లెటర్లు రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేస్తామని తెలిపారు. రెండు లక్షల వరకు రైతు రుణమాఫీ కింద మూడు నెలల వ్యవధిలోనే 21 వేల కోట్లు రైతుల ఖాతాలో జమ చేసాం అన్నారు. రాష్ట్రంలోని 3.10 కోట్ల మంది పేదలకు ఉగాది నుంచి సన్న బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నాం ఇందుకుగాను ప్రజా ప్రభుత్వం ప్రతి సంవత్సరం 13,525 కోట్లు ఖర్చు చేస్తుందని వివరించారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా అర్హులైన మహిళలకు 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ పంపిణీ చేస్తున్నాం. ఈ పథకం ద్వారా 43 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుంది. సబ్సిడీ కింద రాష్ట్ర ప్రభుత్వం పేదల పక్షాన 433 కోట్లు ఇప్పటికే చెల్లించిందని తెలిపారు.

200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు గృహజ్యోతి పథకం కింద ఇప్పటి వరకు 50 లక్షల కుటుంబాలు లబ్ధి పొందాయని వారి పక్షాన ప్రభుత్వం విద్యుత్ సంస్థలకు 1,7 75 కోట్ల సబ్సిడీ మొత్తాన్ని చెల్లించిందని తెలిపారు. సోమవారం ఒక్కరోజే మంచిర్యాల నియోజకవర్గంలో సుమారు 1,000 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభోత్సవాలు చేసుకున్నాం మంచిర్యాల అభివృద్ధికి ఇది ఆరంభం మాత్రమే అన్నారు. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# తొలి రాష్ట్రం తెలంగాణ

>> వాటిని ఎంతో అధ్యయనం చేశామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఆక్ట్ నెం.15 పేరుతో లా సెక్రటరీ మూడు భాషల్లో గెజిట్ విడుదల చేశారని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ అమలు కోసం షెడ్యూల్డ్ కాస్ట్ డిపార్ట్‌మెంట్ జీవో నంబర్ 9ని విడుదల చేసిందని తెలిపారు. ఈ క్షణం నుంచే వర్గీకరణ అమలు అవుతుందన్నారు. రూల్స్‌కోసం జీవో నంబర్ 10ని విడుదల చేశామన్నారు. జీవో నంబర్ 99 ప్రకారం రోస్టర్ పాయింట్స్ కేటాయింపు ఉంటుందని ఈ చారిత్రాత్మక ఘట్టంలో పాల్గొనడం చాలా సంతోషమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రాబోయే జనాభా లెక్కల ఆధారంగా ఎస్సీ రిజర్వేషన్ పెంచుతామన్నారు. త్వరలోనే పెద్దసంఖ్యలో ఖాళీలు భర్తీ చేయబోతున్నామని అన్ని నోటిఫికేషన్లలో ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్లు వర్తిస్తుందని వెల్లడించారు.

ఇదే సమయంలో గత ఏడాది ఫస్ట్ ఆగస్టుకు ముందు ఇచ్చిన నోటిఫికేషన్లకు ఈ రిజర్వేషన్లు వర్తించవు అని క్లారిటీ ఇచ్చారు. సోమవారం నుంచి ఎస్సీ వర్గీకరణ అమల్లోకి వచ్చిందని మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. దళితుల్లో సామాజిక,ఆర్థిక వ్యత్యాసాలు ఉండకూడదన్నారు. ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసుకున్నాం. కొన్నివేల విజ్ఞప్తులు అందుకుని అధ్యయనం చేశామన్నారు. విద్య,ఉద్యోగాల్లో ఇకపై ఇచ్చే నోటిఫికేషన్లకు ఎస్సీ వర్గీకరణ అమలవుతుందని తెలిపారు. ఇక నుంచి భారీ స్థాయిలో ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వబోతున్నామని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పులోని అంశాలు, ఎంపిరికల్ డేటా, విద్య, ఉద్యోగ అవకాశాలు, సామాజిక, ఆర్థిక, రాజకీయ పరమైన స్థితిగతులను పరిగణలోకి తీసుకుని 59 షెడ్యూల్డ్ కులాలను 3 గ్రూపులుగావర్గీకరించి, రిజర్వేషన్లను కేటాయించాలని వన్ మ్యాన్ కమిషన్ సూచించిందని తెలిపారు.రిపోర్ట్ ఆధారంగా అత్యంత వెనుకబడిన 15 కులాలను గ్రూపు 1లోచేర్చి, వారికి 1శాతం రిజర్వేషన్ కేటాయించడం జరిగిం దన్నారు. వీరికి జనాభా ప్రకారం 0.5 శాతం రిజర్వేషన్ రావాల్సి ఉన్నప్పటికీ, వారు అత్యంత వెనుకబడి ఉన్నందున ఒక శాతం రిజర్వేషన్లు కల్పించి, వారి అభ్యున్నతికి అండగా నిలుస్తున్నామన్నారు. రిజర్వేషన్ల ద్వారా మధ్యస్తంగా ప్రయోజనం పొందిన 18 కులాలను గ్రూపు 2లో చేర్చి, వీరికి 9 శాతం రిజర్వేషన్ కేటాయించామని తెలిపారు. మెరుగైన ప్రయోజనం పొందిన 26 కులాలను గ్రూప్ 3లో చేర్చి, వారికి 5 శాతం రిజర్వేషన్ కటాయించామన్నారు. మొత్తం 59 కులాల్లో 33 కులాలు పాత వర్గీకరణలో ఏ గ్రూపులో ఉన్నాయో, కొత్త వర్గీకరణలోనూ అదే గ్రూపులో కొనసాగుతున్నాయని తెలిపారు. 26 కులాలు మాత్రమే షఫిల్ అయ్యాయి.

మొత్తం ఎస్సీల జనాభాలో ఈ 26కులాల జనాభా 3.43 శాతం మాత్రమే అని చెప్పారు. 2026 జనాభా లెక్కల తర్వాత, ఎస్సీల జనాభాకు అనుగుణంగా ఎస్సీల రిజర్వేషన్లను పెంచడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతరిజర్వేషన్ల ప్రకారమేరాబోయేరోజుల్లో ఉద్యోగాలభర్తీజరుగు తుందని, త్వరలోనే ఉద్యోగ నోటిఫికేషన్లు రానున్నాయి. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని ఉద్యోగాలను సాధించుకునేందుకు యువత సిద్ధంగాఉండాలని చెప్పారు. ఇప్పటికే ఇచ్చిన ఉద్యోగనోటిఫికేషన్లకు వర్గీకరణ వర్తించదని స్పష్టం చేశారు. 2013లో సమైక్యరాష్ట్రంలో ఉప ముఖ్యమంత్రిగా ఎస్సీ సబ్‌ప్లాన్ చేసే అవకాశం, ఆతర్వాతతెలంగాణ రాష్ట్రఏర్పాటు ఆవశ్యకతను సీడబ్ల్యూసీలో సోనియా గాంధీ సహా కాంగ్రెస్ నాయకత్వానికి, నాటి కేంద్ర ప్రభుత్వ పెద్దలకు వినిపించే అవకాశందక్కడం, ఇప్పుడు ఎస్సీ వర్గీకరణ అంశంభాగమయ్యే అవకాశం దక్కడం నా అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.

## వారం - వర్జ్యం

తేది : 15-04-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
కృ.విదియ ఉ.10.55
విశాఖ రా.3.10
వర్జ్యం ఉ.7.37-9.13
దు.ఉ.8.22-9.12, 2) రా.11.24-12.14
శుభసమయం : ఉ.6.10-6.40
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** చేపట్టిన పనులలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. అధిక శ్రమ పెరుగుతుంది.

**వృషభం:** అనుకోని అతిథులనుండి శుభవార్తలు అందుకుంటారు. సంఘంలో గౌరవం పొందుతారు.

**మిథునం:** ఆస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. తీర్థయాత్రలు చేస్తారు.

**కర్కాటకం :** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. రుణబాధలు తీరి ఊరట చెందుతారు.

**సింహం:** పూర్వపు మిత్రులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు. విందు, వినోదాలు పాల్గొంటారు.

**కన్య :** సంఘంలో కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. ఆకస్మిక ప్రయాణాలలో నూతనపరిచయాలు.

**తుల :** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. అనుకోని ఖర్చులు పెరుగుతాయి.

**వృశ్చికం:** విలువైన వస్తువులు, పత్రాలు జాగ్రత్త. సోదరులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.

**ధనుస్సు:** ముఖ్యమైన పనులు నిదానంగా పూర్తిచేస్తారు. బంధువులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు.

**మకరం:** మిత్రుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. దైవ దర్శనాలు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే.

**కుంభం:** దూర ప్రాంతాల నుండి వచ్చిన వార్త ఆశ్చర్యం కలిగిస్తుంది. ఖర్చులు పెరుగుతాయి. ప్రయాణాలు.

**మీనం :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. మిత్రుల నుండి శుభవార్తలు అందుకొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



సోమవారం హర్యానాలోని యమునా నగర్‌లో జరిగిన కార్యక్రమంలో అంబేద్కర్ రేఖా చిత్రాన్ని ప్రధాని మోడీకి అందజేస్తున్న కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్

# ఇంట్లోనే చంపేస్తాం!

>> నాన్ని బాంబులు పెట్టి పేల్చేస్తామని మెసేజ్ చేశారు. వర్లి రవాణా శాఖ అధికారిక వాట్సాప్ నంబర్‌కు ఈ బెదిరింపు మెసేజ్ వచ్చినట్లు ముంబై పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై వర్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు చెప్పారు. తదుపరి దర్యాప్తు జరుగుతోందని ముంబై పోలీసులు వెల్లడించారు. 1998 కృష్ణ జింక కేసు నుంచి సల్మాన్ ఖాన్ లారెన్స్ బిష్ణోయ్ గాంగ్ టార్గెట్ జాబితాలో టాప్ ప్లేస్‌లో ఉన్నాడు. ఈ గ్యాంగ్ నుంచి సల్మాన్ అనేక సార్లు హత్య బెదిరింపులు ఎదుర్కొన్నాడు. గతేడాది ఏప్రిల్‌లో గెలాక్సీ అపార్ట్‌మెంట్ వద్ద కాల్పుల ఘటన చోటు చేసుకున్న విషయం తెలిసిందే. మోటారు బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు సల్మాన్ ఇంటి ముందు నాలుగు రౌండ్లు కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు. ఇక ఈ కేసును దర్యాప్తు చేస్తున్న క్రమంలోనే జూన్‌లో మరోసారి సల్మాన్ హత్యకు కుట్ర జరిగింది. పన్వేల్ ఫామ్‌హౌస్ నుంచి ఇంటికి వెళ్తున్న మార్గంలో సల్మాన్‌పై దాడి చేయాలని ఈ గ్యాంగ్ ప్లాన్ చేసినట్లు గుర్తించిన పోలీసులు.. దర్యాప్తు చేస్తున్నారు.

మరోవైపు వరుస హత్య బెదిరింపుల నేపథ్యంలో సల్మాన్ పూర్తి భద్రతా వలయంలో ఉన్నారు. తన వ్యక్తిగత రక్షణ విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ నుంచి ప్రాణహాని ఉన్న నేపథ్యంలో ముంబయి పోలీసులు సల్మాన్‌కు వైప్లస్ భద్రతను సమకూర్చారు. మరిన్ని రక్షణ చర్యల్లో భాగంగా సల్మాన్‌ఖాన్ ముంబైలో నివాసంఉండే గెలాక్సీ అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్‌కు బుల్లెట్‌ప్రూఫ్ గ్లాస్ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. వరుస బెదిరింపుల నేపథ్యంలో సల్మాన్‌ఖాన్ షూటింగ్స్ పరంగా కూడా చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అవుట్‌డోర్ షూటింగ్స్‌కు దూరంగా ఉంటున్నారు. వరుసబెదిరింపులపై సల్లూ భాయ్ ఇటీవలే స్పందించారు. తాను దేవుడిని నమ్ముతానని, ఆ అల్లానే అన్నీ చూసుకుంటాడంటూ వ్యాఖ్యానించారు. నేను దేవుడిని ఎక్కువగా నమ్ముతాను. ఆయనే అన్నీ చూసుకుంటాడు. ఆయుష్షు ఉన్నంత కాలం జీవిస్తాను. ఈ బెదిరింపులతో ఇంటి వద్ద, షూటింగ్ లొకేషన్స్ ఇలా అన్ని చోట్లా నా చుట్టూ భద్రత పెరిగింది. కొన్ని సార్లు ఈ భద్రత కూడా సవాలుగా అనిపిస్తుంది అని చెప్పారు.

# 68.4% ఫిర్యాదులు పరిష్కారం

>> అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అర్జీదారులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. అత్యవసరమైన అర్జీలుంటే అక్కడికక్కడే పరిష్కరిస్తామని, అంబులెన్స్ సదుపాయం కూడా ప్రజావాణి జరిగే రోజుల్లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. 2023 డిసెంబర్ నుంచి ఇప్పటివరకు 117 సార్లు ప్రజావాణి నిర్వహించగా, అందులో 54,619 అర్జీలను ప్రజలు నమోదు చేసుకున్నారు. వీటిలో 68.4 శాతం (37,384) అర్జీలు పరిష్కారమయ్యాయని అధికారులు సిఎంకు వివరించారు.ప్రజావాణి అర్జీలను పరిష్కరించేందుకు మరింత పారదర్శకమైన, సమర్థవంతమైన విధానాలు అమలు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రాల్లో జరుగుతున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజాభవన్‌లో జరిగే ప్రజావాణి డ్యాష్ బోర్డుతో అనుసంధానం చేయాలని చెప్పారు. దీంతో మండల,స్థాయిలో, డివిజన్ స్థాయిలో, జిల్లా స్థాయిలో పరిష్కారమయ్యే అంశాలు వెంటవెంటనే అక్కడికక్కడే పరిష్కారమవుతాయని ముఖ్యమంత్రి సూచించారు. ప్రజావాణి డ్యాష్ బోర్డు యాక్సెస్‌ను తనకు అందించాలని, ముఖ్యమంత్రికి లైవ్ యాక్సెస్ ఉండేలా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

దీంతో తాను ఎక్కడ ఉన్నా ప్రజావాణి అర్జీల పరిష్కారం తీరును, ప్రజల నుంచి ఎలాంటి విజ్ఞప్తులు వస్తున్నాయో తెలుసుకునే వీలుంటుందని అన్నారు. అర్జీల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేయటం వేగవంతమవుతుందని అన్నారు.,అర్జీల వివరాలతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పారదర్శకంగా అందుబాటులో ఉంచాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు, వాటి అమలు పురోగతి పారదర్శకంగా అందరూ తెలుసుకునేందుకు వీలుగా ఉండేలా ఈ పోర్టల్ రూపొందించాలని సూచించారు. ప్రజల వ్యక్తిగత భద్రతకు ఇబ్బంది లేకుండా అమల్లో ఉన్న చట్టాల ప్రకారం ఏయే సమాచారాన్ని గోప్యంగా ఉంచాలి.. వేటిని ప్రజలకు అందుబాటులో ఉంచాలనేది ముందుగా సమీక్షించుకోవాలన్నారు. అధికారుల స్థాయిలో కమిటీ వేసి అందుకు సంబంధించిన మార్గదర్శకాలు రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

# కాంగ్రెస్ ఓటుబ్యాంకు రాజకీయం

>> నాశనం చేసే పార్టీగా మారిందని నరేంద్ర మోడీ ఆరోపించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సమానత్వాన్ని తీసుకురావాలని, ప్రతి పేదవాడు గౌరవంగా తల ఎత్తుకుని జీవించాలని కోరుకున్నారు. కానీ కాంగ్రెస్ మాత్రం ఓటు బ్యాంకు రాజకీయాల వైరస్‌ను వ్యాప్తి చేసింది. పేదవాడి కలలను అడ్డుకుంది. కాంగ్రెస్ కాలంలో ఎస్‌సీ, ఎస్‌టీ ఓబీసీలకు బ్యాంకులు తలుపులు కూడా తెరవలేదు. అప్పులు, సంక్షేమ పథకాలు అన్నీ కలగానే ఉండేవి. కానీ ఇప్పుడు జన్‌ధన్‌ఖాతాల్లో అత్యధిక లబ్ధిదారులు వాళ్లే ఉన్నారు. అంబేద్కర్ బ్రతికి ఉన్నప్పుడు ఆయనను అవమానించింది. రెండు సార్లు ఎన్నికల్లో ఓడిపోయేలా చేసింది. ఆయనకు కాంగ్రెస్ పార్టీ చేసినది మర్చిపోకూడదు అని మోడీ అన్నారు.

ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రాజ్యాంగం రిజర్వేషన్లు కల్పిస్తే, కాంగ్రెస్ పార్టీ దాన్ని బుజ్జగింపు రాజకీయాలకు వాడుకుందన్నారు. ఇటీవల కర్నాటకలోని కాంగ్రెస్ సర్కారు ప్రభుత్వ టెండర్ల కోసం మతం ఆధారంగా రిజర్వేషన్లు కల్పించిందని విమర్శించారు. రాజ్యాంగంలో అలాంటి వెసలుబాట్లు లేకున్నా అక్కడి ప్రభుత్వం అలా చేసిందని విమర్శించారు. బుజ్జగింపు విధానాల వల్ల ముస్లిం వర్గానికి అన్యాయం జరిగిందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో వక్ఫ్ చట్టాలను అమలు చేయలేదన్నారు. 2013లో, ఎన్నికలకు కొన్ని నెలల ముందు ముస్లిం వర్గాన్ని ఆకట్టుకునేందుకు వక్ఫ్ చట్టాన్ని కాంగ్రెస్‌పార్టీ సవరణ చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ముస్లింలను పట్టించుకోలేదని, ఒకవేళ ఆ పార్టీ ఆ వర్గం గురించి ఆలోచించి ఉంటే, పార్టీ ప్రెసిడెంట్‌గా ముస్లింను నియమించేదని లేదంటే ముస్లిం అభ్యర్థులకే 50 శాతం టికెట్లు ఇచ్చేదన్నారు. ముస్లింల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ పనిచేయలేదన్నారు.

ఎక్కువ విస్తీర్ణంలో ఉన్న వక్ఫ్ భూముల్ని కాంగ్రెస్ పార్టీ పేదలకు ఇవ్వలేదని, కానీ ఆ భూముల్ని ల్యాండ్ మాఫియా వాడుకుంటోందన్నారు. దళితులు, వెనుకబడిన వర్గాలు, గిరిజనలు భూముల్ని మాఫియాలు ఆక్రమిస్తున్నాయని, కానీ పాశ్మాండ ముస్లిం వర్గాలను ఎటువంటి లాభం చేయకుండా వదిలేసినట్లు చెప్పారు. వక్ఫ్ చట్ట సవరణ ద్వారా అక్రమాలకు చెక్ పెట్టనున్నట్లు చెప్పారు. గిరిజన భూముల్ని వక్ఫ్ బోర్డు తాకలేదని ప్రధాని పేర్కొన్నారు.

# టెట్ దరఖాస్తుల స్వీకరణ

>> విధానంలో పరీక్షలను నిర్వహించనున్నారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్‌లలో పరీక్షలను నిర్వహించనున్నారు. జూన్ 9 నుంచి అభ్యర్థులు తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. జూన్ 15 నుంచి 30 వరకు పరీక్షలను నిర్వహించనున్నారు. ఉదయం సెషన్ 9 గంటల నుంచి 11.30 గంటల వరకు మధ్యాహ్నం సెషన్ 2 గంగల నుంచి 4.30 గంటల వరకు కొనసాగనుంది. పరీక్ష ఫలితాలను జులై 22న విడుదల చేయనున్నట్టు నోటిఫికేషన్‌లో ప్రకటించారు.

**రూ. 200 నుంచి రూ. 750కి చేరిన పరీక్ష ఫీజు..**

ఉపాధ్యాయులుగా ఉద్యోగం సంపాదించాలంటే అందుకు అర్హతగా టెట్‌ను ప్రారంభించిన 2011 నుండి 2017 వరకు టెట్ ఫీజు రూ. 200గా కొనసాగింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిర్ణయించిన ఫీజునే తెలంగాణ రాష్ట్రంలో 2017వరకు కొనసాగించారు. ఆ తరువాత 2022లో టెట్ ఫీజును రూ. 300కి పెంచగా.. 2023లో దానిని కాస్త రూ. 400కి పెంచారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత పరీక్షలను ఆన్ లైన్ ద్వారా నిర్వహించడం ప్రారంభించడంతో.. 2024 మార్చ్‌లో జారీ చేసిన టెట్ నోటిఫికేషన్‌లో ఒక్కో పేపర్‌కి రూ. 1000 వసూలు చేశారు.. రెండు పేపర్లు రాస్తే రూ. 2 వేలు చెల్లించేలా నిర్ణయం తీసుకున్నారు. టెట్ పరీక్ష ఫీజు పెంపుపై అభ్యర్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేయగా .. ప్రభుత్వం మరొక టెట్‌కి సడలింపు ఇస్తామని ప్రకటించి.. 2024 నవంబర్ నోటిఫికేషన్‌లో సడలింపు ఇచ్చారు. 2024 మేలో జరిగిన టెట్ రాసిన అందరికి కూడా నవంబర్ టెట్ అప్లికేషన్‌ను ఫ్రీగా తీసుకోగా.. మిగిలిన వారికి మాత్రం ఒక పేపర్‌కి రూ. 750, రెండు పేపర్లు రాస్తే రూ. 1000 ఫీజుగా ఇప్పుడు విడుదల అయిన టెట్‌కి సుమారు 2.70లక్షల నుంచి 3 లక్షల వరకు అప్లికేషన్స్ వచ్చే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

# ఎస్సీ గురుకులాల్లో వినూత్నంగా 'ఫోన్‌మిత్ర'

### తల్లిదండ్రులతో నేరుగా మాట్లాడనున్న విద్యార్థులు

### నలుగురు విద్యార్థులకి ఒక ఫోన్ కార్డు

### అంబేద్కర్ జయంతి రోజున ప్రారంభించిన ఎమ్మెల్యే అరికెపూడి

**హైదరాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న ఎస్సీ గురుకుల పాఠశాలల్లోని విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సౌకర్యం కల్పించింది. ఇకపై గురుకులాల్లోని విద్యార్థులు వారి తల్లిదండ్రులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడే అవకాశం కల్పించింది. ఇందుకు సంబంధించిన ఫోన్ మిత్ర కార్యక్రమాన్ని రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి (ఏప్రిల్ 14)న ప్రారంభించారు. బిఆర్ అంబేద్కర్ 134వ జయంతిని పురస్కరించుకొని గౌలిదొడ్డిలోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీవోఈ)లో సోమవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపుడి గాంధీ ఫోన్ మిత్ర కార్య క్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. గురుకుల కార్యదర్శి డాక్టర్ విఎస్ అలగు వర్షిణితోపాటు విద్యా ర్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఫోన్ మిత్ర కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచనల మేరకు ప్రతి సాం ఘిక సంక్షేమ గురుకుల విద్యాల యంలో విద్యార్థుల సంఖ్యకు అనుగు ణంగా 7 నుండి 10 టెలిఫోను బాక్సులను ఏర్పాటు చేయడం జరుగు తుందని సొసైటీ సెక్రటరీ తెలిపారు. ప్రతి నలుగురు విద్యార్థులకు కలిపి ఒక ఫోన్‌కార్డు ఇవ్వడం జరుగు తుందన్నారు. ఈ కార్డును ఉపయోగించి, తల్లి దండ్రు లు అనుమతించిన ఫోను నంబరుకు విద్యార్థులు ఉచి తంగా రోజుకు ఎన్నిసార్లయినా ఫోనుచేసి, తల్లిదండ్రులతో మాట్లాడవచ్చు. ఆ కార్డులో రిజిష్టర్ అయిన ఫోను నంబర్లకు మాత్రమే ఫోన్ చేసే అవకాశం ఉంటుంది. ఇతర నంబర్లకు ఫోను చేసే అవకాశం



ఉండదు. తల్లి దండ్రులతో పాటు, ఒక సహాయ కేంద్రం నంబరు కూడా కల్పించ బడుతుంది. విద్యార్థులు తమ పాఠశాలలో ఉండే సమస్యలను గాని లేదా తమ తోటి విద్యార్థులతో ఏమైనా సమస్యలు ఉన్నా భోజన, వసతికి సంబంధించిన సమస్యలతోపాటు అభ్యసనకు సంబంధించిన సమస్యలు, మానసిక ఒత్తిడికి గురైనప్పుడు సాంత్వన కొరకు, కుటుంబ సమస్యలకు సంబంధించి ఉపశమనం కొరకు ఈ సహాయ కేంద్రం నంబరుకు ఫోను చేయడం ద్వారా అధికారుల దృష్టికి సమస్యను తీసుకు వచ్చి తద్వారా పరిష్కరించడానికి వీలు కలుగుతుందన్నారు. ఫోన్‌మిత్ర ద్వారా విద్యార్థులు ఎప్పుడంటే అప్పుడు తమ తల్లి తండ్రులతో మాట్లాడి, ఇంటి మీద ఉండే బెంగ నుండి ఉపశమనం పొంది, తిరిగి తమ విద్య అభ్యసన కార్యక్రమంలో నిమగ్నమయ్యే అపూర్వ అవకాశం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 268 గురుకుల విద్యాలయాల్లో ఈ సదుపాయం కల్పిస్తామన్నారు. ఇదిలా ఉండగా, విద్యార్థులు వివిధ కారణాలతో క్షణికావేశానికి లోనై తమ జీవితాలను అకారణంగా ముగించి తమ తల్లితండ్రులకు శోకాన్ని మిగిల్చుతున్న అంశాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రాజెక్ట మిత్ర అనే మరొక వినూత్న కార్యక్రమానికి నాంది పలికింది.



అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి, డి.సిఎం భట్టి విక్రమార్క, మంత్రి దామోదర రాజనర్సింహ, మాజీ ఎంపి అంజన్‌కుమార్‌యాదవ్ తదితరులు

## అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్ (సైఫాబాద్), ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 134వ జయంతి ఉత్సవాలు సోమవారం ఉదయం ట్యాంక్‌బండ్ వద్దగల ఆయన విగ్రహం ఎదుట ఘనంగా జరిగాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యుడు ఎ.అనిల్‌కుమార్‌యాదవ్, మాజీఎంపి మందడి అంజన్‌కుమార్‌యాదవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ ప్రీతం, కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి డా.పి.వి. రవి శేఖర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, పార్టీల నాయకులు, కార్యకర్తలు, దళిత సంఘాలు, ఉద్యోగ సంఘాల నాయకులు వేలాదిమంది ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.




సమీపకు ఆర్థిక సహాయం అందిస్తున్న బాబూమోహన్

## 'పవన్ మోహన్ ఛారిటబుల్ ట్రస్ట్..' ప్రారంభించిన మాజీమంత్రి బాబూమోహన్

**హైదరాబాద్ (సైఫాబాద్), ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** విద్యా, వైద్యంతోపాటు ఆర్థికంగా వెనుకబడిన నిరుపేదలకు చేయూత అందించేందుకు తన కుమారుడి పేరు మీద 'పవన్ మోహన్ ఛారిటబుల్ ట్రస్ట్'ను సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ప్రముఖ హాస్యనటుడు, మాజీమంత్రి బాబూమోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 2003లో తన కుమారుడు రోడ్డుప్రమాదంలో మృతి చెందారని ఆ రోజుల్లోనే ట్రస్ట్ పెట్టాలనుకున్నానని, కాని తాను రాజకీయాల్లో ఉండటం వల్ల సాధ్యం కాలేదని, ప్రస్తుతం తాను రాజకీయాలకు దూరంగా ఉన్నందువల్ల ట్రస్ట్ ఏర్పాటు చేశానని చెప్పారు. ఈ ట్రస్ట్ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా అంచెలంచెలుగా పనిచేస్తుందని, త్వరలో జిల్లాల్లో కో-ఆర్డినేటర్‌లను నియమిస్తామని చెప్పారు. తాను విద్యార్థిదశలో ఉన్నప్పుడే వీధినాటకాలు వేస్తూ పేదవిద్యార్థులకు సహాయం చేసేవాడినని గుర్తు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారాపేటకు కోయ సామాజిక వర్గానికి చెందిన సమీప అనే అమ్మాయికి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా సమీప మాట్లాడుతూ తాను అటవీ ప్రాంతంలో కోయల మధ్య జీవిస్తున్నానని, ఎంటెక్ పూర్తిచేసి, అటవీ శాఖ అధికారిణిగా కోయ జాతి అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

# మంత్రివర్గ కూర్పుపై సమష్టి నిర్ణయం

### అధికారంలోకి వస్తామనే పగటికలలు మానుకో కెసిఆర్

### హెచ్‌సియుపై మొసలికన్నీరు కారుస్తున్న మోడీ

### పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అభిప్రాయం వ్యక్తిగతం, కాంగ్రెస్ పార్టీ సమష్టి నిర్ణయం తీసుకుంటుందని పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో స్వేచ్ఛకు కొదవలేదని అభిప్రాయడ్డారు. తెలంగాణలో మళ్లీ అధికారంలోకి వస్తామని కేసిఆర్, కేటీఆర్ పగటికలలు కనడం మానుకోవాలని ఆయన హితవు చెప్పారు.
కేసిఆర్ కుటుంబం ఆర్థిక దోపిడీ చూసి భయపడి కొంతమంది కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారని అన్నారు. వివిధ స్కామ్‌లలో ఉన్న మంత్రి కేటీఆర్ అరెస్టు కావాల్సిందే అని అన్నారు. తప్పు చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు అని హెచ్చరించారు. బిఆర్‌ఎస్ హయంలో కేసిఆర్ ప్రమేయంతోనే పెద్దఎత్తున రైస్ స్కాం జరిగిందని గుర్తుచేశారు. సన్న బియ్యం గురించి మాట్లాడే అర్హత బిఆర్‌ఎస్ నేతలకు లేదనిఅన్నారు. కేసిఆర్ కుటుంబ సభ్యులు దొడ్డు బియ్యాన్ని సన్న బియ్యంగా మార్చి ఎగుమతి చేసిన విషయం మరిచిపోయారా అని నిలదీశారు. 15 మాసాల్లో ప్రజాపాలన మార్పు చూపించగలిగామని తెలిపారు. కాంగ్రెస్ అభివృద్ధి చూసిన బిఆర్‌ఎస్ నేతలు ఓర్వలేక పోతున్నారని ఆవేదన చెందారు. ప్రజల ఆకాంక్షలు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్సు నుంచి మొదలు కొని సన్న బియ్యం వరకు అనేక సంక్షేమ పథకాలు పెట్టి ఆచరిస్తున్నదని అన్నారు. పేద ప్రజల కోసం కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందని వివరించారు. దేశ చరిత్రలో నిలిచిపోయే విధంగా సన్న బియ్యం పంపిణీ చేపట్టిందని అన్నారు.
రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా మూడు దశాబ్దాల ఎస్సీ వర్గీకరణకు మోక్షంతో జీవో విడుదల చేశామని అన్నారు. ధరణితో విసిగి వేసారిన ప్రజలకు భూభారతితో మోక్షం కలిగిందని తెలిపారు. ప్రజలకు మేలు జరిగేలా భూభారతి ఆరు గ్యారెంటీలతోపాటు ప్రజలకు లబ్ధి చేకూరే విధంగా మరికొన్ని సంక్షేమ పథకాలను ప్రభుత్వం ప్రవేశ పెట్టింది అని మహేష్ తెలిపారు. సామాజిక న్యాయానికి ఛాంపియన్ రాహుల్‌గాంధీ అని కొనియాడు. మంగళవారం సిఎల్పీ సమావేశం నోవాటెల్‌లో జరగనుందని తెలిపారు. 15 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన బృహత్తర కార్యక్రమాలపై చర్చ ఉంటుందని అన్నారు.
ఎస్సి వర్గీకరణ, కుల సర్వే, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చారిత్రాత్మక నిర్ణయాలను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని అన్నారు. మోదీ గతం మర్చిపోయి మాట్లాడుతున్నారనీ, ప్రధానమంత్రికి పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ కౌంటర్ ఇచ్చారు. హెచ్‌సియులో 5 బిల్డింగులను మోడీ వర్చువల్‌గా ప్రారంభించిన బిల్డింగులకు మున్సిపల్, ఫారెస్ట్, ఎన్విరాన్‌మెంట్ పర్మిషన్లు లేవని గుర్తుచేశారు. మోదీ హయాంలో హెచ్‌సియు భూముల్లోని చెట్లను నరికారు. మోడీ మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉంది, కార్పొరేట్ కంపెనీల కోసం అటవీ భూములు లక్షల ఎకరాలు కట్టబెట్టారని ఆరోపించారు. మోడీ ర్యాలీ కోసం వేల చెట్లు నరికేశారని అన్నారు. అహ్మదాబాద్ లోని గాంధీ నగర్లో 17 వేల చెట్లు నరికామని వారే ఒప్పుకున్నారని గుర్తుచేసుకొన్నారు. గత 5 సంవత్సరాల్లో లక్ష తొమ్మిది వేల చెట్లను మోడీ ప్రభుత్వం నరికేసిందని పార్లమెంట్‌లో చెప్పారు. అదానీ, అంబానీ కోసం లక్షల ఎకరాల ఫారెస్ట్ భూములను మోడీ నాశనం చేసారని ఆరోపించారు. హెచ్‌సియు భూములపై మోదీ తెలుసుకొని మాట్లాడాలని హితవుచెప్పారు, మోడీ మొసలి కన్నీరు కారుస్తున్నాడని ఎద్దేవా చేశారు. తెలంగాణలో సన్న బియ్యం, ఎస్సీ వర్గీకరణ, బిసి కులగణన వంటి విప్లవాత్మక కార్యక్రమాలు జరుగుతుంటే మోడీ వాటి గురించి మాట్లాడే ధైర్యం చేయడం లేదని ఎకసెక్కాలు ఆడారు. యేటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోడీ ఆ విషయం మాట్లాడ్డం లేదని అన్నారు. తెలంగాణలో జరుగుతున్న సంక్షేమ, అభివృద్ధిపై చర్చ జరగకుండా ఇలా మోడీ తప్పుదారి పట్టిస్తున్నాడని అన్నా రు. మీడియా సమావేశంలో అనిల్ యాదవ్ ఎంపి, అద్దంకి దయాకర్ ఎమ్మెల్సీ, నాయకులు ఎంఆర్‌జి వినోద్‌రెడ్డి, ఏనుగు రవీందర్, కైలాష్ కుమార్, సిద్దేశ్వర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కారులో ఉండగా లాక్‌పడి ఊపిరాడక ఇద్దరు చిన్నారులు మృతి

**చేవెళ్ల, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** కారులో ఉండగా ఆకాస్మాత్తుగా లాక్ పడి ఊపిరాడక ఇద్దరు చిన్నారులు మృతి చేందిన సంఘటన రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం దామరిగిద్ద గ్రామంలో సోమవారం జరిగింది. ఇందుకు సంబందించిన వివరాలు స్దానికుల కథనం ప్రకారం చేవెళ్ల మండలం పామెన గ్రామానికి చేందిన కావలి జ్యోతి-వెంకటేష్ దంపతుల కుమార్తె తన్మయిశ్రీ(5), షాబాద్ మండల సీతారాంపూర్ గ్రామానికి చేందిన ఉమారాణి-మహేందర్‌ల కుమార్తె అభినయశ్రీ(4)లు వారి మోనమామైన తెలుగు రాంబాబు గత నెల 30 పెళ్లి ఉందని దామరిగిద్ద గ్రామానికి వచ్చారు. దామరిగిద్దలో తమ మెనమామకు చేందిన కారు ఐ10ను ఇంటి ముందు పార్క్ చేశారు.
సోమవారం మద్యాహ్నం 12.30 గంటలకు ఆడుకుంటు ఇంటి ముందుగల ఐ10 కారులో ఎక్కారు. కుటుంబ సభ్యులు బందువులు పిల్లలను గమనించలేదు. ఇంటి భయట ఇద్దరు పిల్లలు ఆడుకుంటున్నారని ఎవరు కూడ అంతగా గమనించలేదు. ఎంతకి పిల్లలు ఎక్కడికి వెల్లారని మద్యాహ్నం 2 గంటలకు కారులో చూడగా ఇద్దరు స్పృహ తప్పి పడి ఉన్నారరు. లాక్ తీసి కుటుంబ సభ్యులు ఇద్దరు స్పృహ తప్పి పడిన పిల్లను చేవెళ్ల ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి తీసుకువచ్చిన చిన్నారులను అసుపత్రి వైద్యులు పరిక్షించగా ఇద్దరు చిన్నారులు ఊపిరాడక అప్పటికే చనిపోయారని నిర్దారించారు.

# లా సెట్, పిజి లాసెట్‌కు 30,365 దరఖాస్తులు

### నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు

### అపరాధ రుసుంతో మే 25 వరకు అవకాశం.. జూన్ 6న పరీక్ష

**హైదరాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని న్యాయ శాస్త్ర కోర్సులైన 3 సంవత్సరాలు, 5 సంవత్సరాల లా కోర్సులో చేరడానికి నిర్వహించే లాసెట్-2025కి సంబంధించిన టిజి లాసెట్-2025తోపాటు పిజి లా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పిజి లాసెట్-2025కి సోమవారం సాయంత్రం వరకు 30,365 దరఖాస్తులు వచ్చాయి. నేటి(ఏప్రిల్ 15)తో దరఖాస్తు గడువు ముగియనుంది. అయితే అపరాధ రుసుంతో మే 25 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. జూన్ 6న పరీక్షలను నిర్వహించనున్నారు. లాసెట్ 3 సంవత్సరాల పరీక్షకి 21,483 దరఖాస్తులు రాగా.. 5 సంవత్సరాల లాసెట్‌కి 6326 దరఖాస్తులు వచ్చాయి. పిజి లాసెట్‌కి 2556 దరఖాస్తులు వచ్చాయి. మొత్తంగా ఇప్పటి వరకు 30,365 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తులను మార్చి 1 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించడం ప్రారంభించారు. లాసెట్, పిజి లాసెట్-2025ను ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించనుంది. లాసెట్, పిజి లాసెట్ దరఖాస్తులను మార్చి 1 నుంచి ఏప్రిల్ నేటి వరకు స్వీకరించనున్నారు. అపరాధ రుసుం రూ. 500తో ఏప్రిల్ 25 వరకు, రూ. 1000తో మే 5 వరకు, రూ. 2000తో మే 15 వరకు, అపరాధ రుసుం రూ. 4000తో మే 25 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. మే 20 నుంచి 25 వరకు దరఖాస్తుల్లో తప్పులను సరిచేసుకోవడానికి అవకాశం కల్పించారు. మే 30 నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునేలా ఏర్పాట్లు చేశారు. 3 సంవత్సరాల లాసెట్ పరీక్షను జూన్ 6న ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు.. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2 గంటల వరకు నిర్వహించనున్నారు. పిజి లాసెట్, 5 సంవత్సరాల లాకోర్సులో ప్రవేశాల కోసం జూన్ 06న మధ్యాహ్నం 4 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించనున్నారు. టిజి లాసెట్ ఫీజును రూ. 900గా నిర్ణయించగా.. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ. 600గా నిర్ణయించారు. టిజి పిజి లాసెట్ ఫీజు రూ. 1100 కాగా.. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ. 900గా నిర్ణయించారు.

# తిరుమల కదంబవనంలో మంటలు

**తిరుమల,ఏప్రిల్ 14ప్రభాతవార్తప్రతినిధి:** వేసవి మండుతుండటంతో సోమవారం మధ్యాహ్నం 2.30గంటల ప్రాంతంలో తిరుమలలోని హెచ్‌విసి ప్రాంతంలో ఉన్న కదంబవనంలో అగ్నిమంటలు వ్యాపించాయి. ఈ మంటలు ఎలా వ్యాపించాయనేది తెలియకపోయినా ఆ ప్రాంతంలో భక్తులు ఎవరైనా అగ్గిపుల్లగీయడంగానీ, సిగరెట్‌ముక్క పడేయడం వల్ల జరిగి ఉంటుందని భావిస్తున్నారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, విజిలెన్స్ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు పూర్తిగా అదుపులోకి తెచ్చారు. దీంతో పెద్ద నష్టం తప్పింది. ఈ ప్రాంతంలోని మార్గంలో భక్తులు కూడా సంచరిస్తుంటారు.



# సీతారామా లిఫ్ట్‌లో అవినీతి పారుదల

### రూ.కోట్ల ఖర్చుతో పనికిమాలిన పనులు

### పర్యవేక్షణ లోపమే శాపమా

### కట్టడాలు కూలుతుంటే మెలకువగా ఉన్నారా

### వాగుల్లోని దుబ్బ ఇసుకతో పనికానిచ్చారు

### మొత్తం ప్రాజెక్ట్ నాణ్యతపైనే అనుమానాలు

### జాతీయ గిరిజన కమిషన్‌లో ఫిర్యాదుకి రంగం సిద్ధం

**అశ్వారావుపేట, ప్రభాతవార్త:** నాడు బిఆర్‌ఎస్-నేడు కాంగ్రెస్., ప్రభుత్వాలేవైనా "సీతారామాలిఫ్ట్ ఇరిగేషన్" భారీ ప్రాజెక్ట్‌ని ఎంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకు న్నాయో మనందరికీ తెలియంది కాదు. సముద్రం లోకి వృధాగా పోతున్న గోదావరి జలా లను కొంత ఒడిసిపట్టి., ఈ నిధిని పొలాలవైపు మళ్ళించేందుకు మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, మరికొందరు రాజకీయ ప్రముఖులు పాటుపడ్డ, పడుతున్నా తాపత్రయం కళ్ళముందు కదలాడుతున్నది. నదినుంచి 40 టిఎంసి నీటిని ఉమ్మడి ఖమ్మం జిల్లాల వైపుకి దారి మళ్ళించి 6.74లక్షల అదనపు ఆయకట్టుకి ఊపిరులూదాలనే భగీరథ సంకల్పమిది. ఇంతటి పవిత్ర కార్యాన్ని సాకారం చేయాల్సిన నీటిపారుదల శాఖ ఇంజనీర్లు చేస్తున్నదేమిటి ? వీళ్ళకి ఎంత కావాలంటే అంత డబ్బుని ప్రభుత్వం ఇస్తున్నది కదా., చేయాల్సిందల్లా పనులు నాణ్యంగా ఉండేలా చూడ్డమే కదా. ఆ మాత్రం బాధ్యత కూడా లేకుండా వ్యవస్థని గాలికొదిలేసి ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారనే అపప్రదని ఇంజనీర్లు ఇప్పుడు మోయాల్సివస్తున్నది. లేకపోతే ముల్కలపల్లి మండలంలోని ఫ్లడ్‌డైవర్షన్ పిల్లర్ ఎందుకు కూలుతుంది. నాణ్యత లేకపోతేనే కదా. అందుకు ఇంజనీర్ల పర్యవేక్షణా లోపం కాదా. ఏం సమాధానం చెబుతారు జరిగిన విధ్వసాన్ని ఎలా సమర్థించుకుంటారు. పనులింకా పూర్తికాలేదంటూ ఓ అధికారి సన్నాయినొక్కులు నొక్కారు. అంటే జరిగిన పనులు మట్టిపాలైనా ఫర్వాలేదా. అసలీ సమాధానం ఏమిటి ? వర్క్ పెండింగ్ ఉన్నంతమాత్రాన నిర్మాణం పూర్తయిన భాగాలు నాశనమౌతాయని అలా జరిగినా ఇబ్బంది లేదని వారి ఉద్దేశ్యమా ? ఈనాటి రెండవ భాగపు వార్తలో మరింత లోతైన అంశాలను స్పృశించే ప్రయత్నం చేద్దాం.

**ప్రాజెక్ట్ పూర్తయిపోయిందన్న ఇరిగేషన్**

కట్టడాలు కూలుతున్న ప్రస్తుత దుస్థితిలో ఓ ఇంజనీర్ చెప్పిన బాధ్యతా రాహిత్య సమాధానాన్ని గుర్తుచేసుకుందాం. పనులు పూర్తికాలేదని, అందువల్ల పిల్లర్‌కూలినా మళ్ళీ కాంట్రాక్టర్ ఖర్చుతోనే పూర్తిచేయిస్తామన్నారాయన. కానీ రాష్ట్ర నీటిపారుదల ఉన్నతాధికారులు ఈ సీతారామా లిఫ్ట్ కి సంబంధించి ఈమధ్యనే ఒక సుదీర్ఘ వివరణ (డిస్క్రిప్షన్) ని వెబ్‌సైట్‌లో పెట్టారు. దాన్ని పౌరులెవరైనా చూసుకోవచ్చు. అందులో అధికారికంగా చెబుతున్న వివరాలిలా ఉన్నాయి. ఈ మెగా ఎత్తిపోతలకు 2018 సంవత్సరంలో తొలి మంజూరుగా రూ.7926.147 కోట్ల తో మొదలై అది 2018 చివరినాటికి రూ.13057.98కోట్ల అదనపు గ్రాంట్‌కి ఎగబాకింది. 1 నుంచి 8 ప్యాకేజీలుగా విభజించపడిన పనులకు గానూ మొత్తం 104.400 కిలోమీటర్ల మెయిన్ కెనాల్ నిర్మాణం జరగాల్సి ఉన్నది. ఈమధ్యలో 3 ప్రధాన పంప్‌హౌస్‌లు నీటిని ముందుకు తోస్తాయి. ఎర్త్‌వర్క్ 11 లక్షల క్యుబిక్‌మీటర్లు, సిమెంట్ కాంక్రీట్ పోర్షన్ 83లక్షల క్యుబిక్స్, అలానే సిసి లెయింగ్, సిఎం అండ్ సిడి వర్కులతో కలిపి వాల్యూఆఫ్ వర్క్ పూర్తయింది. దీనికిగానూ రూ.5316 కోట్ల అదనపు అంచనాల మంజూరునుంచి రూ.5190.04 కోట్ల బిల్లుల్ని టాక్స్‌తో కలిపి ఇప్పటికే ఆయా ఏజన్సీలకు (కాంట్రాక్టర్లకు) చెల్లించేశామని సైట్‌లో పొందుపరచిన డిస్క్రిప్షన్‌లో చాలా స్పష్టంగా వెల్లడించారు. ఈ కాలువల పోర్షన్లోని 88 కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్‌కి సంబంధించి ( మొత్తం 99.88 కిలోమీటర్ల పొడవు) తవ్వకాల ప్రక్రియ అంతా తుదిదశకు చేరిందన్నారు. అంతే కాదు దుమ్ముగూడెం మొదలుకుని సత్తుపల్లి ట్రంక్ దాకా ఈ మధ్యలోని 8 ప్యాకేజీల పనుల్లో 92శాతం అన్నిరకాల పనులూ పూర్తిచేసేసినట్లు ప్రకటించారు. దీన్నిబట్టి ఏమి తెలుస్తున్నది. పూర్తయిన అన్ని పనులకూ బిల్లులు చెల్లించారనే కదా. మరి పూసుగూడెం-కమలాపురం మధ్యలో కూలిన కట్టడాలకూ ఆ పద్దుకింద డబ్బులు ఇచ్చారా లేదా ? ఇచ్చే ఉంటారు. ఎందుకంటే భవిష్యత్తులో ఇలా కూలుతుందని ఇరిగేషన్ కలగనదు కదా. అందుకని పేమెంట్ ఐపోయే ఉండాలి. అవ్వకపోతే కాంక్రీట్ పని పూర్తయినా ఇంకా పెండింగ్ ఎందుకు పెట్టుకున్నారో దానికైనా సమాధానం చెప్పాలి. ఒకవేళ ఇదే నిజమైతే అసలు కాంట్రాక్టర్ ఎందుకు ఒప్పుకుంటాడు. తన బిల్లు తనకిమ్మని ఒత్తిడి చేసి ఉండాలి కదా. కాబట్టి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఇంజనీర్లు వత్తాసు పలకడం సహేతుకం కాకపోవచ్చు. ప్రాజెక్ట్ స్టార్టింగ్ పాయింట్ నుంచి అడుగడుగునా కాలువల్లోని సమస్త లోపాలనూ రేపటినుంచీ ఆధారాలతో బయట పెట్టడానికి ప్రభాతవార్త టీం కృషిచేయనున్నది. దాదాపు కాలువలు చాలాచోట్ల శిథిలావస్థకు వచ్చినట్లు వార్తలు వినవస్తున్నాయి. క్షేత్రస్థాయి సందర్శనలో ఇంకెన్ని అంశాలు బయటకి వస్తాయో చూద్దాం. ఏదిఏమైనా ఇరిగేషన్ ఇంజనీర్ల పర్యవేక్షణ ఏమాత్రం లేదనేది తేలిపోతున్నది. ప్రభుత్వం డబ్బు ఇవ్వగలదు గానీ., దగ్గరుండి మంత్రులు.. ఈఎన్‌సిలు చూడలేరుకదా. వీళ్ళేమో ఇలా భ్రష్ఠుపట్టిస్తున్నారు. అడవుల్లో గుట్టుగా జరిగే ఈ కాంక్రీట్ నిర్మాణాలకు గోదావరి ఇసుక లీడ్‌గా ఉంటే., సమీప వాగుల్లోని దుబ్బ ఇసుకని వాడేస్తున్నారని(సత్తుపల్లి ట్రంక్ సహా) ఇదివరకే ప్రభాతవార్త బహిర్గతం చేసిన విషయం తెలిసిందే. సరే., ఇదిలా ఉంటే కొన్ని గిరిజన సంఘాలు ముల్కలపల్లి మేడిగడ్డ వ్యవహారాన్ని జాతీయ గిరిజన కమిషన్‌కి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసేందుకు రంగం సిద్ధం చేశారు.

# మే 15 నుంచి సరస్వతి పుష్కరాలు

### వేసవిలో పుష్కరాలు రావడంతో ఏర్పాట్లపై అధికారుల మల్లగుల్లాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** గోదావరి-ప్రాణహిత నదులు సంగ మించే చోట అంతర్వాహనిగా ఉందని భక్తులు విశ్వసించే సరస్వతి పుష్క రాలు మే 15 నుంచి 26 వరకు జరగనున్నాయి. పుష్కరాలు అంటే 12 సంవత్సరాలకు ఒకసారి హిందూ మతంలో పవిత్ర నదుల తీరాన జరిగే ఒక పండుగ. పండుగలో నదిలో పుణ్యస్నానం ఆచరిస్తే ఎంతో పుణ్యం కలుగుతుందని భక్తుల నమ్మకం. దేశంలో ఉన్న ప్రతి నదికి 12 సంవత్సరాలకు ఒకసారి పుష్కరాలు వస్తుంటాయి. కానీ తెలంగాణ రాష్ట్రం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద త్రివేణి సంగమం ఉండడంతో మూడు పుష్కరాలు వస్తాయి. ప్రాణహిత, గోదావరి, సరస్వతి పుష్కరాలను ఇక్కడ నిర్వహిస్తారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2013లో కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలు జరిగాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత తొలిసారిగా 2025లో కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించనుంది. మే 15 నుంచి 26వ తేదీ వరకు సరస్వతి పుష్కరాలను నిర్వహించనున్నారు. మండే ఎండల్లో పుష్కరాలు రావడంతో అధికారులు ఆందోళ చెందుతున్నారు. భక్తులు పుణ్యస్నానాలు చేయాలంటే గోదావరి నది వేగంగా అడుగంటుతోంది. పుష్కరాలకు ఇంకా నెల రోజులు ఉండటంతో అప్పటికే నీళ్ళు సుమారు ఇంకిపోయే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. నదిలో నీళ్ళు లేకుండా భక్తులు స్నానాలు ఎలా చేస్తారని ప్రశ్న అధికారులను ఆందోళనలో పడేస్తుంది. ఈ పుష్క రాలను ఘనంగా నిర్వహించాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరుగుతున్న మొదటి పుష్కరాలు కావడంతో ప్రభుత్వం ఈ పుష్కరాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. దీంతో దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్ ఆద్వర్యంలో ఒక బృదం ప్రయాగ్‌రాజ్ వెళ్లి మహాకుంభ మేళా నిర్వణ తీరును అద్యయనం చేసి వచ్చింది. కోట్లాది మంది భక్తులు వచ్చినా ఇబ్బంది పడకుండా చేసిన ఏర్పాట్లను పరిశీలించింది.
వచ్చే సంవత్సరం, ఆ పై వచ్చే సంవత్సరం గోదావరి, కృష్ణా పుష్క రాలను నిర్వహించాల్సి ఉంది. అంతే కాకుండా మే 15 నుంచి 26 వరకు సరస్వతి పుష్కరాలను నిర్వహించాల్సి ఉంది. గోదావరి, కృష్ణా పుష్కరాలకు ముందు ప్రారంభం కానున్న సర్వస్వతి పుష్కరాలనుఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. దీంతో అధికారులు ఆ పనుల్లో బిజిగా ఉన్నారు. కానీ పుష్కరాలకు అతి ముఖ్యమైన నదీ జలాలు లేకుండా ఉంటే ఎలా అనే ఆలోచన అధికారుల మనసును తీవ్రంగా కలచివేస్తోంది. దీంతో నీటి పారుదలుశాఖ అధికారులు సమావేశం కూడా అయినట్లు తెలిసింది. ప్రస్తుతం గోదావరి నీరు సుమారుగా అడుగంటటంతో పాటు ప్రాణహిత నదిలో కొద్ది మేర నీటి ప్రవాహం ఉంది. కాళేశ్వరం దేవాలయ సమీపంలో నదీగర్భంలో తాత్కాలిక అడ్డుకట్ట ఏర్పాటు చేసి నీటి నిల్వ చేసి పుష్కరా స్నానాల కార్యక్రమం చేయాలనే ఆలోచనలో అధికారులు ప్రతిపాదలను చేసినట్లు తెలిసింది. అయితే మండే ఎండల్లో నిల్వ నీటిలో బ్లూగ్రీన్‌ళ ఆల్గే బ్యాక్టిరీయి ఏర్పడే ప్రమాదం ఉందని, ఆ నీటిలో స్నానం చేస్తే చర్మ సంబంధితవ్యాధులు వచ్చే అవకాశం ఉండటంతో ఆ ప్రతిపాదనపై అధికారులు పునరాలోచనలో పడ్డట్లు తెలిసింది. కాళేశ్వరం దేవాలయానికి ఎగువన ఉన్న ఎల్లం పల్లి ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసిస్నానాలకు నీళ్లు ఉండేలా చేయాలన్న ప్రతిపాదనపై అధికారులు సమాలోచనలు చేస్తున్నట్లు సమాచారం. అయితే ఎల్లంపల్లి ప్రాజెక్టు కాళేశ్వరం దేవలయానికి సుమారు 80 కిలో మీటర్ల దూరంలో ఉంది. ప్రస్తుతం గోదావరిలో పెద్ద ఎత్తున గుంతలు ఉన్నాయి. ఆ గుంతలు నిండితేనే ప్రవాహం ముందుకు సాగుతుంది. ఇసుక తేలి ఉండటంతో నదిలో నీళ్ళు ప్రవాహంలోనే ఇంకి పోయే పరిస్థితి నెలకొంది. పుష్కరాల నాటికి వేసవి ఎండలు అధికంగా ఉండటంతో ప్రవాహంలోనే నీళ్ళు ఆవిరయ్యే పరిస్థితి ఉంది. వీటిని తట్టుకుని దేవాలయం వరకు నీరు చేరాలంటే 5 వేల క్యూసెక్కుల వరకు నీటిని విడుదల చేయాల్సి ఉంటుందని అది అంత సాధ్యం అయ్యేలా లేదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అయితే నదిలో శక్తివంతమైన బోర్లు తవ్వడం ద్వారా నీటినిపైకి తీసుకువచ్చి తాత్కాలిక కోలనులు ఏర్పాటుచేసి నీటిని నింపాలన్నది కూడా మరో ఆలోచన. ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకు వచ్చి పుష్కర ఘాట్లపై షవర్లు ఏర్పాటు చేసి స్నానాలకు ఏర్పాటు చేయాలనేది మరో ఆలోచన దీనిపై త్వరలో ఒక నిర్ణయాన్ని అధికారులు తీసుకోనున్నట్లు సమాచారం. సరస్వతీ పుష్కరం అనేది సాధారణంగా ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి జరిగే సరస్వతి నది పండుగ. సరస్వతి నదిని అంతర్వాహినిగా పరిగణిస్తారు. ఇది త్రివేణి సంగమం వద్ద ప్రవహిస్తుంది. బృహస్పతి మిథున రాశిలోకి ప్రవేశించినప్పటి నుండి 12 రోజులపాటు ఈ పుష్కరాలు జరుపుకుంటారు.

వార్త

ఉపన్యాసకుడైనా, రచయిత అయినా తన భావాల్ని సంక్షిప్తీకరించడం నేర్చుకోగలిగేంత వరకూ విజయం సాధించలేడు.

-ఎమర్సన్

# కాటేస్తున్న కల్తీ పాలు

మానవుడికే కాదు పశుపక్ష్యాదుల ఆరోగ్యానికి సంకటంగా మారుతున్న కల్తీని నిరోధించేందుకు అటు కేంద్రం, ఇటు రాష్ట్రాలు చేస్తున్న ప్రయత్నాలు ఏమాత్రం ఫలించడం లేదు. దేశంలో కల్తీ రానురాను పెరిగిపోతున్నది. తాగే నీటిలో కల్తీ, పప్పులో కల్తీ, ప్రాణాపాయం నుండి కాపాడే మందుల్లో కల్తీ, చివరకు పౌష్టికాహారంగా వయసుతో ప్రమేయం లేకుండా పసిపిల్లల నుండి వృద్ధుల వరకు సేవించే పాలల్లో కల్తీ, అదీ ఇదీ అని తేడాలేకుండా మొత్తం కల్తీమయంగా మారిపోతున్నది. మానవ మనుగడనే ప్రశ్నార్థకం చేసే సూచనలు కన్పిస్తున్నాయి. ఇంత ప్రమాదంగా మారుతున్నా పొగమంచులా అంతటా విస్తరిస్తున్నా అడిగేవారు, అడ్డగించేవారు కరవైపోతున్నారు. ఒకరకంగా చెప్పాలంటే అవినీతికి, కల్తీకి అవినాభావ సంబంధం ఉంది. దీనిని అరికట్టేందుకు ఎన్నో చట్టాలున్నాయి. ఆ చట్టాలు అమలు చేసి కల్తీ జరగకుండా నిరోధించేందుకు దేశవ్యాప్తంగా లక్షలాది మంది అధికారులు ఉన్నారు. కోట్లాది రూపాయల జీతభత్యాలు తీసుకుంటున్నారు. కానీ కల్తీని నియంత్రించడం అటుంచి రోజురోజుకు పెరిగిపోతుండడం ఆందోళన కలిగించే అంశం. ఈ కల్తీ భారత్‌లోనే కాదు ప్రపంచవ్యాప్తంగా మానవ జీవనానికి సవాల్‌గా మారుతున్నా మనదేశంలో అత్యంత ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయనే సంకేతాలు వెలువడుతున్నాయి. కొందరు దళారులు, వ్యాపారులు లాభాలకోసం పప్పుదినుసులు, మసాలాలు, నిత్యావసర వస్తువుల సరుకుల్లో కల్తీ చేస్తున్నారు. గత నెలలో హైదరాబాద్‌లో ఏకంగా కుళ్లిపోయిన మాంసం ఏకంగా క్వింటాళ్ల కొద్దీ అధికారుల దాడుల్లో పట్టుబడ్డాయి. ఈ మాంసం కుళ్లిన వాసన రాకుండా వెనిగర్ లాంటివి చల్లి హోటళ్లకు సరఫరా చేస్తున్నారు. ఇది ఏనాటి నుంచో జరుగుతున్నట్లు సమాచారం. ఇక పాలల్లో కల్తీ అదుపు లేకుండాపోతున్నది. వాస్తవంగా కల్తీ అడ్డుకట్ట ప్రమాణాల చట్టం 2006లోనే తీసుకువచ్చినా అమలు విషయం అంతగా పట్టించుకునేవారే లేకుండాపోయారు. భారత్ ఆహార భద్రతా ప్రమాణాల ప్రాధికార సంస్థ అమలు గూర్చి దాదాపు మరిచిపోయారనే చెప్పొచ్చు. 1947లో వంటనూనెల నియంత్రణ చట్టం 1995లో నిత్యావసర సరుకుల నియంత్రణ చట్టం అన్నింటికంటే ముఖ్యంగా 1954 నాటి ఆహార కల్తీ నిరోధక చట్టాన్నిదాదాపు మరిచిపోయారనే చెప్పొచ్చు. ఇక పాలల్లో కల్తీ ఇటీవల కాలంలో బాగా పెరిగిపోయిందనే చెప్పొచ్చు. డిమాండ్‌కు తగినట్లు ఉత్పత్తి లేకపోవడంతో ఆ వ్యత్యాసాన్ని పూడ్చేందుకు రకరకాల మార్గాల్లో కృత్రిమ పాలను తయారు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ పాలు, టీ తాగడం అలవాటు కావడంతో వినియోగం పెరుగుతున్నదనే చెప్పొచ్చు. పెరుగు, మజ్జిగా నిత్యం తీసుకోవడంతోపాటు పాలపదార్థాలతో తయారయ్యే స్వీట్ల వాడకం కూడా పెరిగిపోతున్నది. 2024లో విడుదలైన గృహవినియోగ వ్యయ సర్వే నివేదిక ప్రకారం పప్పులు, తృణధాన్యాల కంటే ఎక్కువ డబ్బును పాల కోసం ఖర్చు చేస్తున్నారు. కానీ వారు ఆశించిన మేరకు స్వచ్ఛమైనపాలు లభించడం లేదు. ముఖ్యంగా చిక్కగా ఉండే పాలంటే ఇష్టపడుతున్నారనే బలహీనతను సొమ్ము చేసుకునేందుకు కొందరు దళారులు భారీఎత్తున కల్తీకి పాల్పడుతున్న విషయం తరచుగా బయట పడుతున్నది. గ్లూకోజ్ ద్రావణం, రవ్వ, ఎసిటిక్ ఆసిడ్ వంటివికలిపి నకిలీ పాలనుతయారు చేస్తున్న ముఠా ఒకటి హైదరాబాద్‌లో పట్టుబడింది. ప్రమాదకరమైన మాల్టోడెక్స్‌ట్రిన్, పామాయిల్‌ను పేస్ట్‌లా చేసి పాలల్లో కలిపి అమ్ముకుంటున్న కొందరు దళారులు రాయలసీమ ప్రాంతాల్లో పట్టుబడ్డారు. తెలుగు రాష్ట్రాల్లోనేకాదు రాజస్థాన్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో అమ్ముతున్న పాలల్లో కూడా కల్తీ భారీగానే జరుగుతున్నట్లు అనేక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. కల్తీ పాలతో ముఖ్యంగా భావిభారత పౌరులుగా ఎదగాల్సిన బాలబాలికలు అనేక రుగ్మతలకు గురవుతున్నారనే ఆందోళన వ్యక్తంచేసిన అత్యున్నత న్యాయస్థానం ఈ దుర్మార్గాన్ని అణచివేసింది. తగిన మార్గ దర్శకాలను దాదాపు దశాబ్ద క్రితమే జారీ చేసింది. అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్న కల్తీ రాయుళ్లకు జైలు శిక్షను ఆరునెలల నుంచి సంవత్సరానికి పెంచాలని సూచించింది. కల్తీపాలను సేవిస్తే అజీర్తి సమస్యలతో ప్రారంభమయ్యే కడుపు నొప్పితోపాటు మూత్ర పిండాలు, కాలేయం, నాడీ వ్యవస్థపై ప్రభావం పడుతుందని వైద్య నిపుణులు ఏనాటి నుంచో హెచ్చరిస్తున్నారు. అంతేకాదు రసాయనికాలతో కూడిన పాలను దీర్ఘకాలం తీసుకుంటే కేన్సర్ వచ్చే అవకాశం ఉందని కూడా వైద్యులు అభిప్రాయపడుతున్నారు. ఇక పాలల్లో చిక్కదనం రావాలని, ఇటీవల కాలంలో ప్రొటెన్‌ను పెంచేందుకు ప్రమాదకరమైన మైలమన్ రసాయనిక పొడిని కలుపుతున్నారు. మరికొన్ని సందర్భాల్లో పశువులకు గాలికుంటు లాంటి వ్యాధులు సోకినప్పుడు పాలు పితకకూడదు. కానీ అవేమీ పాటించడం లేదు. ఇలాంటి పాలద్వారా చేసే రకరకాల తీపి పదార్థాలు కూడా కలుషితమైపోతున్నాయి. ఈ దురాఘాతాలను నివారించడంలో విఫలమవుతున్న అధికారగణంపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీం కోర్టు ప్రశ్నించిన సందర్భాలున్నా యి. ఇప్పటికైనా పాలకులు కల్తీ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉంది. కొత్త చట్టాల సంగతి దేవుడెరుగు. ఉన్న చట్టాలను త్రికరణశుద్ధిగా అమలు చేసేందుకు ప్రయత్నం చేయాలి. అంతేకాదు మామూళ్ల కోసమో, అలక్ష్యంతోనో ఈ కల్తీని నిరోధించడంలో విఫలమవుతున్న అధికారులపై కూడా పటిష్టమైన చర్యలు చేపట్టాలి.



ఒక రాజ్యంలో నివసించే ప్రజల భాషను తెలుసుకోకుండా, ప్రజాభిప్రాయం తెలుసుకోవడం సాధ్యం కాదు.

భారతీ



చదువుని మించిన ధనం అన్నది లేనే లేదు. అది మంచి రోజులలో ఆభరణంగా ఉంటూ, చెడు రోజులలో ఆశ్రయాన్ని కల్పిస్తుంది.

అరిస్టాటిల్

## ప్రజావాక్కు



### ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాలి

ముంబైలో ఎనిమిది ముఖ్యమైన రద్దీ ప్రదేశాలలో జరిగిన మారణహోమంలో ప్రధానసూత్రధారి అయిన తహవ్వూర్ హుస్సేన్ రాణాను అమెరికా నుండి భారత్‌కు రప్పించడం మన దౌత్యవిజయమేనని చెప్పాలి. ఆనాటి మారణహోమం మరువరానిది. నూటడెబ్బైమంది పైచిలుకు అమాయక ప్రజలప్రాణాలు పోగా వందలమంది గాయపడ్డారు. అజ్మల్ కసబ్ ఒక్కడే పట్టుబడ్డాడు. వీరంతా పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థకు చెందిన వారుగా చెప్పబడ్డారు. రాణా పాకిస్థాన్‌లో మిలిటరీ డాక్టరుట. ముంబై పేలుళ్ల అనంతరం అమెరికా పారిపోయి తలదాచుకున్నాడు. ప్రత్యేక విమానంలో అత్యంత భద్రత మధ్య రాణాను భారత్‌కు తీసుకువచ్చి తీహార్‌జైలుకు తరలించారు. మరి ఆ ఉగ్రవాదిని ఎందుకుభారత్ తీసుకోచ్చినట్టు? రాణాకు ప్రణాళికను రచించిన పాకిస్థాన్‌కు చెందిన అమెరికా ఉగ్రవాది డేవిడ్ హెడ్లీని భారత్‌కు రప్పించే ప్రయత్నం చేయాలి.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### ట్రైబల్ గురుకుల డిగ్రీ కళాశాలలో సమస్యలు

ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థుల సమస్యలను, వసతి సౌకర్యాలను, తెలంగాణ రాష్ట్రట్రైబల్ వెల్ఫేర్ సెక్రటరీ సంబంధిత గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, గిరిజన మంత్రి చొరవతీసుకొని ఎక్కడసాంక్షన్ అయిన డిగ్రీ కళాశాలను అక్కడనే నడపాలి. సాంక్షన్ ఒకచోట క్లాసులు జరిగేది మరొకచోట ఉండకూడదు. ఈవిధానం వలన పిల్లలు సాంకేతిక ఇబ్బందులు పడుతున్నారు. వచ్చే విద్యా సంవత్సరం ఎక్కడ సాంక్షన్ అయిన కళాశాలలో అక్కడే ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాలి.

- రాపాక రవీందర్, జనగాం

### అసమానతలకు ఆలవాలం ఉపాధి హామీ

ఉపాధి హామీపథకం పౌరుల కనీసహక్కుగా రూపొందించబడిన ఈపథకం అసమానతలకు ఆలవాలంగా ఉంటుంది. ఉపాధిహామీలో రాష్ట్రాలకు కనీసం హక్కు లేకుండాఉన్నది. రాష్ట్రఅవసరాలకు అనుగుణంగా పనుల ను ఎంపిక చేసుకునే బాధ్యత రాష్ట్రాల చేతిలో ఉండాలి. కానీ కేంద్రం కర్ర పెత్తనం చేస్తున్నది. సాగులో లేని బీడు భూములుతెలంగాణలో అయిదు శాతం వరకు ఉన్నాయి. ప్రతి రైతుకు చేపల చెరువులు అవసరం ఉంటుంది.

- భారత అవినాష్, జనగామ

### హైస్కూళ్లలో ప్రాథమిక తరగతులు వద్దు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 900 ఉన్నత పాఠశాలల్లో 3,4,5 తరగతులను కొనసాగిస్తూ కొత్తగా 1,2 తరగతులను కూడా విలీనం చేస్తామని విద్యాశాఖ పేర్కొన్నది. 117 రద్దు చేసి హైస్కూళ్లలోని 3,4,5 తరగతులను ప్రాథమిక పాఠశాలల్లోకి వెనక్కి పంపంచమని విజ్ఞప్తి చేస్తుంటే 1,2తరగతులను కూడా హైస్కూళ్లలో విలీనం చేయటం ఎంత వరకు సబబు. 3,4,5 తరగతులను హైస్కూళ్లలో గత ప్రభుత్వం విలీనం చేయటంతో ప్రభుత్వ ప్రాథమిక విద్యా వ్యవస్థ నిర్వీర్యం అయింది. ప్రస్తుత ప్రభుత్వం 1,2 తరగతులను కూడా హై స్కూళ్లలో విలీనం చేస్తే ప్రాథమిక విద్యావ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయ్యే అవకాశం ఉంది. కాబట్టి ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల్లోకి 3,4,5 తరగతులను వెనక్కి పంపాలి. 1,2 తరగతులను ప్రాథమిక పాఠశాలల్లో ఉంచాలి. 1,2 తరగతులను హైస్కూళ్లలో విలీనం చేసే ఆలోచన ప్రభుత్వం విరమించుకోవాలి.

-వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్

### ప్రమోషన్స్ ఇవ్వాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు ట్రాన్స్ఫర్లు చేయాలని ఒక చట్టం రూపొందించింది. విద్యాశాఖ మంత్రి దృష్టికి చేరాలని ముఖ్యమంత్రిగారి దృష్టిని చేరాలని ఉపాధ్యాయుల ఎమ్మెల్సీల ద్వారా ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అనేక ప్రయత్నాలు చేస్తూ ఉన్నారు. అన్ని డిపార్ట్మెంట్లకు ప్రమోషన్ వస్తున్నాయి. కానీ టీచర్లకు ప్రమోషన్లు ఒక కలగానే మిగిలిపోతూ ఉన్నది. ప్రమోషన్లలో రిజర్వేషన్లు ఉండడంవలన సీనియారిటీకు ప్రాధాన్యత ఇవ్వడంలేదు. కొంతమంది పుట్టిన తారీఖునుండి ప్రమోషన్లు ఇచ్చేయమని అప్పీలు చేశారు. స్కూల్ అసిస్టెంట్లుగా చేసిన ఆకాలాన్ని పరిగణలో తీసుకొని స్కూల్ అసిస్టెంట్ సీనియారిటీకి నోషనల్గా దాన్నికలిపి హెడ్మాస్టర్ గా ప్రమోషన్ ఇవ్వాలి.

- వీరగంట భాస్కర్ రావు, విజయనగరం జిల్లా

### ఇంటర్ విద్యా విధానంలో మార్పులు చేయొద్దు

ప్రభుత్వం ఇతర భాషలో మార్కులను దృష్టిలో ఉంచుకొని ఆలోచించడమే తప్ప తెలుగు భాషా ప్రావీణ్యాన్ని విద్యార్థులకి తెలుపలేకపోతుంది. ప్రపంచంలోనే రెండవ ఉత్తమ లిపిని కలిగిన తెలుగుభాషను మనం మరుగునపడేస్తున్నాం. ఇదంతా భాష మీదున్న నిర్లక్ష్యంలా అనిపిస్తుంది. కావున భావితరాలకు తెలుగు భాషను అందించి మాతృభాషను కాపాడుకుందాం.

-కాల్వ నిఖిత, సిద్దిపేట

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpagevaarta@gmail.com)


# పబ్లిక్ సర్వెంట్లలో జవాబుదారీ అవసరం!

**ముఖ్యమంత్రి, మంత్రులు, యంఎల్ఎలు, జిల్లా అధికారులు తమవద్దకు వచ్చిన ఫిర్యాదులు పరిష్కారం చేయటంతోపాటు సమస్య తమవద్దకు వచ్చే దాకా చేయకపోవటానికి కారణాలు ఏమిటో తగు రుజువులతో అధికారుల నుండి సంజాయిషీ కోరి తదనుగుణంగా శాఖాపరమైన చర్యలకి ఉపక్రమిస్తే భవిష్యత్తులో తప్పిదాలు పునరావృతం కాకుండా ఉంటాయి. అంతేకాకుండా ఉద్దేశ్యపూర్వకంగా ఎవరి విషయంలో అయినా, ఏ ప్రభుత్వశాఖ అధికారి అయినా, ఏస్థాయి అధికారి లేక ఉద్యోగి అయినా ఏచట్టాన్ని అయినా నిర్వీర్యం చేసినా లేక అధికార దుర్వినియోగం చేసినా గాని ప్రభుత్వమే ప్రాసిక్యూషన్ చర్యలు చేపట్టటం లేక బాధితులు ఎవరి అనుమతులు లేకుండా నేరుగా సివిల్, క్రిమినల్ చర్యలు చేపట్టటానికి వీలుగా అవసరమైన చట్టాల సవరణలుచేస్తే ఇంకా మంచి ఫలితాలు ఉంటాయి.**



డి.వి.లక్ష్మీనారాయణ

పబ్లిక్ సర్వెంట్లు అధికార దుర్వినియోగం, చట్టాల నిర్వీర్యం చేయకుండా నిరోధించటానికి ఆటంకం కలిగిస్తున్న 'సదుద్దేశ్య చర్యలకు రక్షణ' పేరుతో అవినీతి నిరోధక చట్టంలోను, నేర విచారణా చట్టంలో ఇంకా ఇతర చట్టాలలో దుర్వినియోగం అవుతున్న నిబంధనలను రద్దు చేయవలసిన అవసరం ఎంతైనాఉంది. తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు గడిచినా గానిఇంకా పాత, కొత్త భూసమస్యలు ఇతర సమస్యల పరిష్కారంకోసం నిత్యం బాధితులు పెద్ద సంఖ్యలో గుంపులుగా తిరునాళ్ల మాదిరి ముఖ్యమంత్రి, మంత్రులు, యంఎల్ఎలను, జిల్లా అధికారులను ఆశ్రయిస్తున్నారు. వారు సదరు అర్జీలను సంబంధిత అధికారులకు తగు చర్యల నిమిత్తం పంపిస్తున్నారు. వీళ్ల స్థాయిలో నిర్ణయాలు తీసుకోవాల్సిన అంశాలలో మాత్రమే సహజంగా బాధితులు కొద్ది సంఖ్యలో వీళ్లదగ్గరకు రావాలి. కాని తద్విరుద్ధంగా ప్రతి చిన్న సమస్య నుండి పరువు మర్యాదల అంశాలతోసహా జీవన్మరణ సమస్యలదాకా మంత్రులు, పబ్లిక్ సర్వెంట్లు, రాజకీయ ప్రముఖుల వద్ద తిరునాళ్ల మాదిరి గుంపులుగా బాధితులు గంటల తరబడి క్యూలో నిల్చుని మొరపెట్టుకుంటున్నారు. అనేక ప్రభుత్వ కార్యాలయాలలో ప్రతి చిన్నపనికి సైతం తరచుగా చట్టాలు కనుమరుగై రాజకీయ జోక్యం, పనిభారం, వ్యక్తిగత ప్రయోజనాలు ప్రభావం చూపిస్తున్నాయి. అన్నిప్రభుత్వ కార్యాలయాలలో సిబ్బంది, అధికారులు, ఆర్థిక వనరుల కొరత పట్టిపీడిస్తున్నాయి. అయితే సిబ్బంది అధికారుల కొరత ఉంటే అందించేసేవలు, ఫిర్యాదులు, సమస్యల పరిష్కారం జాప్యం జరుగుతుంది. అంతేకాని అవినీతి, అధికార దుర్వినియోగం, చట్టాల నిర్వీర్యం ఎందుకు జరుగుతుంది? ఇక గత్యంతరం లేక న్యాయ భిక్ష కోసం దిగువ కోర్టు నుండి రాష్ట్ర దేశఉన్నత న్యాయస్థానాల వరకువేలు, లక్షల సంఖ్యలో నిరీక్షిస్తున్నారు. న్యాయస్థానాలపై మోయలేని భారాన్ని మోపుతున్నారు. వాస్తవానికి పబ్లిక్ సర్వెంట్లలో అధిక శాతం సేవాభావంతోనే విధులు నిర్వహిస్తున్నారు. కాని దారితప్పిన కొంతమందితోనే ప్రభుత్వ సేవకుల పరువు ప్రతిష్ఠలు దిగజారుతున్నాయి. ఫలితంగా పలువురు పబ్లిక్ సర్వెంట్లు ప్రజాసేవకులుగా కాకుండా ప్రజా పెత్తందార్లుగా కొనసాగుతున్నారని బాధితుల ఆవేదనగా ఉంది. ఇక అసలు పబ్లిక్ సర్వెంట్ల అవినీతికి రాచమార్గాలు ఎలా ఉంటాయంటే మొదటిది ఒక వ్యక్తి తను చట్ట విరుద్ధంగా ఆర్థికపరంగా ఇతరత్రా ప్రయోజనం పొంది అందుకు సహకరించిన పబ్లిక్‌సర్వెంటుకి లభించిన ప్రయోజనంలో లంచం రూపంలో వాటా ఇవ్వటం, ఈ విషయంలో అటు లబ్ధిదారుకి ఇటు పబ్లిక్ సర్వెంట్కి ఇద్దరికి ఉభయ తారకంగా ప్రయోజనమే కాబట్టి ఎవరికీ అభ్యతరంఉండదు. ఇక రెండవది మరొక వ్యక్తి చట్టం పరిధిలో ప్రభుత్వ సేవ లభించటం లేక సమస్య/ ఫిర్యాదు పరిష్కారం కావటం కోసం పబ్లిక్ సర్వెంట్లకి ప్రతిఫలం ముట్టచెప్పటం. ఇది తప్పనిసరి తద్దినంలా తయారయింది. ప్రతిఫలం అందకపోతే సంవత్సరాలు గడిచినా అతీగతి ఉండదు. కొన్ని సందర్భాలలో అసలు పనికాదు. ఆపరిస్థితిలో మనం కోర్టు ద్వారా న్యాయం పొందాలంటే ఖర్చులు సుమారు ఒక లక్ష దాక ఖర్చుకావచ్చు. అదే పబ్లిక్ సర్వెంట్‌కి కోర్టు ఖర్చులో సగంఇస్తే పనితేలిగ్గా అయిపోతుంది. న్యాయపోరాటంతో అయ్యే ఖర్చులు లెక్కవేసుకుంటే లంచం ఇవ్వటమే తక్కువ ఖర్చు. ఇక పబ్లిక్ సర్వెంట్‌లు అధికార దుర్వినియోగానికి, చట్టాల నిర్వీర్యానికి పాల్పడుతున్నారని, ఇంకా తమ అర్జీలు లేక సమస్యలు సంవత్సరాలుగా పరిష్కారం చేయటంలేదని



వేలు, లక్షలలో బాధితులు కనిపించని దేవుళ్లందరికి కనిపించిన ప్రతి పబ్లిక్ సర్వెంట్కి మొరపెట్టుకుంటున్నారు. అందుకు కారణం పబ్లిక్ సర్వెంట్లకి 'రక్షణ' పేరుతో ఉన్న నిబంధనల కవచాలు. ఈ రక్షణ కవచాలు ధరించి ఒక శాతంగా ఉన్న పబ్లిక్ సర్వెంట్లు 99 శాతంగా ఉన్న ప్రభుత్వ సేవలు పొందే అర్జీదారులు/ తమ సమస్యల పరిష్కారం కోరేఫిర్యాదుదారులను శాసిస్తున్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం వేధిస్తున్నారు. చట్టాలను నిర్వీర్యం లేక దుర్వినియోగంచేసి కష్ట, నష్టాలకు గురిచేస్తున్నారు. వేధింపులకు గురవుతారనే అనుమానంతో రక్షణ పేరుతో ఒక శాతం పబ్లిక్ సర్వెంట్లకి 99శాతం ప్రజలను బలిచేయటం న్యాయం కాదు. మనలను పరిపాలించిన తెల్లదొరలు భారతీయులను అన్ని విధాల అణగదొక్కటానికి అప్పట్లో ఉన్నతాధికారులుగా ఎక్కువ తెల్లదొరలే కాబట్టి పబ్లిక్ సర్వెంట్లకి ప్రజలపై అపరిమిత అధికారాలు ఇచ్చారు. పబ్లిక్ సర్వెంట్లకి పరిమిత అధికారాలు ఉండాలి. అంతేకాని ప్రశ్నించటానికి వీలులేని అధికారాలు దేనికి? ప్రజాస్వామ్య దేశమని మనం గర్వంగా చెప్పుకుంటున్న మన దేశంలో ఇంకా పబ్లిక్ సర్వెంట్లకి నిరంకుశ అధికారాలు కొనసాగటం దురదృష్టకరం. పబ్లిక్ సర్వెంట్లకి ఆరక్షణ నిబంధనలు లేకపోతే కేసుల భయంతో పబ్లిక్ సర్వెంట్లు నిర్భయంగా విధులు నిర్వహించలేరని ఒక వాదనగా ఉంది. ఆ వాదన ఏమాత్రం సమర్థనీయం కాదు. ఎందుకంటే ఒక ఉద్యోగి నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత గడువులో తన విధి నిర్వహిస్తే అందుకు తగిన ఆధారాలుంటాయి. చేయని నేరాలను అంటకట్టి తప్పుడు కేసులుపెట్టే బాపతుసామాన్య ప్రజానీకంలో నూటికి ఒక్కరు ఉంటారు. ఆ సందర్భంలో అన్ని రుజువులు పబ్లిక్ సర్వెంట్ల అందుబాటులోఉంటాయి. కాబట్టి వెంటనే నిరూపించి బయటపడటం పెద్ద కష్టం ఏమికాదు. అదే పబ్లిక్ సర్వెంట్ చట్ట దుర్వినియోగం లేక నిర్వీర్యం నిరూపించాలంటే సామాన్య ప్రజానీకానికి అసాధ్యం. సంఘటిత పబ్లిక్ సర్వెంట్స్‌ని అసంఘటిత సామాన్య బాధితులు ఎదుర్కోలేరు. ఒక సామాన్య పౌరుని విషయంలో సైతం ఏచట్టాన్ని నిర్వీర్యం చేసినా లేక దుర్వినియోగం చేసినా కేసుల్లో ఇరుక్కుని బెయిల్ కోసం కోర్టుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితివస్తే అధికారంలో ఏపార్టీ ఉన్నా గాని పబ్లిక్ సర్వెంట్లు చట్టాలకి అనుగుణంగా మాత్రమే విధులు నిర్వహిస్తారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు కాబట్టే సామాన్య ప్రజానీకం జీవచ్ఛవాల మాదిరి భారంగా బ్రతుకు లీడుస్తున్నారు. ఈ దుస్థితిలో అధికారబలం, మందిబలం, ధనబలం, ఏదోకటి ఉన్నవాళ్లకి ఏదైనా సమస్యవస్తే వాళ్లకి అందుబాటులో ఉన్న అధికారంతో, మంది మార్బలంతో లేకపోతే గోతాలతో డబ్బు గుమ్మరించి ఏదోవిధంగా పరిష్కారం చేసుకుంటారు. అదే పైన తెల్పిన త్రివిధ బలాలలో ఏ ఒక్కటిలేని రెక్కాడితేకాని డొక్కాడని పేదలకి, లేక కనీస అవసరాలు మినహా పెద్ద ఖర్చులు వస్తే తట్టుకోలేని మధ్య తరగతి ప్రజానీకానికి ఏ చిన్న సమస్య ఎదురైనా పెద్ద గండంగా పరిణమిస్తుంది. అయితే అలాంటి వారికి ప్రభుత్వ కార్యాలయాలలో, న్యాయస్థానాలతో అవసరం ఎందుకు వస్తుంది అనే ప్రశ్న ఉదయించవచ్చు. బీదవారికి సమస్యలు ఏమి ఉండవు అనుకోటానికి వీలులేదు. అసలు పేదరికమే ఒక పెద్దసమస్య. దానికి అనుబంధంగా అనేక సమస్యలు కొలువుతీరి ఉంటాయి. అప్పుడు సమస్యలు భరించలేక, అన్యాయాన్ని ఎదుర్కోలేక న్యాయాన్ని కొనలేక(అంటేన్యాయ పోరాటానికి అయ్యే ఖర్చులు భరించలేక) 'ఓ కాలమా నీకిది న్యాయమా?' అని ప్రశ్నిస్తూ 'కరుణలేని కాలం కసిరి కాటు వేసే బ్రతుకే రగిలే చితి అయిపోయే' అని తీవ్ర మానసిక వేదనతో దుఃఖించే దీనులను ఆదుకోవటం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత కాదా. అందువలన ముఖ్యమంత్రి, మంత్రులు, యంఎల్ఎలు, జిల్లా అధికారులు తమవద్దకు వచ్చిన ఫిర్యాదులు పరిష్కారం చేయటంతోపాటు సమస్య తమవద్దకు వచ్చే దాకా చేయకపోవటానికి కారణాలు ఏమిటో తగు రుజువులతో అధికారుల నుండి సంజాయిషీ కోరి తదనుగుణంగా అధికారులపై శాఖాపరమైన చర్యలకి ఉపక్రమిస్తే భవిష్యత్తులో తప్పిదాలు పునరావృతం కాకుండా ఉంటాయి. అంతేకాకుండా ఉద్దేశ్యపూర్వకంగా ఎవరి విషయంలో అయినా, ఏ ప్రభుత్వ శాఖ అధికారి అయినా, ఏ స్థాయి అధికారి లేక ఉద్యోగి అయినా ఏ చట్టాన్ని అయినా నిర్వీర్యం చేసినా లేక అధికార దుర్వినియోగం చేసినా గాని ప్రభుత్వమే ప్రాసిక్యూషన్ చర్యలు చేపట్టటం లేక బాధితులు ఎవరి అనుమతులు లేకుండా నేరుగా సివిల్, క్రిమినల్ చర్యలు చేపట్టటానికి వీలుగా అవసరమైన చట్టాల సవరణలు చేస్తే ఇంకా మంచి ఫలితాలు ఉంటాయి. ●

# పేపర్ లీక్ బంగారు భవిష్యత్‌కు గొడ్డలిపెట్టు!

బుగ్గన మధుసూదనరెడ్డి

పేపర్ లీక్ వ్యవహారం అనేది ఈ రోజుదికాదు గతంలో సైతం పలు సందర్భాలలో విద్యార్థుల బంగారు భవిష్యత్‌తో ఈ పేపర్ లీక్ వ్యవహారం ఆటలాడుకున్న విషయం మనందరికీ విధితమే. ముఖ్యంగా పేపర్ లీక్ జరిగే అవకాశం ఏ మాత్రం జరుగని రీతిలో సాంకేతికంగా మనం ఎంతో అభివృద్ధి పథంలో పయనిస్తున్నప్పటికి ఈ సమాజంలో లాలూచి పడే వ్యక్తులు ఏదో ఒక మూలాన ఉండటం వలన ఇప్పటికీ ఏదో ఒక సందర్భంలో పబ్లిక్ పరీక్షల సమయాన ఏదేని సబ్జెక్టుకు సంబంధించి ఈ పేపర్ లీక్ ఉదంతం సంభవిస్తూ బాగా కష్టపడి చదివే విద్యార్థులు నోట్లో మట్టికొట్టేలా ఈ అనారోగ్య వాతావరణం పొడచూపుతుండటం నిజంగా అత్యంత దురదృష్టకరమైన విషయం. ఇందుకు ప్రధాన కారణం ఈ సమాజంలో ఆర్థికంగా, రాజకీయంగా బాగా పలుకుబడి వున్న వ్యక్తుల అండదండలతో దానికి సంబంధించిన శాఖలో పనిచేసే వ్యక్తులు డబ్బుకు ఆశపడి తిన్నింటి వాసాలు లెక్కబెట్టే రీతిలో వ్యవహారిస్తూ మన భారతదేశ విద్యావ్యవస్థకే, పబ్లిక్ పరీక్షలు నిర్వహించే వారి ఉనికినే భ్రష్టుపట్టించేలా వ్యవహారించే వారి తీరుతెన్నులు ఈ ప్రజాస్వామ్యానికి సంబంధించి ఓ సిగ్గుచేటైన, హేయమైన విషయం అనడంలో ఎలాంటి సందేహం లేదు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో సైతంఈ మధ్యనే లీక్ వ్యవహారం ఒకటి బయటకు రావడం ఒక పెను సంచలనానికి కారణభూతమైంది. కనీసం తరచుగా సంభవిస్తున్న ఈ చేదు అనుభవాలను దృష్టిలోపెట్టుకొని అయిన విద్యాశాఖకు చెందిన వారుగాని పబ్లిక్ పరీక్షలు నిర్వహించే బోర్డు వారిలో ఎవరైనాగాని లేక ఆయా శాఖకుచెందిన ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా ఇలాంటి అనారోగ్య, అనాగరిక రీతిలో ఒకవేళ కాసులకు కక్కుతిపడి మరీ ఈ పేపర్ లీక్ వ్యవహారంలో పాలుపంచుకుంటే మాత్రం అంతకు మించిన పాపం వారికి మరొకటి ఉండదు. ఎందుకంటే పబ్లిక్ పరీక్షల సమయాన ఈ పేపర్‌లీక్ ఉదంతాలు బయటకు పొక్కితేమాత్రం అనవసరంగా బాగా చదువుకునే విద్యార్థుల, సరస్వతిపుత్రుల ప్రిపరేషన పై అది తీవ్రప్రభావం చూపి వారి చదువు అటకెక్కే ప్రమాదం సైతం బాగాపొంచి ఉంటుంది. ఎలాగంటే బాగా డబ్బు, పలుకుబడి ఉండి విద్య సరిగా అబ్బని విద్యార్థుల కోసం ఇలాంటి చట్టవిరుద్ధమైన పేపర్ లీక్‌కు ఎవరైనా ఉపక్రమిస్తే ఎంతైనాఅది బాగా చదువులో ముందుండే వేలాది మంది విద్యార్థుల మెడకు కచ్చితంగా ఒక ఉరి కంభం, ఒక ఉరి కొయ్యను బిగించడం క్రిందకు వస్తుంది తప్ప మరొకటి కాదు. ఏదిఏమైన మన రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆయా విద్యాశాఖ మాత్యులు, ఆయా రంగానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగులు, పబ్లిక్ పరీక్షలు నిర్వహించే బోర్డు పెద్దలు ఈ పేపర్ లీక్‌వ్యవహారం విషయంలో మరోసారి ఎంతమాత్రం తప్పుదొర్లకుండాచట్టరీత్యా అత్యంత కఠి నంగా వ్యవహారించాల్సిన గురుతర బాధ్యత వారందరిపై ఎంతైనావుంది. ఏమైనా తరచుగాసంభవిస్తున్న ఈ పేపర్ లీక్ వ్యవహారం మన భారతదేశ విద్యావ్యవస్థకే ఒక మాయ ని మచ్చ వంటిది. ఒక విధంగా ఈఅనారోగ్య వాతావరణం పొడచూపడం అనేది మన విద్యావ్యవస్థ కీర్తి, ప్రతిష్టలకే కచ్చితంగా మసక బార్చే వ్యవహారం ఈ పేపర్ లీక్ ఉదం తం. ఇందులో ఎలాంటి సందేహానికి తావులేదు. అన్నింటికి మించి ముమ్మందు రాబోయే అకాడమిక్ సంవత్సరం లోనై నా ఈ పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ పరీక్షలలో విద్యావ్యవస్థకు ఇలాంటి అప్రతిష్టతెచ్చే ఈ పేపర్ లీక్ వ్యవహారం తలెత్తకుండా విద్యార్థుల భవిత అధోగతి పాలు కాకుండా చట్టరీత్యా చాలా కఠినచర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఆయా రాష్ట్ర విద్యాశాఖ వారిపై, పబ్లిక్ పరీక్షలు నిర్వహించేబోర్డు అధికారులపై ఎంతైనా వుంది. రేపటి మన భారతదేశ అభివృద్ధిలో పాలుపంచుకో బోయే సరస్వతి జ్ఞానపుత్రుల జీవితాలు ముమ్మందు ఉజ్వలంగా మరో పది కాలాల పాటు దిగ్విజయంగా వర్థిల్లాలి. ●

# పాత స్నేహానికి కొత్త పొత్తు పొడుపు

అప్పన్న గొనప

తమిళనాడు రాజకీయాల్లో కొత్త ఊపిరి పోస్తున్న బిజెపి - అన్నాడీఎంకే పొత్తు 2026 ఎన్నికలను కేంద్రంగా చేసుకొని భారత రాజకీయ రంగస్థలంపై తన ప్రభావాన్ని చూపించబోతుంది. గతంలో విడిపోయిన ఈ రెండుపార్టీలు మళ్లీ చేతులు కలిపిన విషయం ద్వారా, ఒక రాష్ట్ర రాజకీయ పునర్నిర్మాణానికి వేదిక సిద్ధమవుతోంది. ఈ పొత్తు వెనుక ఉన్న వ్యూహాలు, బిజెపికి దక్షి ణ భారతంలో పట్టు సాధించే ప్రణాళికలు, అన్నాడీఎంకేకు ప్రజాధారణ పునః స్థాపన లక్ష్యాలు మొదలైన అంశాలు పరిశీలించాల్సిన అవసరం ఉంది. 2019-2021 ఎన్నికల నాటికే బిజెపి - అన్నాడీఎంకె పొత్తు తెగిపోయింది. జయలలిత మృతితో అన్నాడీఎంకేలో నాయకత్వ లోపం స్పష్టంగా కనిపించింది. మోడీ షా జంట బిజెపిని జాతీయ స్థాయిలో బలంగా తీర్చిదిద్దుతున్న వేళ, తమిళనాడు మాత్రం ఎప్పటికీ ఆ పార్టీకి అజేయంగా మిగిలింది. గతంలో రాజనీతి గతంగా జరిగిన విభేదాలు, బిజెపికి వ్యతిరేకంగా ఉన్న తమిళ జాతీయతా భావాలు అన్నాడీఎంకెను తొలగించాయి. కానీ ఇప్పుడు, రాష్ట్రంలో డిఎంకెకు వ్యతిరేకంగా ఏర్పడిన అసంతృప్తిని వాణిజ్యపరంగా ఉపయోగించుకోవడానికి ఈ పొత్తు తిరిగి రూపొందించబడింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి మరోసారి అధికారంలోకి రావడంతో పాటు, దేశంలో విపక్షాలు గందరగోళ స్థితిలో ఉన్నాయి. ఈ ఫలితాలు తమిళనాడు పార్టీలను కొత్త దారిలో నడిపించాయి. డిఎంకెకు వ్యతిరేకంగా ఒక కూటమి అవసరం ఏర్పడింది. దాంతో అన్నాడీఎంకె, బిజెపి కలిసి తిరిగి సమరశంఖం మోగించాయి. ఇక్కడ ప్రధానంగా మోడీకి వ్యతిరేకంగా ఓటింగ్" అనే భావన కన్నా 'డిఎంకెకు వ్యతిరేకంగా' ఓటింగ్‌ను మలచే ప్రయత్నం బిజెపి చేసింది. ఇది బిజెపి దక్షిణ రాజకీయ వ్యూహాలలో ఒక కీలక దశగా నిలుస్తోంది. తాజాగా నాగేంద్రన్‌ను తమిళనాడు బిజెపి అధ్యక్షుడిగా ప్రకటించిన నిర్ణయం వ్యూహాత్మకంగా ఉంది. మద్దతుదారుల్ని ఆకర్షించే నాయకత్వానికి ఆయన అనుగుణంగా ఉండటమే కాదు, తమిళ సంస్కృతి, ఆత్మగౌరవ భావనకు దగ్గరగా ఉండే విధంగా పార్టీని మలచాలనే బిజెపి లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. అతి సంప్రదాయవాదాన్ని తక్కువ చేసి, ప్రాంతీయతను ఎక్కువగా ప్రదర్శిస్తూ పార్టీ ప్రజల మధ్యకి వెళుతోంది. అన్నాడీఎంకె బలహీనంగా మారిన నేపథ్యాన్ని అన్వయించుకొని పార్టీ మళ్లీ బలపడాలంటే కేంద్రం మద్దతు అవసరమని అర్థం చేసుకుంది. రాష్ట్రంలో డిఎంకే పరిపాలనపై పెరుగుతున్న అసంతృప్తిని దృష్టిలో ఉంచుకొని బిజెపితో కలిసే వ్యూహం ద్వారా తమను తిరిగి ప్రజల ఆప్షన్"గా మార్చుకోవాలని ప్రయత్నిస్తోంది. అదే సమయంలో బిజెపి



కూడా అన్నాడీఎంకె మద్దతు లేకుండా రాష్ట్రంలో భవిష్యత్తు లేదు అనే విషయం గుర్తించి పొత్తుకు సిద్ధమైంది. తమిళనాడు ఓటింగ్‌లో 70శాతం పైగా ఓటుబ్యాంక్ ద్రవిడ్ పార్టీలు, ముఖ్యంగా డిఎంకె, అన్నాడీఎంకె మధ్యే ఉండేది. బిజెపి ఓటువాటా ఇప్పటికీ 5-10శాతం మధ్యేఉంది. కానీ మద్దతు నెమ్మదిగా పెరుగుతుంది. మతపరమైన అంశాలను అధికంగా ఉపయోగించకుండా, అభివృద్ధి, యువత ఆశయాలపై దృష్టి పెట్టడం ద్వారా బిజెపి తన ఆధారం పెంచే ప్రయత్నం చేస్తోంది. ఇది రాబోయే అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయవచ్చు. డిఎంకె నాయకత్వం పట్ల అసంతృప్తి ఉన్న ప్రాంతాల్లో బిజెపి -అన్నాడీఎంకె కూటమి ప్రత్యామ్నాయంగా మారే అవకాశం ఉంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో అభివృద్ధి, ధరల పెరుగుదల వంటి అంశాలపై ప్రభుత్వం విఫలమైందన్న విమర్శలు పెరుగుతున్నాయి. మత ప్రాతిపదికపై కాకుండా సామాజిక విధానాల ప్రాతిపదికపై ఈ కూటమి ప్రజలకు ఓటింగ్ ఆప్షన్ ఇవ్వగలదా అన్నదే ప్రశ్న. భారతదేశంలోని ప్రస్తుత రాజకీయం 'ఆలయ్ గేట్ - ప్రగతి గేట్'గా విభజించబడింది. ఇందులో 'ఆలయ్ గేట్' అంటే మతపరమైన నినాదాలు, ఆలయ రాజకీయాలు, హిందూత్వ సిద్ధాంతాలకు మద్దతుగా ఉన్న రాజకీయ సంస్కృతిని సూచిస్తుంది. ఇది ప్రధానంగా బిజెపి ఉపయోగించే ప్రజాకర్షణ వ్యూహాలపై ఆధారపడిన భావన. మరోవైపు 'ప్రగతి గేట్' అనేది అభివృద్ధి, ఉద్యోగాలు, పెట్టుబడులు, సామాజిక సంక్షేమం వంటి అంశాల చుట్టూ తిరిగే విధానాన్ని సూచిస్తుంది. ఇది ముఖ్యంగా బిజెపి ప్రస్తుత ప్రచారంలో అభివృద్ధి శిఖరాన్ని చేరుకున్నామని చెప్పేకోణం. ఈ రెండు దేశవ్యాప్తంగా ఎన్నికలపై ప్రభావం చూపుతున్నాయి. ఒకదానిలో మతపరమైన ఐక్యతకు ప్రాధాన్యం ఉంటే, మరొకదానిలో ఆర్థిక పురోగతికి ప్రాముఖ్యత ఇవ్వబడుతోంది. తమిళనాడులో బిజెపి ఈ రెండింటినీ సమపాళ్లలో మిళితం చేయాలని ప్రయత్నిస్తోంది. మతఛాయలు మితంగా ఉంచి, అభివృద్ధికి మద్దతుగా నిలవాలన్న వ్యూహమే ఈ పొత్తు లక్ష్యంగా పెట్టుకున్నది. ఈ పొత్తును ప్రజలకు అర్థమయ్యేలా ప్రచారం చేయాలంటే మీడియా, సోషల్ మీడియా వేదికల్లో బ్రాండ్ నిర్మాణం చాలాకీలకం. మోడీకి తమిళంలో సానుకూల ముద్ర ఏర్పడాల్సిన అవసరం ఉంది. స్థానిక సంస్కృతి, భాష, ప్రాంతీయ గౌరవాన్ని మోడీ ప్రభుత్వం గౌరవిస్తుందని ప్రజల్లో నమ్మకం ఏర్పడాలి. ఇదిఅన్నాడీఎంకెకు బలంగా ఉండే ఓటర్ల మధ్య బిజెపికి మార్గం కల్పిస్తుంది. ఈ పొత్తు తుది ఫలితాలు తమిళ ఓటర్ల చేతుల్లోనే ఉన్నాయి. వాళ్ల ఆశలు, బాధలు, అభిప్రాయాలే రాజకీయ పార్టీల భవితవ్యాన్ని నిర్ణయిస్తాయి. అయితే ఈ కూటమి ఒక కొత్త రాజకీయ సమీకరణంగా ఏర్పడి, తమిళనాడు రాజకీయాలేకాకుండా జాతీయ రాజకీయాలకూ ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇదే సమయంలో, ఈ పొత్తు నిలబడాలంటే నమ్మకాన్ని కాపాడుకోవాలి, ప్రజల దైనందిన సమస్యలపై స్పష్టమైన వైఖరి తీసుకోవాలి. అప్పుడు మాత్రమే ఇది ఒక శాశ్వతమైన మార్గంగా నిలుస్తుంది. ●

# అంబేద్కర్‌కు శత్రువులు బిజెపి,ఆర్ఎస్ఎస్‌లే..

## కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 14:** రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేద్కర్‌కు బీజేపీ, ఆర్ఎస్ఎస్ శత్రువులంటూ కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన ఆశయాలను నెరవేర్చే ఉద్దేశం నరేంద్ర మోదీ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. మోదీ సర్కార్‌లో అంబేద్కర్‌పై గౌరవం మాటలకే పరిమితమని ఎద్దేవా చేశారు. ఆయన వారసత్వంపై ఎప్పుడూ పెదవి విరిస్తూనే ఉన్నారని వ్యాఖ్యానించారు. 1952 ఎన్నికల్లో అంబేద్కర్ ఓటమికి ఎస్ఏ డాంగే, వీడీ సావర్కర్ కారణమని, ఆ విషయాన్ని అంబేద్కర్ ఓ లేఖలో పేర్కొన్నారని ఖర్గే తెలిపారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా మీడియా సమావేశంలో పాల్గొన్న ఖర్గే కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. రాజ్యాంగం ఆశయాలను కాంగ్రెస్ నాశనం చేసిందని హర్యానాలో మోదీ చేసిన వ్యాఖ్యలను ఖర్గే తిప్పికొట్టారు. అసలు అంబేద్కర్ సూత్రాలను మోదీ ఎప్పుడు అవలంబించారు? అని ఖర్గే ప్రశ్నించారు. ఆ ప్రశ్నలకు సమాధానాలు చెప్పేందుకు వారు సిద్ధంగా లేరని అన్నారు. ఆయన జీవించి ఉన్నప్పుడు ఆయనకు మద్దతు ఇవ్వలేదని, బౌద్ధమతాన్ని స్వీకరించినప్పుడు అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. అంబేద్కర్ మహర్ సమాజానికి చెందిన వాడని, అంటరాని వాడని అన్నట్లు తెలిపారు. 2 సంవత్సరాల క్రితం మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందినప్పుడు కాంగ్రెస్ దానిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేసింది. అందులో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలనేది మా డిమాండ్. అదే మా లక్ష్యం. దీని కోసం మేం చాలా కాలంగా పోరాడుతున్నాం. కానీ మోదీ సర్కార్ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. అహ్మదాబాద్ సమావేశంలో ఆ విషయంపై ప్రచారాన్ని ప్రారంభించాలని నిర్ణయించాం అని ఖర్గే చెప్పారు. దేశవ్యాప్తంగా ప్రైవేటు విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వేషన్లు అమలుచేయాలని మల్లికార్జున ఖర్గే అన్నారు. రాజ్యాంగం పౌరులకు అంబేద్కర్ ఇచ్చిన బహుమతి. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం పొందే హక్కును కల్పిస్తుంది. ఏఐసీసీ సమావేశంలో సామాజిక న్యాయానికి సంబంధించిన అభిప్రాయాలను ముందుకు తీసుకెళుతున్నాం అని తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం, కేంద్రం విధానాలను రూపొందిస్తోంది. కానీ, 2021 జనాభా లెక్కల గురించి ఇంత వరకు జాడ లేదు. సాధారణ జనాభా లెక్కలతో పాటు ఏ విభాగంలో ఎంత పురోగతి సాధించామో తెలుసుకోవడానికి కులగణన ఉపయోగపడుతుంది. అందుకే కులగణన కోసం కాంగ్రెస్ తన గళం వినిపిస్తోంది అని మల్లికార్జున ఖర్గే తెలిపారు.



# నిప్పుతో చెలగాటమాడితే మీకే ముప్పు

## బంగ్లా తాత్కాలిక సారథి యూనస్‌కు హసీనా హెచ్చరిక

**ఢాకా, ఏప్రిల్ 14:** బంగ్లాదేశ్ తాత్కాలిక సారథి మహమ్మద్ యూనస్ చర్యలను మాజీ ప్రధాని షేక్ హసీనా దుయ్యబట్టారు. నిప్పుతో చెలగాటమాడితే అది మిమ్మల్నే దహించి వేస్తుందని హెచ్చరించారు. అధికార దాహంతో విదేశీయులతో కలిసి దేశ పతనానికి యత్నించారని తీవ్ర ఆరోపణలు చేశారు. బంగ్లాలోని తన మద్దతుదారులను ఉద్దేశించి హసీనా వర్చువల్‌గా మాట్లాడారు. ఈ సందర్భంగా యూనస్‌ను స్వార్థపూరిత రుణదాత అని దుయ్యబట్టారు. 'బంగ్లాదేశ్ స్వాతంత్ర్య ఉద్యమానికి సంబంధించి అన్ని గుర్తులను చెరిపేస్తున్నారు. స్వాతంత్ర్య సమర యోధులను అవమానిస్తున్నారు. వారికి గుర్తుగా అన్ని జిల్లాల్లో నిర్మించిన భవనాలను తగలబెడుతున్నారు. ఈ చర్యలను యూనస్ సమర్థించుకుంటున్నారా? మీరు నిప్పుతో చెలగాటమాడితే అది మిమ్మల్ని దహించివేస్తుంది. ఆ వడ్డీ వ్యాపారి, అధికార, ధన దాహం కలిగిన స్వార్థపరుడు విదేశీయులతో కలిసి కుట్ర పన్నాడు. దేశాన్ని నాశనం చేయడానికి విదేశీ సంపదను ఉపయోగించాడు. అక్కడి రాజకీయ పార్టీలు అవామీలీగ్ నాయకులపై దారుణాలకు ఒడిగడుతున్నాయి' అని మండిపడ్డారు. గతంలో కూడా ఆమె ఈ తరహా వ్యాఖ్యలు చేశారు. అవామీ లీగ్ పార్టీ సభ్యులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకున్న వారికి తగిన బుద్ధి చెప్పేరోజు వస్తుందని అన్నారు. త్వరలో బంగ్లాకు తిరిగి వస్తానని అన్నారు. 'ఒక్క రోజులోనే నా తండ్రి, తల్లి, సోదరుడిని కోల్పోయాను. నాడు వారు మమ్మల్ని దేశంలోకి రానివ్వలేదు. మీ సొంత వారిని కోల్పోయి ఇప్పుడు మీరంతా అనుభవిస్తున్న బాధను నేను అర్థం చేసుకోగలను. నా ద్వారా మీ అందరికీ మంచి చేయాలని ఆ భగవంతుడు కోరుకుంటున్నాడేమో. అందుకే నన్ను ఇంకా రక్షిస్తున్నాడు. నేను తిరిగి వచ్చాక అన్యాయం చేసిన వారందరికీ కఠిన శిక్ష అమలుచేస్తా' అని హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే.

ఇదిలా ఉంటే.. హసీనాపై అక్కడి న్యాయస్థానం మరోసారి అరెస్టు వారెంట్ జారీ చేసింది. అధికారాన్ని దుర్వినియోగం చేసి అక్రమంగా అక్రమంగా భూమిని స్వాధీనం చేసుకున్నారంటూ హసీనాతోపాటు ఆమె సోదరి రెహానా, మరికొందరిపై ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే ఆదివారం అరెస్టు వారెంటు జారీ అయింది.

# టారిఫ్‌ల నుంచి ఏ దేశానికీ మినహాయింపు లేదు

## చైనాకైతే రాయితీ ప్రసక్తే లేదు:డొనాల్డ్ ట్రంప్



**వాషింగ్టన్, ఏప్రిల్ 14:** అమెరికా టారిఫ్‌ల నుంచి ఏ దేశానికి మినహాయింపు లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెగేసి చెప్పారు. మరీ ముఖ్యంగా చైనాకు ఎటువంటి రాయితీ లభించదని తేల్చేశారు. తన కఠిన వాణిజ్య విధానాన్ని ఆయన ఆదివారం పునరుద్ఘాటించారు. 'మా నుంచి అసంబద్ధమైన వాణిజ్య మిగులు, నాన్ మానిటరీ టారిఫ్ అడ్డంకులు సృష్టించిన ఏ దేశానికి మినహాయింపు లభించదు. ముఖ్యంగా చైనాకు రాదు. ఆ దేశం మాతో దారుణంగా వ్యవహరించింది. శుక్రవారం టారిఫ్ మినహాయింపు ప్రకటించలేదు. ఆ ఉత్పత్తులు 20 శాతం ఫెంటనిల్ పన్ను పరిధిలోకి వస్తాయి. అవి కేవలం ప్రత్యేకమైన టారిఫ్ బకెట్‌లోకి మారాయి. తప్పుడు వార్తలు రాసేవారికి ఇది తెలుసు కానీ, వారు దీనిని రిపోర్టు చేయరు. రానున్న నేషనల్ టారిఫ్ ఇన్వెస్టిగేషన్‌లో సెమికండెక్టర్లు, మొత్తం ఎలక్ట్రానిక్ సామగ్రిని పరిశీలిస్తున్నాం. దీనిని బట్టి దేశీయంగా వీటిని ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఉందని తేలింది. అప్పుడే మనం చైనా చేతిలో బందీగా మారకుండా ఉంటాం. ఆ దేశం అమెరికా ప్రజల శక్తిని దెబ్బతీయడానికి ఉన్న ప్రతీ అవకాశాన్ని వాడుకొంటోంది. దానిని కొనసాగనీయం. ఆ రోజులు ముగిశాయి. అమెరికా స్వర్ణయుగం మొదలైంది. భవిష్యత్తులో పన్ను, నియంత్రణల్లో భారీ మొత్తం మినహాయింపులు లభించనున్నాయి. మన దేశంలోని వస్తువులు తయారుచేసి గతంలో ఇతర దేశాలు ముఖ్యంగా చైనా మనతో ఎలా వ్యవహరించిందో మనం కూడా అలానే చేద్దాం. చివరిగా చెప్పేదేంటంటే మన దేశాన్ని గతంలో ఎన్నడూ లేనంత పెద్దది, మెరుగైంది, బలమైందిగా మార్చనున్నాం. మేక్ అమెరికా గ్రేట్ అగైన్' అని ట్రూత్ సోషల్‌లో రాసుకొచ్చారు.

**మరిన్ని టారిఫ్‌లు:** ఇక అమెరికా వాణిజ్యమంత్రి హోవార్డ్ లుట్నిక్ ఆదివారం మాట్లాడుతూ.. ఎలక్ట్రానిక్ వస్తువులపై ట్రంప్ కార్యవర్గం ఇచ్చిన మినహాయింపులు తాత్కాలికమైనవే అన్నారు. రెండు నెలల్లోపు ప్రకటించనున్న సెమీకండక్టర్ టారిఫ్ పరిధిలోకి వచ్చే అవకాశం ఉందని వివరించారు. వాటి ఉత్పత్తి కేంద్రాలను అమెరికాకు తరలించేలా వాటిపై దృష్టి పెట్టనున్నామన్నారు. 'మాకు సెమీకండక్టర్లు, చిప్స్, ఫ్లాట్ ప్యానల్స్ అవసరం. అమెరికాను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో వారి పాత్ర ఉంది. మాకు అవసరమైన అన్ని వస్తువుల కోసం మేము ఆగ్నేయాసియాపై ఆధారపడదల్చుకోలేదు. అందుకే వారిని ప్రతీకార పన్నుల నుంచి మినహాయించి.. సెమీకండక్టర్ పన్నుల పరిధిలోకి తీసుకొద్దామని ట్రంప్ అంటున్నారు' అని లుట్నిక్ వెల్లడించారు.

## ట్రంప్ హత్యకు డబ్బులివ్వలేదని తల్లిదండ్రులను కాల్చిచంపిన యువకుడు

**వాషింగ్టన్, ఏప్రిల్ 14:** అమెరికాలో డబ్బులివ్వలేదని తల్లిదండ్రులను ఓ యువకుడు(17) దారుణంగా కాల్చి చంపిన కేసులో సంచలన విషయాలు బయటకు వచ్చాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను హత్య చేసేందుకు కుట్ర పన్నాడని తెలిపింది. అందుకోసం డబ్బులు ఇవ్వట్లేదనే తల్లిదండ్రులపై దారుణానికి ఒడిగట్టినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ మేరకు ఫెడరల్ వారెంట్‌లో అధికారులు వెల్లడించారు. విస్కాన్సిన్‌లోని మిల్వాకీ ప్రాంతానికి చెందిన 17 ఏళ్ల నికిటా క్యాసప్ అనే కుర్రాడు, ఫిబ్రవరి 11న తన తల్లి టటియానా, సవతి తండ్రి డొనాల్డ్ మేయర్‌ను తన నివాసంలోనే అతి దారుణంగా తుపాకీతో కాల్చాడు. అనంతరం వారిద్దరూ మృతిచెందారు. ఆ తర్వాత వారి మృతదేహాలతో పాటే నివసించాడు. అనంతరం 14వేల డాలర్ల నగదు, పాస్‌పోర్ట్ తదితర వస్తువులు తీసుకుని ఇంటి నుంచి పరారయ్యాడు. ఘటన జరిగిన కొద్ది రోజులకు నిందితుడి ఇంటి ఈ నుంచి దుర్వాసన రావడం మొదలైంది. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలికి వచ్చి చూడగా హత్య విషయం వెలుగులోకి వచ్చింది. అనంతరం మార్చిలో కాన్సస్‌లో నిందితుడు నికిటాను అరెస్టు చేశారు పోలీసులు. అనంతరం తమదైన శైలిలో విచారించగా నిందితుడి గురించి సంచలన విషయాలు బయటకు వచ్చాయి. ఆర్థిక అవసరాలు, స్వేచ్ఛకోసమే అతడు తల్లిదండ్రులను చంపినట్లు వెల్లడైంది. అంతేకాకుండా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను చంపేందుకు నికిటా కుట్ర చేసినట్లు పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. అయితే, నిందితుడు పన్నిన దారుణమైన ఈ కుట్ర గురించి తల్లిదండ్రులకు తెలియడం వల్లనే వారిని నికిటా చంపేసినట్లు తెలిసింది. వారిని చంపిన తర్వాత ఆ నిందితుడు ఓ డ్రోన్, ఇతర పేలుడు పదార్థాలను కొనుగోలు చేశాడని దర్యాప్తులో తెలిపింది. అధ్యక్షుడిని అంతమొందించే ప్లాన్ ఓ రష్యా వ్యక్తితో కలిసి నిందితుడు వేసినట్లు తెలుస్తోంది. టిక్‌టాక్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా యాప్‌లలో ఇతడు సంభాషణలు జరిపినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. అధ్యక్షుడిని చంపేసిన తర్వాత ఉక్రెయిన్ పారిపోవాలని నిందితుడు ప్లాన్ వేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఈ సంచలన కేసుపై దర్యాప్తు కొనసాగుతోంది.



## ట్రంప్‌కు షాకిచ్చిన చైనా

### ప్రధాన ఖనిజాల ఎగుమతులు నిలిపివేసిన డ్రాగన్

**బీజింగ్, ఏప్రిల్ 14:** అమెరికా చైనాలమధ్య ట్రేడ్ వార్ మరింత తీవ్రం అయింది. అరుదైన ఖనిజాలు, కీలకమైన లోహాలు, అయస్కాంతాలను ఎగుమతిచేయడం చైనా నిలిపివేసింది. దీనితో పశ్చిమదేశాల్లో ఆయుధాలు ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, ఏరోస్పేస్ తయారీ, సెమీకండక్టర్ల కంపెనీలకు సమస్యలు ఎదురవుతున్నాయి. ఎగుమతులకు సంబంధించిన నిబంధనలు చైనా రూపొందిస్తోంది. అప్పటివరకూ చైనా పోర్టులనుంచి మాగ్నెట్‌ల ఎగుమతులను నిలిపివేసారు. ట్రంప్ ప్రారంభించిన వాణిజ్యయుద్ధానికి ప్రతిస్పందనగానే కీలక విడిభాగాల ఎగుమతులను చైనా ఆపేసింది. ప్రపంచ వ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న ఖనిజాల్లో సుమారు 90 శాతం చైనానుంచే వెళుతున్నాయి. ఈనెల 2 నుంచి చైనా వీటి ఎగుమతులపై ఆంక్షలు విధించింది. ఇప్పటికే చైనా ఉత్పత్తులపై 54శాతం ట్యారిఫ్‌లను ట్రంప్ ప్రకటించారు. వీటినికాకుండా పర్మనెంట్ మాగ్నెట్లు ఇతర ఉత్పత్తులను కూడా నిలిపేసారు. ఈ లోటును భర్తీచేసుకోవడం అగ్రరాజ్యానికి ఇబ్బందికరంగా మారనుంది. అమెరికాతో వాణిజ్య ఉద్రిక్తతలు మరింత ముందిరితే ఇలాంటి చర్యలుచేపడతామని చైనా ఎప్పటినుంచో చెపుతోంది.



## అయ్యప్ప బంగారులాకెట్లు పంపిణీ ప్రారంభం

### మొదటి లాకెట్ ఆంధ్రప్రదేశ్ భక్తుడికే..

**తిరువనంతపురం, ఏప్రిల్ 14:** అయ్యప్ప రూపంలో ఉన్న బంగారు లాకెట్ల పంపిణీ సోమవారం విషు పర్వదినం సందర్భంగా ప్రారంభించింది. శబరిమల ఆలయం గర్భ గుడిలో ఉంచి పూజించిన బంగారు లాకెట్ల పంపిణీని కేరళ దేవాదాయశాఖ మంత్రి వీఎన్ వాసవన్ ప్రారంభించారు. దీంతో చాలాకాలంగా ఉన్న అయ్యప్ప భక్తుల డిమాండ్ నేరవేరిందని బోర్డు తెలిపింది. ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన భక్తుడికి మంత్రి వాసవన్ మొదటి లాకెట్ అందజేశారు. ఆ తరువాత శబరిమల తంత్రి (ప్రధాన పూజారి) కందరారు రాజీవరు, టీడీబీ అధ్యక్షుడు పీఎస్ ప్రశాంత్, బోర్డు సభ్యుడు ఏ అజికుమార్ మిగిలిన భక్తులకు లాకెట్లను పంపిణీ చేశారు. అయ్యప్ప లాకెట్లను 2 గ్రాములు, 4 గ్రాములు, 8 గ్రాములలో సైజుల్లో తయారు చేసినట్లు టీడీబీ తెలిపింది. 2గ్రాముల బంగారు లాకెట్ ధర రూ. 19,300 గా నిర్ణయించారు. 4గ్రాముల లాకెట్ ధర రూ.38,600, 8గ్రాముల బరువున్న బంగారు లాకెట్ ధర రూ.77,200 అని టీడీబీ తెలిపింది. బుకింగ్ ప్రారంభమైన రెండు రోజు ల్లోనే మొత్తం 100 మంది భక్తులు లాకెట్లను బుక్ చేసుకున్నారని టీడీబీ ప్రకటనలో పేర్కొం ది. అయ్యప్ప భక్తులు ఈ బంగారు లాకెట్లను రెండు విధాలుగా కొనుగోలు చేయవచ్చని దేవస్థానం బోర్డు ఇంతకుముందు తెలిపింది. ఆన్ లైన్ లేదా ఆలయ ప్రధాన ప్రాంతమైన సన్నిధానంలోని దేవస్వోమ్ పరిపాలనా కార్యా లయంలో నగదు చెల్లించడం ద్వారా పొందవ చ్చని వెల్లడించింది. బంగారు లాకెట్‌ను ఆలయ పవిత్ర గర్భ గుడి లోపల పూజలు నిర్వహించి అందజేస్తారు. ఇలాచేయడం వల్ల భక్తులకు అదనపు ప్రత్యేకతను ఇస్తుందని దేవస్థానం పేర్కొంది. అయ్యప్ప స్వామి ఫొటోతో బంగారు లాకెట్లను తయారు చేసి సప్లై చేసే టెండర్లను తమిళనాడుకు చెందిన జీఆర్‌టీ జ్యువెల్లర్స్, కేరళకు చెందిన కల్యాణ్ జ్యువెల్లర్స్ దక్కించుకున్నాయి. మలయాళ క్యాలెండర్‌ప్రకారంసంవత్సరంలోని తొలి మాసం పేరు మెదమ్. ఈ నెలలోని మొదటి రోజే విషు. విషు పర్వదిన వేడుకల్లో ఈ బంగారు లాకెట్లు ముఖ్యమైన భాగం. ఇది శబరిమల సందర్శించే వేలాది మంది భక్తులకు ఆధ్యాత్మిక అనుభవాన్ని మరింత సుసంపన్నం చేస్తుందనే భావన ఉంది.

# వక్ఫ్ ఆందోళనలతో ముర్షిదాబాద్‌లో భయం..భయం!



**ముర్షిదాబాద్, ఏప్రిల్ 14:** వక్ఫ్ సవరణ చట్టాన్ని నిరసిస్తూ బంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలో జరిగిన హింసాత్మక ఘటనలకు సంబంధించి పోలీసులు ఇప్పటివరకు 150 మందిని అరెస్టు చేశారు. కొత్తగా ఎక్కడా హింసాత్మక సంఘటనలు జరగలేదని పోలీసులు తెలిపారు. ముర్షిదాబాద్ జిల్లాలోని సుతి, ధులియాన్, సంసేర్‌గంజ్, జంగీపూర్ ప్రాంతాల్లో పరిస్థితి ప్రశాంతంగా ఉందని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో నిషేధాజ్ఞలు విధించిన పోలీసులు, హైకోర్టు ఆదేశాల మేరకు తీళీనీ బలగాలను కూడా మోహరించారు. ఉన్నతాధికారులు రాత్రంతా ఆయా ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. హింసకు పాల్పడిన నిందితుల కోసం గాలింపు చేపట్టిన పోలీసులు ఆదివారం తెల్లవారుజామున మరో 12 మందిని అరెస్టు చేశారు. వీరితో కలిపి ఇప్పటివరకు అరెస్ట్ చేసిన వారి సంఖ్య 150కి చేరినట్లు సీనియర్ అధికారి తెలిపారు. హింసాత్మక ప్రాంతాల్లో ఇంటర్నెట్ నిలిపివేసినట్లు చెప్పారు. హింసాత్మక ఘటనలపై దర్యాప్తు జరుగుతోందని మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉందని వివరించారు. 400 కుటుంబాలు పక్క జిల్లాకు ముర్షిదాబాద్‌లో హింసాత్మక ఘటనల తర్వాత ఓ వర్గానికి చెందిన వారు భయంతో మరో ప్రాంతానికి తరలి వెళుతున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దాదాపు 400 కుటుంబాలు ధులియాన్ నుంచి సమీపంలోని మాల్దా ప్రాంతానికి తరలివెళ్లారని బంగాల్ శాసనసభ విపక్షనేత సువేందు అధికారి ఎక్స్‌లో పోస్టు చేశారు. బాధితులంతా స్థానిక నదిని దాటుకొని మాల్దా జిల్లాలోని బైస్నాబ్‌నగర్ ఉన్న ఓ పాఠశాలలో తలదాచుకుంటున్నారని తెలిపారు. ఓ వర్గంపై క్రమంగా తప్పుకుండా దాడులు జరుగుతున్న నేపథ్యంలో బంగాల్, బంగ్లాదేశ్ సరిహద్దుల్లో ఉన్న జిల్లాలను సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం కింద కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించాలని బీజేపీ ఎంపీ జోతిర్మయి సింగ్, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. మాల్దా, ముర్షిదాబాద్, దక్షిణ 24 పరగణ, నదియా జిల్లాల్లో దాడులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. దాదాపు 86 కుటుంబాలకు చెందిన ఇళ్లు, దుకాణాలను ధ్వంసం చేయడంతో పాటు లూటీ చేశారని ఆరోపించారు. ముర్షిదాబాద్‌లో శాంతిని నెలకొల్పేందుకు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని తృణముల్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ ఎంపీ ఇషా ఖౌదురీ ఖాన్ కోరారు. శాంతిని పునరుద్ధరించడానికి అన్ని వర్గాల నాయకులను, పార్టీలను ఏకతాటిపైకి తీసుకరావడం కీలమని అన్నారు.

# నాకుటుంబ ఆశీస్సులతో రాజకీయాల్లోకి వస్తా..

## ప్రియాంక భర్త రాబర్ట్ వాద్రా

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 14:** కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ భర్త, ప్రముఖ వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రా రాజకీయాల్లోకి వచ్చేందుకు సుముఖత వ్యక్తం చేశారు. నేను రాజకీయాల్లోకి రావాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తే, కచ్చితంగా నా కుటుంబ సభ్యుల



ఆశీస్సులతో వస్తానని రాబర్ట్ వాద్రా స్పష్టం చేశారు. నాకు గాంధీ కుటుంబంతో ఉన్న అనుబంధం వల్లనే రాజకీయాలతో సంబంధం ఏర్పడింది. చాలా సంవత్సరాలుగా పలు రాజకీయ పార్టీలు నన్ను రాజకీయాల్లోకి లాగడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాయి. ముఖ్యంగా ఎన్నికల సమయంలో లేదా ఇతర రాజకీయ గొడవల సమయంలో నా పేరును బాగా వాడుకుంటుంటాయి. ప్రియాంక నుంచి చాలా నేర్చుకున్నా. నా కుటుంబం నుంచి,ముఖ్యంగా నా భార్య ప్రియాంక, బావమరిది రాహుల్ గాంధీ నుంచి చాలా నేర్చుకున్నా. వాళ్లు పార్లమెంట్‌లో చాలా చక్కగా పనిచేస్తున్నారు. నేను ఎప్పుడూ ప్రియాంక పార్లమెంట్‌లో ఉండాలని కోరుకున్నాను. ఇప్పుడు ఆమె ఎంపీగా ఉంది. చాలా కష్టపడి పనిచేస్తోంది. కాంగ్రెస్ పార్టీ నన్ను రాజకీయాల్లోకి తేవాలని నిర్ణయిస్తే, విభజన శక్తులతో పోరాడడానికి, దేశాన్ని లౌకికంగా ఉంచడానికి కృషి చేస్తా. ఇందుకోసం పార్లమెంట్‌లో మరిన్ని గొంతుకలు అవసరం అని నేను అర్థం చేసుకున్నా. నా కుటుంబ సభ్యులతో ఆశీస్సులతో రాజకీయాల్లోకి వస్తా. క్షేత్రస్థాయిలో ఏమి జరుగుతుందో, ఏ మార్పు అవసరమో నాకు చాలా అవగాహన ఉందని వారికి తెలుసు.బ్యాంక్ రుణాల ఎగవేత కేసులో ప్రధాన నిందితుడిగా ఉండి, దేశం నుంచి పారిపోయిన వ్యాపారవేత్త మెహుల్ ఛోక్సీని బెల్జియంలో అరెస్ట్ చేయడంపై రాబర్ట్ వాద్రా తనదైన రీతిలో స్పందించారు. మెహుల్‌ను అరెస్ట్ చేయడం మన దేశానికి చాలాపెద్ద విషయం. అయితే అరెస్ట్ చేయడం ముఖ్యమైనదే అయినప్పటికీ, అతను దోచుకున్న సొమ్మును తిరిగి వసూలు చేయడం, నష్టపోయిన వ్యక్తులకు తగిన విధంగా పరిహారం అందించడంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం దీని గురించి ఆలోచించాలి. నీరవ్ మోదీ సహా, ఆర్థిక నేరస్థులను తిరిగి భారత దేశానికి రప్పించాలి. నష్టపోయిన ప్రజలకు పరిహారం అందించేలా చూడాలి అని రాబర్ట్ వాద్రా అన్నారు. 65ఏళ్ల వజ్రాల వ్యాపారి మెహుల్ ఛోక్సీ పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి రూ.13,850 కోట్ల రుణం తీసు కుని ఎగ్గొట్టాడు. ఇతని మేనల్లుడు నీరవ్ మోదీ కూడా ఈ మోసంలో ప్రధాన పాత్రధారిగా ఉన్నాడు. వీరిద్దరి గురించి సీబీఐ, ఈడీలు గాలి స్తున్నాయి. 2018 జనవరి 2న భారతదేశం నుంచి పారిపోయిన మెహుల్ ఛోక్సీని బెల్జి యంలో సిబిఐ అధికారులు అరెస్ట్ చేశారు.

# అరేబియా తీరంలో భారీగా డ్రగ్స్ స్వాధీనం

**అహ్మదాబాద్, ఏప్రిల్ 14:** అరేబియా సముద్రంలో ఇండియన్ కోస్ట్ గార్డ్ సీజీ డేరింగ్ ఆపరేషన్ చేసింది. గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ ఏటీఎస్‌తో కలిసి రూ.1800 కోట్లు విలువ చేసే 300 కిలోల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుంది. ఈ మేరకు సోమవారం ఐసీజీ అధికారులు వివరాలు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న డ్రగ్స్‌ను మెథాంఫెటమైన్ గా అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనపై తదుపరి దర్యాప్తును ఏటీఎస్‌కు అప్పగించారు. కోస్ట్‌గార్డ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, స్మగ్లర్ల కార్యకలాపాలపై ఇండియన్ కోస్ట్ గార్డ్‌కు సమాచారం అందింది. అనంతరం ఏప్రిల్ 1213 అర్ధరాత్రి గుజరాత్ తీరంలోని అరేబియా సముద్రంలో ఏటీఎస్‌తో కలిసి ఆపరేషన్ చేపట్టింది ఐసీజీ. బోటుపై వెళ్తున్న స్మగ్లర్లను చీకట్లో కోస్ట్‌గార్డ్ నౌక వెంటాడింది. తమ వైపు సమీపిస్తున్న ఐసీజీ నౌకను చూసిన స్మగ్లర్లు డ్రగ్స్‌ను సుముద్రంలో పారేసి ఇంటర్నేషనల్ మారిటైమ్ బౌండరీ లైన్‌ను దాటి వెళ్లిపోయారు. అయితే, స్మగ్లర్ల బోట్‌ను గుర్తించే సరికి అది ఐఎమ్‌బీఎల్‌కు సమీ పంలో ఉందని, అందుకే వారు తప్పించుకునేం దుకు అవకాశం ఏర్పడిందని కోస్ట్‌గార్డ్ తెలిపింది. ఆ తర్వాత కోస్ట్ గార్డ్ సిబ్బంది రంగంలోకి దిగి అత్యంత ప్రతికూల, చీకటి వాతావరణంలో డ్రగ్స్‌ను సముద్రం నుంచి బయటకు తీశాయని వెల్లడించింది. తదుపరి విచారణ కోసం సీజ్ చేసిన మెటీరియల్‌ను ఐసీజీ ద్వారా పోరు బందర్‌కు తరలించినట్లు పేర్కొంది.

ఇటీవలి కొన్నేళ్లలో ఐసీజీ, ఏటీఎస్ 13 విజయవం తమైన ఆపరేషన్లలో భాగమయ్యాయని వెల్లడించింది. గతేడాది నంబర్‌లో కూడా ఐసీజీ భారీ అపరేషన్ చేపట్టింది. అండమాన్ నికోబార్ తీరంలో కోస్ట్ గార్డ్ సిబ్బంది భారీగా మాదక ద్రవ్యాలను పట్టుకున్నారు. ఫిషింగ్ బోటు నుంచి ఆరు టన్నుల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. కోస్ట్‌గార్డ్ చరిత్రలోనే ఇంత భారీ మొత్తంలో మాదక ద్రవ్యాలు పట్టుబడటం ఇదే తొలిసారి. 6,000 కిలోల మెథాంఫేటమిన్‌నుతరలిస్తున్న బోటును సీజ్ చేశారు. అంతర్జాతీయ మార్కె ట్‌లో కోట్ల రూపాయల విలువ చేసే మెథాం ఫేటమిన్‌ను 2కిలోల చొప్పున 3 వేల ప్యాకెట్లలో తరలిస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 23న కోస్ట్ గార్డ్ డోర్నియర్ విమానం పైలట్ సాధారణ పెట్రోలింగ్‌లో ఉన్నప్పుడు, పోర్ట్ బ్లెయిర్ నుంచి దాదాపు 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న బారెన్ ద్వీపంలో ఒక ఫిషింగ్ బోటు అనుమానాస్పద కదలికను గమనించినట్లు డిఫెన్స్ అధికారి తెలిపారు. దాడిచేస్తే భారీ మొత్తంలో ఉన్న మెథాఫెంటమిన్ బయటపడింది.

# జడ్జిని దొంగగా చూపించిన పోలీస్

**లక్నో, ఏప్రిల్ 14:** ఒక పోలీస్ అధికారి ఏకంగా జడ్జిని దొంగగా పేర్కొన్నాడు. ఆ చిరునామాలో వెతికినా కనిపించలేదంటూ కోర్టుకు నివేదిక ఇచ్చాడు. ఆ న్యాయమూర్తి ఇది చూసి కంగుతిన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఆ పోలీస్‌పై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికా రులను ఆదేశించారు. ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజా బాద్‌లో ఈ సంఘటన జరిగింది. 2012లో రాజ్‌కుమార్ అలియాస్ పప్పుపై దొంగతనం కేసు నమోదైంది. నాటి నుంచి అరెస్ట్ కాకుండా అతడు తప్పించుకుని తిరుగుతున్నాడు. పలుసార్లు నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేసినప్పటికీ కోర్టుకు హాజరుకాలేదు. దీంతో రాజ్‌కుమార్‌ను నేరస్థుడిగా ప్రకటించి సంబంధిత సెక్షన్ కింద చర్యలు తీసుకోవాలని చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ నగ్మా ఖాన్ పోలీసులను ఆదేశించారు. కాగా, సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) బన్వరీలాల్ కోర్టు ఉత్తర్వుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. దానిని పూర్తిగా చదవకుండానే కోర్టుకు నివేదిక ఇచ్చాడు. నిందితుడి పేరుకు బదులు న్యాయమూర్తి నగ్మా ఖాన్ పేరును ప్రస్తావించాడు. ఆ చిరునామాలో వెతికినప్పటికీ నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయిన నిందితుడ్ని కనుగొనలేకపోయినట్లు అందులో పేర్కొన్నాడు. మరో వైపు మార్చి 23న ఈ కేసుపై కోర్టులో విచారణ జరిగింది. ఎస్ఐ బన్వరీలాల్ కోర్టుకు సమర్పించిన నివేదిక చూసి న్యాయమూర్తి నగ్మా ఖాన్ గందరగోళం చెందారు. నిందితుడి పేరు



బదులు తన పేరు ఉండటం చూసి ఆమె షాకయ్యారు. ఆ పోలీస్ అధికారి నిరక్ష్యం పై మండిపడ్డారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని పోలీస్ ఉన్నతాధి కారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఎస్ఐ బన్వరీలాల్‌ను సస్పెండ్ చేశారు. ఆయనపై శాఖాపరంగా దర్యాప్తు చేస్తున్నారు.



## సమసమాజ నిర్మాణం కోసం అంబేద్కర్ కృషి

### పిసిసి చీఫ్ మహేష్‌కుమార్

**హైదరాబాద్, ఏప్రిల్ 14,ప్రభాతవార్త:** అంబెద్కర్ సమసమాజ స్థాపన కోసం జీవితాంతం కృషి చేశారని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్ అన్నారు. సోమవారం గాంధీభవన్‌లో భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆ మహనీయుని చిత్రపటానికి నివాళులు అర్పించినారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తోపాటు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మాజీ పీసీసీ హనుమంతు రావు,కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. టీపిసిసిఅధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ అంబెద్కర్ ఆశయసాధన కోసం కట్టుబడి ఉందని అన్నారు.భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలు ఆదర్శం, ఆచరణీయం అన్నారు. సమసమాజ స్థాపనచేయడాని మనం పోరాటం చేయాలని అణగారిన వర్గాలకు న్యాయం చేడానికి కులగణ దేశవ్యాప్తంగా చేయాలని డిమాండ్ చేశారు.రాహుల్ గాంధీ బాబాసాహెబ్ ఆశయాలు కొనసాగించడమే దేశంలో పాదయాత్ర చేశారని గుర్తుచేశారు. తెలంగాణలో సుపరిపాలన అంబెద్కర ఆశయాలతో చేస్తున్నామని అన్నారు.

# ఆర్టీసీలో 3,038 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి

### ఎస్సీ వర్గీకరణకు అనుగుణంగా నియామకాలు
### పెండింగ్ సమస్యల పరిష్కారానికి సర్కారు సానుకూలం
### టిజిఎస్ఆర్టీసీ ఎండి విసి సజ్జనార్

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** ఆర్టీసీ కళాభవన్‌లో ఘనంగా అంబేద్కర్ జయంత్యోత్స వాలు రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచన విధానాన్ని స్ఫూర్తిగా తీసుకుని సంస్థలో మూడున్నరేళ్లుగా వినూత్న కార్యక్రమాలను ప్రవేశపెడు తున్నట్లు టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ తెలిపారు. భవిష్యత్ లోనూ ఆయనను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకుసాగాలని ఆయన అన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లి ఆర్టీసి కళాభవన్‌లో టీజీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంత్యోత్స వాలు ఆర్టీసి ఎస్సీ,ఎస్టీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గడ్డం శ్రీనివాస్ నిర్వహణలో జరిగింది. సంస్థ ఎండీ వీసీ సజ్జనర్ ముఖ్య అతిథిగా హాజరై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన నివాళులర్పించి ప్రసంగించారు. కులం, మతం, లింగ బేధం లేకుండా ప్రజలందరికీ సమాన అవకాశాలుండాలని అంబేద్కర్ పోరాడారని కొనియాడారు. బలహీన వర్గాలకు చిరస్థాయిలో నిలిచిపోయే వ్యక్తి అంబేద్కర్ అని, ఆయన ఆశయాలు తరతరాలకు స్ఫూర్తి అని కీర్తించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీలో ఇటీవల 3038 పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చిందని, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్సీ వర్గీకరణను ఈ నియమాయాల్లో సంస్థ అమలు చేస్తుందని తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగుల పెండింగ్ అంశాలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి యాజమాన్యం తీసుకెళ్లిందని, వాటి పరిష్కారానికి ప్రభు త్వం కూడా సాను కూలంగా ఉందని అన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సం క్షేమానికి సంబం ధించి అన్ని అంశాలను రాష్ట్ర ప్రభుత్వ సహకా రంతో యాజ మాన్యం పరిశీలి స్తోందని, కొందరు చేసే దుష్ప్రచారాన్ని నమ్మొద్దని ఉద్యో గులకు సూచిం చారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, ఖుస్రోషా ఖాన్, రాజశేఖర్, వెంకన్న, జాయింట్ డైరెక్టర్ నర్మద, సీపీఎం ఉషాదేవి, రంగారెడ్డి ఆర్ఎం శ్రీలతతో పాటు ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘ నాయకులు రాజయ్య నాయక్, గడ్డం శ్రీనివాస్, సుభాష్, యాదయ్య, కృష్ణ, చంద్రకళ, కౌసల్య, తదితరులు పాల్గొన్నారు.

**బస్ భవన్‌లో అంబేద్కర్ జయంతి వేడుకలు**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా బస్ భవన్ లో సోమ వారం ఆ మహనీయుని చిత్రపటానికి టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ముని శేఖర్, వెంకన్న, జాయింట్ డైరెక్టర్ నర్మద, సీపీఎం ఉషాదేవి, సీటీఎంలు శ్రీదేవి, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న టిజిఎస్ఆర్టీసీ ఎండి విసి సజ్జనార్, చిత్రంలో ఆర్టీసి ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గడ్డం శ్రీనివాస్ తదితరులు

# పార్క్‌హయత్‌లో అగ్ని ప్రమాదం

### హోటల్ మొదటి అంతస్తు స్పా రూమ్‌లో షార్ట్‌సర్క్యూట్
### ఒక్కసారిగా పొగలు వ్యాపించడంతో ఆందోళన
### మంటలను అదుపులోకి తెచ్చిన అగ్నిమాపక సిబ్బంది
### అదే హోటల్‌లో సన్‌రైజర్స్ ఆటగాళ్ల బస .. తప్పిన ప్రమాదం



**హైదరాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతావార్త:** హైదరా బాద్‌లోని పార్క్ హయత్ హోటల్లో సోమవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుకుంది. హోటల్ మొదటి అంతస్తులో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో సిబ్బంది, అతిథులు భయాం దోళనకు గురయ్యారు. అనంతరం మంటలు అదుపులోకి తేవడంతో అంతా ఊపిరి పీల్చుకు న్నారు. అయితే ఇదే హోటల్లో సన్రైజర్స్ హైదరా బాద్ జట్టు బస చేస్తోంది. ఈసందర్భంగా డిస్టిక్ ఫైర్ ఆఫీసర్ వెంకన్న మాట్లాడుతూ కీలక విష యాలు వెల్లడించారు. హోటల్ మొదటి ఫ్లోర్‌లో అగ్ని ప్రమాదం సంభవించిందని, ఆ సమయంలో ఎస్ఆర్‌హెచ్ ప్లేయర్లు 5వ ఫ్లోర్ లో ఉన్నట్లు ఆయన వెల్లడించారు. స్పారూమ్స్‌లో స్టీమ్ బాత్ చేసే ప్రాంతంలో షర్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలిపారు. స్పా రూమ్స్ ఉడ్‌తో తయారు చేసి ఉందని అందుకే మంటలు అంటుకున్నాయని, పొగ దట్టంగా కమ్ము కోవడం వల్ల ప్రమాదం జరిగిన చోటుకు పార్క్ సిబ్బంది వెళ్లలేకపోయారని పేర్కొన్నారు. పార్క్ హయత్ సిబ్బంది జూబ్లీహిల్స్ ఫైర్ స్టేషన్ కు సమాచారం అందించారని, వెంటనే ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేయడంతో పాటు పొగను కూడా అదుపులోకి తీసుకొచ్చినట్లు వెంకన్న వెల్లడించారు. అయితే ప్రమాదం జరిగిన సమ యంలో 5వ అంతస్థులలో సన్‌రైజర్స్ ప్లేయర్లు ఉన్నారని, ప్రమాదం జరిగిన వెంటనే ఎస్ఆర్‌హెచ్ టీమ్ అక్కడి నుంచి వెళ్ళిపోయిందనే దాంట్లో నిజం లేదన్నారు. వాళ్లు ముంబైతో మ్యాచ్ కోసం సోమవారం మధ్నాహ్నం ముంబై బయల్దేరారని పేర్కొన్నారు. ప్రమాదంలో సన్‌రైజర్స్ ఆటగాళ్లకు ఎలాంటి అపాయం కలగలేదని పేర్కొన్నారు.

# గ్రూప్1 పరీక్ష నిర్వహణలో పెద్ద కుంభకోణం

### సిబిఐ విచారణకు ఆదేశించాలి: పాడి కౌశిక్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 14:** గ్రూప్–1 పరీక్షకు సంబంధించి కోఠి కళాశాలలోని 18,19వ సెంటర్లలో 1,490 మంది పరీక్షకు హాజరుకాగా, 74 మంది ఎంపికయ్యారని,అదేవిధంగా 25 సెంటర్లలో 10 వేల మంది పరీక్ష రాస్తే కేవలం 69 మంది మాత్రమే ఎంపికయ్యారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు. 654 మందికి ఒకే విధమైన మార్కులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్–1 పరీక్షలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. పరీక్ష నిర్వహణలో పెద్ద కుంభకోణం జరిగిందని ఆరోపించారు. ప్రిలిమ్స్, మెయిన్స్‌కు వేర్వేరు హాల్ టిక్కెట్లు ఎందుకు జారీ చేశారని ప్రశ్నించారు. ఒక కాంగ్రెస్ నాయకుడి కోడలికి ఎస్టీ విభాగంలో మొదటి ర్యాంకు వచ్చిందని, ఆమె కోఠి కళాశాలలోనే పరీక్ష రాశారని గుర్తు చేశారు. ఉర్దూలో పరీక్ష రాసిన 9 మందిలో ఏడుగురు ఎంపికయ్యారని, టాప్ 100లో ఉర్దూ మీడియం అభ్యర్థులు ముగ్గురు ఉన్నారని వెల్లడించారు. అయితే, 8వేల మంది తెలుగులో పరీక్ష రాస్తే కేవలం 60 మంది మాత్రమే ఎంపికయ్యారని, టాప్ 100లో నలుగురు మాత్రమే ఉన్నారని తెలిపారు. గ్రూప్–1 అంశంపై బీజేపీ నాయకులు ఎందుకు మాట్లాడటం లేదని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేపర్ లీకైతే పరీక్షను రద్దు చేశామని, కాంగ్రెస్ నాయకులు ఎందుకు రద్దు చేయడం లేదని నిలదీశారు.



# జనగామ జిల్లాలో ఘోర ప్రమాదం

### కారును వెనుక నుంచి ఢీకొన్న లారీ
### ముగ్గురు దుర్మరణం.. మరో ముగ్గురికి తీవ్రగాయాలు

**ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :** జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం రాఘవాపూర్ గ్రామ శివారులో జాతీయ రహదారిపై కారు వెనుకనుంచి లారీని ఢీకొన్న ఘోర రోడ్డు ప్రమాద సంఘటనలో ముగ్గురు అక్కడికక్కడే దుర్మరణం చెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం నెలకొంది. కాగా, మృతులు హైదరాబాద్ గాజుల రామారంగా గుర్తించారు. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఇలా ఉన్నాయి... హన్మకొండ వైపునుంచి హైదరాబాద్ వైపుకు వెళ్లుతున్న కారు స్టేషన్‌ఘన్‌పూర్ మండలం రాఘవాపూర్ శివారులో జాతీయ రహదారిపై వేగంగా లారీని వెనుకవైపు ఢీకొన్న సంఘటనలో ఒకే కుటుంబానికి చెందిన దంపతులు శ్రీను(50), రమణకుమారి(40), తోపాటు అనూష(22) ముగ్గురు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరో ఇద్దరు భార్యాభర్తలు అనంతలక్ష్మీ(65), రాజేశ్వర్‌రావు(70), సత్య అరవింద్(25)ల పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్సనిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాగా, మృతులు హైదరాబాద్ గాజుల రామారంలో ఉంటున్నారని గుర్తించగా, వీరందరూ కూడా ఆంధ్రప్రదేశ్‌లోని అమలాపురానికి చెందిన వారని, వీరు కాళేశ్వరంలో దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణంలో హైదరాబాద్ గాజుల రామారంకు వెళ్లుతుండగా సంఘటన నెలకొన్నట్లు తెలిపారు. సంఘటనలో కారుముందుభాగం పూర్తిగా దెబ్బతింది. సంఘటన స్థలానికి డీసీపీ రాజమహేంద్రనాయక్‌తోపాటు ఇతర పోలీసు అధికారులు చేరుకుని క్షతగాత్రులు ముగ్గురిని చికిత్సనిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను ఆస్పత్రికి తరలించి ట్రాఫిక్ ఇబ్బందులు నెలకొనకుండా ప్రమాదానికి గురైన కారును సంఘటన స్థలం నుంచి తొలగించి ట్రాఫిక్ పునరుద్దరించారు. సంఘటనపై పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# మహబూబ్‌నగర్‌లో ఈతకు వెళ్లి ఐదుగురు జలసమాధి

### దివిటిపల్లి వద్ద క్వారీలో ముగ్గురు..
### మోతిఘనపూర్ చెరువులో ఇద్దరు

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 14,ప్రభాతవార్త:** ఈతకు వెళ్లి ఐదుగురు జలసమాధి అయిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లాలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి ముగ్గురు మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని దివిటిపల్లి సమీపంలోని మెడికల్ కాలేజ్ క్వారీలో కొందరు యువకులు ఈతకు వెళ్లారు. దాదాపు రెండు దశాబ్దాల కింద మట్టి తీయడంతో పెద్ద పెద్ద గుంతలుగా మారాయి. దీంతో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వదిలేయడంతో గుంతల్లో నీళ్లు నిలువడంతో వేసవిలో యువకులు స్విమ్మింగ్ చేసుంటారు. ఈక్రమంలో సోమవారం దివిటిపల్లి డబుల్ బెడ్ రూమ్ కాలనీవాసులు ఈతకు వెళ్లి ముగ్గురు యువకులు క్వారిలో పడి మృతి చెందారు. గమనించిన వారు చుట్టుపక్కల వారు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకొని బోరున విలపించారు. రోదనలు మిన్నంటాయి. మృతి చెందిన వారిలో ఎండి మహమూద్ (30), విజయ్(32), అయ్యప్ప (16)గా పోలీసులు నిర్ధారించారు. ఈతకు వెళ్లి మృతిచెందిన ముగ్గురు కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని సిపిఎం జిల్లా కమిటీ కడియాల మోహన్ డిమాండ్ చేశారు. ప్రమా దానికి కారణమైన క్వారీ తవ్విన కాంట్రాక్టర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకొని భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా బాలానగర్ మండలం మోతిఘనపూర్ పెద్ద చెరువులో గంగాధర్ పల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఈతకు వెళ్లి చెరువులో పడి గల్లంతైనట్లు స్థానికులు తెలిపారు. గంగాధర్ పల్లికి చెందిన శివకుమార్ (46) ఈతకు వెళ్లి చెరువులోని పొదలలో చిక్కుకున్నాడు. అతనిని కాపాడే ప్రయత్నంలో యాదగిరి (22) కూడా చిక్కుకొని మృతి చెందాడు.



అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఆవిష్కరిస్తున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

# భారతీయులందరి అభిమాని అంబేద్కర్

### హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ
### వి.బి.ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణ
### హాజరైన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపి కె.లక్ష్మణ్

**హైదరాబాద్ (ముషీరాబాద్), ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** భారతీయులందరి అభిమాని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ కొనియాడారు. సోమవారం ముషీరాబాద్ నియోజకవర్గం, కవాడిగూడ డివిజన్‌లోని రోటరీ కాలనీలో బస్తీవాసుల విజ్ఞప్తి మేరకు వి.బి.ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి ఆధ్వర్యంలో అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాలను ఏర్పాటుచేసి, ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణ సభకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే.లక్ష్మణ్‌లతో కలసి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో దత్తాత్రేయ మాట్లాడుతూ ఎంతో పేదకుటుంబంలో పుట్టిన అంబేద్కర్ దేశంలోనే అత్యున్నత చదువు చదివి, చదువకు పేదరికం అడ్డు కాదని ఋజువుచేశారని కొనియాడారు. భారత దేశానికి రాజ్యాంగ నిర్మాణం చేసిన మహనీయుడు డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ అని గుర్తు చేశారు. అంబేద్కర్ చిన్ననాటి నుండి కుల వివక్షకు గురయినప్పటికీ, కష్టపడి, చదువుకుని ఉన్నత స్థాయికి వచ్చారని అన్నారు. ప్రభుత్వాలు ఎన్ని పథకాలు తెచ్చినా చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కవాడిగూడ కార్పోరేటర్ రచనశ్రీ, రాంనగర్ కార్పోరేటర్ రవిచారి, గాంధీనగర్ కార్పోరేటర్ పావని వినయ్‌కుమార్, బీజేపీ నాయకులు పూసరాజు, రమేష్‌రాం, టి.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# అడవులపై బుల్డోజర్లు నడపడంలో కాంగ్రెస్ సర్కార్ బిజీ

### మేం పర్యావరణాన్ని కాపాడుతున్నాం : ప్రధాని మోడీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 14:** తెలంగాణలో ప్రకృతి విధ్వంసం కొనసాగుతున్నదని, మూగ జీవాలను చంపేస్తున్నారని ప్రధాని మోడీ ఆవేదన వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా శేర్లింగంపల్లిలోని 400 ఎకరాల కంచ గచ్చిబౌలి భూములను జెసిపిలతో ధ్వంసం చేయడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. తెలంగాణలో ప్రకృతిని ధ్వంసం చేసి వన్యప్రాణులను చంపుతున్నారని ఆరోపించారు. ప్రకృతిని ధ్వంసం చేయడం, వన్యప్రాణులను చంపడంలో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం బిజీగా ఉంది. అడవులపై బుల్డోజర్లు నడిపించడంలో తెలంగాణ కాంగ్రెస్ సర్కార్ బిజీగా ఉంది. మేం పర్యావరణాన్ని కాపాడుతుంటే వాళ్లు అటవీ సంపదను నాశనం చేస్తున్నారు అని ఘాటు కామెంట్స్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి అధికారంలోకి రావడమే ముఖ్యమని అన్నారు. కానీ తాము మాత్రం కొత్తగా అడవులను సిద్దం చేసేందుకు కష్టపడుతున్నామని వివరించారు.

# మీ ప్రతి కలను సాకారం చేస్తున్నాం!

### నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ సింధూర నారాయణ





**హైదరాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ఇంటర్ ఫలితాల్లో నారాయణ విద్యార్థుల ప్రతిభకు అడ్డే లేకుండా పోయింది. సైన్స్ గ్రూపుల్లో 4 విభాగాలకుగాను 3 విభాగాల్లో స్టేట్ ఫస్ట్ మార్కులతో అదరగొట్టారు. ఈ సందర్భంగా విజయవాడ, బెంజ్ సర్కిల్‌లోని నారాయణ క్యాంపస్‌లో విజయోత్సవ సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ పి సింధూర నారాయణ, రమా నారాయణ, అకడమిక్ డైరెక్టర్ పి ప్రమీల హాజరయ్యారు. ఈ సందర్భంగా డైరెక్టర్ డాక్టర్ పి సింధూర నారాయణ మాట్లాడుతూ .. నారాయణపై నమ్మకం ఉంచి వారి పిల్లలను చేర్చిన తల్లిదండ్రులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు తమ కలల సాకారానికి ఏ విధంగా అయితే కష్టపడతారో, అదే విధంగా నారాయణ విద్యాసంస్థలు కూడా విద్యార్థుల కలలను నెరవేర్చడానికి నిరంతరం శ్రమిస్తోందన్నారు. విద్యార్థుల కలలే, తమ కలలుగా నారాయణ భావిస్తోందన్నారు. ఎక్కడా రాజీ పడకుండా పోటీ ప్రపంచంలో రాణించడానికి కావలసిన అన్ని వనరులను నారాయణ సమకూర్చుతోందన్నారు. అందుకు నిదర్శనంగానే జూనియర్ ఎంపిసిలో స్టేట్ ఫస్ట్ 468/ 470 మార్కు సాధించటం జరిగిందన్నారు. అలాగే సీనియర్ ఎంపిసిలో 992/1000 స్టేట్ ఫస్ట్ మార్కులను ముగ్గురు కైవసం చేసుకున్నారన్నారు. సీనియర్ బైపిసి విభాగంలోనూ 992/1000 మార్కులతో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ మార్కులతో ప్రభంజనం సృష్టించిందన్నారు. అలాగే జూనియర్ బైపిసి విభాగంలోనూ ఏకంగా నలుగురు విద్యార్థులు 436/440 మార్కులు సాధించి విజయ ప్రస్థానాన్ని అప్రతిహతంగా కొనసాగించారని తెలిపారు. విజయోత్సవ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన రమా నారాయణ మాట్లాడుతూ ఇంటర్ ఫలితాల్లో విజయకేతనం ఎగుర వేసిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఎంపిసి, బైపిసి విభాగాల్లో అత్యుత్తమ మార్కులు సాధించినందుకు హర్షం వ్యక్తం చేశారు. నారాయణ ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌తోపాటు పటిష్టమైన మైక్రోషెడ్యూల్ కారణంగానే ఇంతటి అద్భుత ఫలితాలను సాధించగలుగుతున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని నారాయణ బ్రాంచీల్లో అత్యుత్తమ మార్కులతో పాటుగా అత్యధిక పాస్ పర్సంటేజ్ సాధించటం జరిగిందన్నారు. నేటి ఈ అత్యద్భుత మార్కులే రేపటి జెఈఈ మెయిన్/అడ్వాన్స్‌డ్, నీట్ ఫలితాలకు అరంభమని, ఆ ప్రవేశ పరీక్షలన్నింటిలోనూ తమ విద్యార్థులే అత్యద్భుత ర్యాంకులు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.



# యాదాద్రి దేవస్థానానికి 2 బ్యాటరీ వాహనాలను అందచేసిన ఎస్‌బిఐ

**హైదరాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త :** యాదాద్రి దేవస్థానానికి రెండు విద్యుత్ వాహనాలను ఎస్‌బి చైర్మన్ చల్లా శ్రీనివాసుల శెట్టి సోమవారం కార్పోరేట్ రెస్పాన్సిబుల్టీలో భాగంగా అందచేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. సమాజానికి ఉపయోగపడే ఎన్నో కార్యక్రమాల్లో ఎస్‌బిఐ తన వంతు పాత్ర పోషిస్తుందన్నారు.ఎంతో ఆద్యాత్మికత ఉట్టి పడుతున్న ఈ దేవాలయానికి భక్తుల సౌకర్యం కోసం ఇటువంటి వాహానాలను ఎస్‌బిఐ ద్వారా అందించడం పట్ల తనకు ఎంతో గర్వంగా ఉందన్నారు. అనంతరం అలయ ఈవో భాస్కర్‌రావు మాట్లాడుతూ భక్తుల సౌకర్యాన్ని ముఖ్యంగా వృద్దులు,మహిళలు,చిన్నారులు దృష్టిలో ఉంచుకుని ఆలయానికి విద్యుత్ వాహానాలను అందచేయడం పట్ల ఎస్‌బిఐ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నా అన్నారు.ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సర్కిల్ సిజిఎం రాజేష్‌కుమార్ ఇతర ఆలయ ఉన్నాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బయ్యక్కపేట అడవిలో పెద్దపులి అడుగులు

### మూడు రేంజిల అధికారుల బృందం గాలింపు
### అటవీ శాఖ అధికారులకు కంటిమీద కునుకు కరవు



**తాడ్వాయి, ప్రభాతవార్త :**పెద్దపులి అందరిని హడలెత్తి స్తుంది. ములుగు జిల్లాలోని తాడ్వాయి మండలం బయ్య క్కపేటలో సంచరిస్తుందని తెలియడంతో చుట్టుపక్కల సమీప గ్రామాల ప్రజలు భయందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు గుంపులు, గుంపులుగ కనిపించడం చూసినవాళ్లంతా భయంతో జంకుతున్నారు. అటవీశాఖ అధికారులు తెలిపారు. ఉన్నట్టుండి అకస్మాత్తుగ బయ్యక్కపేట అడవుల్లోకి రావడం ఆవుల గుంపుపై పంజావిసిరింది. తాజాగా ఇదే అడవిలో పాగావేసినట్టు వాట్టివాగులో సంచసిస్తుందని ఫారిస్టు అధికారులు తెలిపారు. వాగులో తిరగడాన్ని అడుగులను గుర్తించినట్లు తెలిపారు, మొదటిరోజు జరిగిన సంఘటన నుంచే గొత్తెకోయగిరిజనులు ఇంకాతేరుకోలేదని ఆ గూడెం గిరిజనులు భయందోళనలో ఉన్నట్లు తెలిపారు.

ఇదిలా ఉండగా ఉన్నతాదికారుల ఆదేశాలమేరకు పెద్ద ఎత్తున కదిలివెల్లారు. తాడ్వాయి వైల్డులేఫ్ ,మేడారం రేంజి, పస్రారేంజి అధికారులు, డివిజన్ అదికారులు బయ్యక్కపేట సమీపంలోని ముసలమ్మపెంటలో గాలింపు చేసి అడుగులను గుర్తించి నిర్దారణకొచ్చారు.

పెద్దపులి సంచారంపై నిఘపెట్టారు. తాజాగ బయ్యక్కపేటలోని వట్టివాగులో తిరుగుతున్నట్లు అదికారులు ఆ వాగులో అడుగులను గుర్తించారు రోజుకో ఏరియా అడవిలో తిరుగుతూ ఫారెస్టు అదికారులకు కంటిమీదకునుకు లేకుండా చేస్తుంది. వణుకుపుట్టిస్తుంది.

**ఆవు మృతి.. యజమానికి పరిహారం ఇస్తాం..**

పెద్దపులిదాడిలో ఆవుమృతిచెందిన యజమానికి అటవీశాఖ పరిహారం చెల్లిస్తుందని మేడారం వైల్డులేఫ్ రేంజర్ ఎల్లయ్య తెలిపారు. సోమవారం పెద్దపులి దాడివిషయం పై ప్రభాతవార్త,వివరణ కోరింది. నిజమే ఆవుమృతికి నష్టపరిహారం చెల్లించాలని తెలిపారు, పై అధికారుల ఆదేశం మేరకు డబ్బులు ఇస్తామని అన్నారు. పెద్దపులి దాడిలో గాయపడినా, మృతిచెందిన బాదితులకు నష్టం ఇవ్వడం జరుగుతుందన్నారు. గొత్తెకోయ గూడెం వాల్లకు ఈ విషయం తెలిపినట్టు చెప్పారు. మళ్లిపెద్దపులి కనిపిస్తె సమాచారం చెప్పాలని ముసలమ్మ పెంట గొత్తె గూడెంను అధికారులు సందర్సించి చెప్పామన్నారు.

**వట్టివాగులో పెద్దపులి..**

బయ్యక్కపెటలొని వట్టివాగులో ఉన్నట్లు అడుగులను గుర్తించినట్లు మేడారం రేంజర్ ఎల్లయ్య ప్రభాతవార్తకు తెలిపారు. పెద్దపులికి ఆహారం,నీల్లులేక అలమటిస్తుంది. ఇవి లభించే అడవికి పోతుంది. అది ఇక్కడ కావచ్చు వేరెజిల్లా కావచ్చును అన్నారు .బయ్యక్కపేట అడవిలో సంచరిస్తున్న క్రమంలో మేము అప్రమత్తంగా ఉండిజాగ్రత్తలు తీసుకున్నట్లు ఎఫ్ ఆర్ ఓ తెలిపారు. వట్టివాగును ఆదివారం సందర్సించి మూడుటీమ్ ల బృందం వెతికినట్లు తెలిపారు.

వాగులో పెద్దపులి తిష్టవేసినట్లు అడుగులు చూశామని అన్నారు. ఎటువైపున పోతుందో గమనించి చర్యలు చేపట్టడం, ఆ ఏరియా గ్రామాల ప్రజలను ఆవులను దాడికిపాల్పడకుండా అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు. మేడారం పరిసరగ్రామాలు ప్రజలను అలర్ట్ చేసినట్లు తెలిపారు. పెద్దపులి సంచారంతొ ఫారెస్టు అధికారులకు కంటిమీకునుకు లేకుండా అవుతుందని అటవీశాఖ అధికారులు అంటున్నారు. బయ్యక్కపేటలో ఆవుల గుంపుపై దాడిచేసింది. ఈ విషయం తెలియగానే మూడు రేంజిల అధికారులు వెళ్లి రోజంతా అడవి పట్టుకుని తిరిగి అవస్థ పడినట్టు తెలిపారు. పస్రా, మేడారం, తాడ్వాయి రేంజిల అదికారులు, సిబ్బంది అడవుల్లొ గాలింపు చేపట్టినట్లు తెలిపారు.



## అణగారిన వర్గాల ఆరాధ్య దైవం అంబేద్కర్

### స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

### రాజేంద్రనగర్‌లో నివాళులర్పించిన ప్రముఖులు

**హైదరాబాద్ (అత్తాపూర్), ఏప్రిల్ 14, ప్రభాతవార్త :** భారతదేశ రాజ్యాంగ నిర్మాత, సామాజిక, రాజకీయ, ఆర్థిక విధానాల నిర్దేశ,ప్రజాస్వామ్య పరిరక్షకుడు, ప్రపంచ మేధావి, అణగారిన వర్గాల ఆరాధ్య దైవం భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు.సోమవారం జై భీమ్,జైరామ్ జయంతి ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్,ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి,ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్,మాజీ ఎమ్మెల్సీ స్వామి గౌడ్ ,కార్పోరేటర్లు అర్చన జయప్రకాష్,శ్రీనివాస్ రెడ్డి,బీఆర్ఎస్ నేత కార్తిక్ రెడ్డిలు హాజరై ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.....అట్టడుగు స్థాయి నుండి గొప్ప నేతగా ఎదిగిన డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అందరికీ ఆదర్శమన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజల హక్కుల కోసం పోరాడి ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఎర్రబెల్లి సూర్యం,ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్,కోశాధికారి మంగళగిరి శ్రీనివాస్, వ్యవస్థాపక అధ్యక్షులు పోలిస జీవన్‌దాస్ తదితరులు విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.




## కొత్త రాష్ట్రాల ఏర్పాటుకు అంబేద్కర్ ఆలోచనలే కారణం: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 14:** కొత్త రాష్ట్రాల ఏర్పాటుకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచనలే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆధునిక భారతావనికి పునాదులు వేశారని తెలిపారు. బాబాసాహెబ్ ఆలోచన, ముందు చూపు చాలా గొప్పదని వెల్లడించారు. దేశంలో అందరూ బాగుండాలన్నదే అంబేద్కర్ ఆలోచన అని చెప్పారు. అంబేద్కర్ ఆలోచనను కేసీఆర్ ఆచరణలో పెట్టారన్నారు. దళితబంధు లాంటి పథకాన్ని అమలు చేసిన దమ్మున్న నాయకుడు కేసీఆర్ అన్నారు. అబద్ధపు ప్రచారంతో ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తున్నదని, దళితులకు అంబేద్కర్ అభయహస్తం ఇంకెప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. రూ.12 లక్షల కాదు కదా.. 12 రూపాయలు కూడా ఇవ్వరని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేటీఆర్.. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. కొత్త రాష్ట్రాల ఏర్పాటుకు అంబేద్కర్ ఆలోచనలే కారణమన్నారు. ప్రజాస్వామ్యంలో మందబలంతో అవతలివారి గొంతు నొక్కేయడం ఉండకూడదని అందరితో కొట్లాడి కొత్త రాష్ట్రాల ఏర్పాటుకు ఉన్న రాష్ట్రం అనుమతి ఉండాల్సిన అవసరం లేదని పేర్కొంటూ రాజ్యాంగంలో ఆర్టికల్ 3ని పొందుపర్చారన్నారు. మనం ఇప్పుడు తెలంగాణలో మాట్లాడుతున్నామంటే దానికి కారకుడు ఒకేఒక్కరు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అని చెప్పారు. బాబాసాహెబ్ ఆలోచన, ముందు చూపు చాలా గొప్పదన్నారు.




## సైబర్‌రన్ పేరిట హాఫ్ మారథాన్‌ను నిర్వహించిన పిఎన్‌బి

### ప్రారంభించిన డిఎఫ్ఎస్ కార్యదర్శి నాగరాజు

**హైదరాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** దేశంలోని ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) సోమవారం న్యూఢిల్లీలో సైబర్ రన్ పేరుతో హాఫ్ మారథాన్-2025ను నిర్వహించింది. ఈ మారథాన్‌ను డిఎఫ్ఎస్ కార్యదర్శి ఎం నాగరాజు జెండా ఊపి ప్రారంభించారు. సైబర్ రన్ సెక్యూర్ డిజిటల్ ఇండియాను సాధికారపరచడం అనే థీమ్‌తో జరిగిన మారథాన్‌లో అథ్లెట్లు, ఫిట్‌నెస్ ఔత్సాహికులు, సైబర్ భద్రతా నిపుణులు, పిఎన్‌బి ఉద్యోగులు పాల్గొన్నారు. పిఎన్‌బి ఎండీ అండ్ సీఈవో అశోక్ చంద్ర, పిఎన్‌బి మెట్‌లైఫ్ ఇన్సూరెన్స్ ఎండి అండ్ సీఈవో సమీర్ బన్సాల్, పిఎన్‌బి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ ఎండీ అండ్ సీఈవో గిరీష్ కౌస్గి పాల్గొన్నారు. సైబర్ నేరాల గురించి అవగాహన పెంచడంలో పిఎన్‌బి చేస్తున్న చురుకైన ప్రయత్నాలను డిఎఫ్ఎస్ కార్యదర్శి ప్రశంసించారు. పిఎన్‌బి ఎండీ అండ్ సీఈవో అశోక్ చంద్ర మాట్లాడుతూ పిఎన్‌బి దేశానికి 131 సంవత్సరాల నుంచి అచంచల సేవను అందిస్తుందన్నారు. డిజిటల్ భద్రత పట్ల తాము నిబద్ధతతో వ్యవహరిస్తున్నట్టు తెలిపారు. సురక్షితమైన డిజిటల్ పర్యావరణ వ్యవస్థ భారతదేశ వృద్ధికి వెన్నెముకగా నిలుస్తుందని తెలిపారు. 21.1కె హాఫ్ మారథాన్‌లో 2600 మంది రన్నర్లు, 10కె ఎనర్జిటిక్‌లో 5850 మంది రన్నర్లు, 5కె ఫన్‌ఫిల్డ్ లో 5350 రన్నర్లు కలిపి మూడు విభాగాలలో 13,800 మందికి పైగా రన్నర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. సైబర్ భద్రతా అవగాహన, డిజిటల్‌గా కలుపుకొని సురక్షితమైన భారత్‌ను నిర్మించడం వైపు ఐక్యంగా అడుగులు వేయడం దీని లక్ష్యమన్నారు. 21.1కె రేసులో మహిళల విభాగంలో ఉజాలా విజేతగా నిలిచి రూ. రూ 2 లక్షల బహుమతిని గెలుచుకుంది. తర్వాత స్థానంలో రేణు సింగ్ రూ. 1.50 లక్షలతో మొదటి రన్నరప్‌గా సోనికా రూ. 1 లక్షతో రెండవ రన్నరప్‌గా గెలిచింది. పురుషుల విభాగంలో హేమంత్ సింగ్ విజేత టైటిల్‌తో పాటు రూ. 2 లక్షల బహుమతిని గెలుచుకున్నాడు. తర్వాతి స్థానాల్లో హారీష్ షెరోన్ రూ. 1.50 లక్షలను మొదటి రన్నరప్ స్థానాన్ని పొందాడు. బనీ సింగ్ రూ. 1 లక్షతో రెండవ రన్నరప్‌గా నిలిచాడు. ఎనర్జిటిక్ 10కె రన్‌లో మహిళల విభాగంలో నీతా రాణ రూ 2 లక్షలు గెలుచుకుంది. తరువాత తాంసి సింగ్ రూ. 1.50 లక్షలతో మొదటి రన్నరప్‌గా నిలిచింది. అనీతా సింగ్ రెండవ రన్నరప్‌గా నిలిచింది. పురుషుల విభాగంలో గౌరవ్ విజేతగా నిలిచి రూ. 2 లక్షలు గెలుచుకున్నాడు.

# గిగ్, ప్లాట్‌ఫాం వర్కర్లకు భద్రత బిల్లు ముసాయిదాను సిద్ధం చేయాలి

### ఫుడ్ డెలివరీ, క్యాబ్స్ డ్రైవర్లు, ప్యాకేజ్ డెలివరీల్లో 4 లక్షల మంది గిగ్ వర్కర్లు

### యూనియన్ల ప్రతినిధులు, ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ ప్రత్యేక సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 14:** గిగ్, ప్లాట్‌ఫాం వర్కర్లకు భద్రత కల్పించే బిల్లు ముసాయిదాను వెంటనే ప్రజాభిప్రాయానికి అందుబాటులో ఉంచాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే సలహాలు,సూచనలు, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని తుది ముసాయిదాను రూపొందించాలని సూచించారు. సోమవారం సచివాలయంలో గిగ్ వర్కర్లు, యూనియన్ల ప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రామకృష్ణారావు, జయేష్‌రంజన్,సంజయ్ కుమార్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. గిగ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత, బీమా సదుపాయం, ఇతర హక్కులను కల్పించేలా కార్మిక శాఖ తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ బిల్లు ముసాయిదాను తయారు చేసింది. అందులో పొందుపరిచిన అంశాలను అధికారులు ఈ సమావేశంలో ముఖ్యమంత్రికి వివరించారు. తయారు చేసిన ముసాయిదాకు పలు మార్పులు చేర్పులను సిఎం సూచించారు.కార్మికుల భద్రతకు ప్రాధాన్యమివ్వటంతో పాటు కంపెనీలు, అగ్రిగేటర్లకు మధ్య సమన్వయం, సుహృద్భావం ఉండేలా కొత్త చట్టం ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు.

ఈ బిల్లు ముసాయిదాను వెంటనే ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచి, ప్రజాబి ప్రాయాన్ని సేకరించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫుడ్ డెలివరీ,క్యాబ్స్ డ్రైవర్లు, ప్యాకేజ్ డెలివరీల్లో దాదాపు 4లక్షల మంది గిగ్ వర్కర్లు పని చేస్తున్నారని, అన్ని వర్గాల నుంచి సలహాలు, సూచనలు, అభ్యంతరాలను స్వీకరించాలని సూచించారు. వీటితో పాటు అధికారులు ఈ ముసాయిదాలో పొందు పరిచిన అంశాలపై తుది కసరత్తు చేయాలని, అన్నింటినీ పరిగణనలోకి తీసుకొని ఈనెల 25వ తేదీ నాటికి బిల్లు తుది ముసాయిదాను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నిర్ణీత గడువులోగా ఈ ప్రక్రియ పూర్తి చేసే అంతర్జాతీయ కార్మిక దినోత్సవమైన మే డే రోజున ఈ బిల్లును అమల్లోకి తెచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు.



# భూభారతి చట్టం ద్వారా అసైన్డ్ కమిటీలను పునరుద్ధరిస్తాం

### డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 14:** సామాన్యుడికి సైతం అర్థమయ్యే విధంగా ఎలాంటి మతలబు, ఇబ్బంది లేకుండా తయారు చేసినది భూ భారత్ 2025 చట్టం అని ప్రకటించడానికి నాకు చాలా గర్వంగా, సంతోషంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. భూ భారతి చట్టం ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మట్లాడారు. గత పాలకులు 10 సంవత్సరాలు అసైన్డ్ కమిటీల సమావేశం పెట్టలేదు. ఒక గజాన్ని కూడా పంచలేదన్నారు.భూ భారతి చట్టం ద్వారా అసైన్డ్ కమిటీలను పునరుద్ధరణ చేసి అసైన్ భూముల్లో సాగు చేసుకుంటున్న అర్హత కలిగిన పేదవారికి ప్రజా ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేస్తుందన్నారు. భూమికి మనిషికి విడదీయరాని సంబంధం ఉంది.అనేక పోరాటాల ద్వారా భూమిపై సాధించుకున్న హక్కులను, ఆ హక్కులు కాలరాయకుండ ప్రజలకు అందించాల్సిన బాధ్యత పాలకులపైన ఉందన్నారు. దురదృష్టం ఏమిటంటే...ఆత్మగౌరవం కోసం పోరాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో భూమితో పెన వేసుకున్నటువంటి ప్రజల జీవితాలను అల్లకల్లోలం చేస్తూ గత పాలకులు తీసుకువచ్చినదే ధరణి చట్టమని దుయ్యబట్టారు. గత పది సంవత్సరాలు శాసనసభలో ఎమ్మెల్యేగా ఉన్న నేను ధరణిపై చర్చ వచ్చిన ప్రతి సందర్భంగా చెప్పాను. ధరణి అనేది రైతుల పాలిట శాపంగా మారింది కొంత మంది పెత్తందారుల కాళ్ల వద్ద రైతుల హక్కులను తాకట్టు పెట్టే విధంగా ఉందని ఎంత మొత్తుకున్నా



గత ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదని పేర్కొన్నారు.గత కాంగ్రెస్ ప్రభుత్వాలు పేదలకు పంపిణీ చేసిన 24 లక్షల ఎకరాలకు సంబంధించిన హక్కులను గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి కాలరాసిందని తప్పుపట్టారు.2023 మార్చి 16న ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు నేను చేసిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో అనేక మంది రైతులు నా వద్దకు వచ్చి టిఆర్ఎస్ ప్రభుత్వం ధరణి తీసుకొచ్చి మా భూములపై మాకు హక్కులను లేకుండా చేసిందని,మా వద్ద పాత పాస్ పుస్తకాలు ఉన్న కొత్తవి ఇవ్వడం లేదని చూపిస్తూ ఆవేదన వ్యక్తం చేశారని గుర్తు చేశారు.
ఆరోజు సీఎల్పీ లీడర్‌గా చాలా స్పష్టంగా చెప్పాను. ఆ రైతు ఎమ్మార్వో పై పెట్రోల్ పోయలేదు.ఆనాటి ప్రభుత్వం మీద దాడి చేశాడని చెప్పినప్పటికీ ఆనాడు ఉన్న దుర్మార్గమైన పాలకులు పట్టించుకోలే దన్నారు. ఇవన్నీ అనుభవాలను దృష్టిలో పెట్టుకొని రైతులకు హక్కులను కల్పిస్తూ మేలు చేయాలని తీసుకొచ్చిందే భూ భారతి చట్టం. కలెక్టర్ల నుంచి కింది స్థాయి రెవెన్యూ అధికారుల వరకు ప్రజలకు ఈ చట్టం పట్ల విస్తృత అవగాహన కల్పించడానికి రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని చెప్పారు.ప్రజా ప్రభుత్వం తీసుకు వచ్చిన ఈ చట్టం మా కోసమే అన్న నమ్మకాన్ని ప్రజల్లో అధికారులు కల్పించాలని చెప్పారు.

**రాజ్యాంగమే సకల సమస్యలకు పరిష్కారం**

రాజ్యాంగమే సకల సమస్యలకు పరిష్కారం అంబేద్కర్ అందించిన సంవిధాన్ బచావో కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం ముందుకు తీసుకువెళుతుందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సోమవారం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా హైదరాబాద్ ట్యాంక్ బండ్ పై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు.

భారత రాజ్యాంగాన్ని మార్చాలని, రాజ్యాంగమే లేకుండా చేయాలని భారతీయ జనతా పార్టీ, బిఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రయత్నాలను తిప్పి కొట్టి, దేశంలో ఉన్న ప్రజాస్వామిక వాదులు, ఓటు హక్కుతో పాటు ఇతర హక్కులు పొందుతున్న ప్రతి పౌరుడు భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ దేశానికి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అందించిన భారత రాజ్యాంగమే సకల సమస్యలకు పరిష్కారం చూపిస్తున్నదని స్పష్టంగా అర్థం అవుతుందన్నారు.

# యాదాద్రి థర్మల్ కేంద్రానికి భారీ బదలీలు

**హైదరాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి పలువురిని బదిలీ చేస్తూ తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్‌కో నిర్ణయించింది. ఈ మేరకు ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీపకుమార్ సుల్తానియా ఉత్తర్వులు ఇచ్చారు. బదిలీ అయినా వారిలో ఇద్దరు సూపరింటెండింగ్ ఇంజనీర్లు (ఎస్‌ఈ), ఒక డీఈ, 29 మంది ఏడీఈలు, 60 మంది ప్లాంట్ అటెండెంట్లు, 30 మంది జూనియర్ ప్లాంట్ అటెండెంట్లకు యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో పోస్టింగ్ ఇచ్చారు. అంతే కాకుండా వీరితో పాటు, గత ఏడాది జూన్ 4న మూసివేసిన రామగుండం థర్మల్‌బీ విద్యుత్ కేంద్రంలో పనిచేస్తున్న 28 మంది ఫోర్‌మన్లు, 30 మంది ప్లాంట్ అటెండెంట్లు, 14 మంది జూనియర్ ప్లాంట్ అటెండెంట్లకు కూడా పోస్టింగ్ ఇచ్చారు. ఈ విధంగా బదిలీ చేసిన వారిలో రామగుండం థర్మల్ బీ విద్యుత్ కేంద్రంలో పనిచేస్తున్న ఒక ఎస్ఈ, డీఈ, 11 మంది ఏడీఈలు కూడా ఉన్నారు.

# 25, 26 తేదీల్లో రాష్ట్రానికి రాహుల్, ఖర్గే రాక

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 14:** హైదరాబాద్ వేదికగా ఏప్రిల్ 25, 26న భారత్ సమ్మిట్ -2025వివిధ దేశాల నుండి 500 మంది డెలిగెట్స్ హాజరవుతారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. 2 రోజుల పాటు జరిగే ఈ సమ్మిట్‌కు మల్లికార్జున ఖర్గే,రాహుల్ గాంధీ హాజరవుతారని పేర్కొన్నారు.భారత్ సమ్మిట్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ పరిణామాలపై అధ్యయనం చేసేందుకు ఈ సమ్మిట్ ఉపయోగ పడుతుందన్నారు.

# కంచ గచ్చిబౌలి భూములు ప్రభుత్వ భూములే

### సుప్రీంకోర్టులో తెలంగాణ సర్కార్ అఫిడవిట్ దాఖలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 14:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సియూ)లోని కంచ గచ్చిబౌలి భూములపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సోమవారం అఫిడవిట్ దాఖలు చేసింది.ఈ భూములపై ఏప్రిల్ 16వ తేదీన సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది. కంచ గచ్చిబౌలి భూములు ప్రభుత్వ భూములేనని ఆ అఫిడవిట్‌లో ప్రభుత్వం క్లియర్ కట్‌గా స్పష్టం చేసింది. ఈ భూముల్లోనే సెంట్రల్ యూనివర్శిటీ, మరికొన్ని ఇనిస్టిట్యూట్‌లు, బస్‌స్టాండులు, తదితర సౌకర్యాలు ఎన్నో వచ్చాయని సుప్రీంకోర్టుకు ప్రభుత్వం సోదాహరణగా వెల్లడించింది. సుమారు 20 ఏళ్లకు పైగా 400 ఎకరాల స్థలం న్యాయ వివాదంలో ఉన్నందున అక్కడ చెట్లు మొలిచి, అటవీ ప్రాంతంగా మారిందని సదరు అఫిడవిట్‌లో ప్రభుత్వం స్పష్టం చేసింది.అయితే కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం వివాదాస్పదం కావడంతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి రెండు రోజుల క్రితం వరకు ఢిల్లీలోనే ఉండి సీనియర్ న్యాయవాదలతో చర్చించి ఈ అఫిడవిట్‌ను సిద్ధం చేశారు. సోమవారం దీనిని సుప్రీంకోర్టులో దాఖలు చేశారు. మరోవైపు ఉచిత పథకాల కారణంగా ప్రభుత్వ ఖజానాలో నిధులు నిండుకొన్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని కంచ గచ్చిబౌలిలోని దాదాపు 400 ఎకరాలు వేలం పాట నిర్వహించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. ఆ స్థలంలో జెసిబిల సాయంతో చెట్లను సైతం నరికి వేయించింది. ఈ విషయం సుప్రీంకోర్టు దృష్టికి చేరడంతో న్యాయస్థానం సుమోటోగా స్పందించి ఓ సాధికారిక కమిటీని నియమించి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఇదే సమయంలో హైదరాబాద్ సెంట్రల్ యూని సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులతో పాటు ప్రతిపక్షాలు ఆశ్రయించాయి. సుప్రీంకోర్టు స్పందించి కంచ గచ్చిబౌలిలో చెట్లు నరకవద్దంటూ ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే ఈ వ్యవహారంలో అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.
ఇంకోవైపు ఈ భూములపై రేవంత్ రెడ్డి సర్కార్ ఓ లేఖ విడుదల చేసింది. 2003లో ఈ భూములను నాటి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లోని ప్రభుత్వం ఐఎంజి సంస్థకు విక్రయించిందని తెలిపింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఈ ఒప్పందాన్ని రద్దు చేసిందని స్పష్టం చేసింది. అంతేకాకుండా ఈ భూములు ప్రభుత్వానికి కేటాయించడంతో అందుకు ప్రతిగా ప్రభుత్వం మరో చోట వందలాది ఎకరాలను సెంట్రల్ యూనివర్సిటీకి కేటాయించిందని ఆ లేఖలో ప్రభుత్వం సోదాహరణగా వివరించిన సంగతి విదితమే.

# కాంగ్రెస్ ఎమర్జెన్సీ పేరుతో రాజ్యాంగాన్ని హత్య చేసింది : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త :** కాంగ్రెస్ రాజ్యాంగం పేరుతో రాజ్యాంగాన్ని హత్య చేసిందని కేంద్ర బొగ్గు గనులు శాఖ మంత్రి కిషన్ రెడ్డి మండి పడ్డారు.భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన



విగ్రహానికి పూలమాల వేసి నివాళర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం రాసిన అంబేద్కర్‌ను కాంగ్రెస్ పార్టీ అడుగడుగునా అవమానించిందని సంచలన వ్యాఖ్యలు చేశారు.కాంగ్రెస్ హయాంలోనే అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాలరాసి ఎమర్జెన్సీ విధించారని గుర్తు చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చాక అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళుతుందని, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు పెంచేలా చేసిన ఘనత ప్రధాన మంత్రి మోడీకి దక్కుతుందన్నారు.

**అడుగడుగునా అవమానించిందే కాంగ్రెస్**
**కేంద్రమంత్రి బండి సంజయ్**

కాంగ్రెస్ తీరు చంపినోడే సంతాప సభపెట్టినట్లుగా ఉందిని అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర విమర్శలు చేశారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా సోమవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, లక్ష్మణ్‌లతో కలిసి ఆయన అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బండి సంజయ్ మాట్లాడుతూ.. అంబేద్కర్‌ను అడుగడుగునా అవమానించిందే కాంగ్రెస్ అని, ఆయనపై కుట్ర చేసి రెండు సార్లు ఓడించిందే కాంగ్రెస్ అని మండిపడ్డారు. ఆయనకు భారతరత్న ఇవ్వకుండా అవమానించడమే కాకుండా ఆయనను ఓడించిన వ్యక్తికి పద్మభూషణ్ ప్రదానం చేసిందే కాంగ్రెస్ పార్టీ అని ఫైర్ అయ్యారు. అలాంటి పార్టీ ఇవాళ అంబేద్కర్ జయంతిని పండుగలా నిర్వహించాలనడం సిగ్గుచేటని, తక్షణమే బడుగు, బలహీనవర్గాల ప్రజలందరికీ కాంగ్రెస్ పార్టీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# పెరిగిన పత్తి విత్తనం ధర

**హైదరాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త :** తెలంగాణలో పత్తి విత్తనాల ధరలు పెరిగాయి. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ సారి 50 రూపాయలు మేర పెరిగింది. గతేడాది 475 గ్రాముల పత్తి విత్తన ప్యాకెట్ ధర 850 రూపాయలు ఉండగా, ఈ సారి దాన్ని 900 రూపాయలకు పెంచారు. ఇప్పటికే కూలీలు, దున్నడం, కలుపు తీయడం వంటి ఖర్చులతో ఇబ్బంది పడుతున్న రైతాంగానికి ఈ విత్తనాల ధరల పెంపుతో మరింత భారం అవుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. పత్తి సాగు చేయాలంటే ఎకరానికి మూడు ప్యాకెట్ల చొప్పున విత్తనాలను నాటాల్సిన అవసరం ఉంది. ఒక్క ప్యాకెట్ 475 గ్రాములు ఉండగా, అందులో 450 గ్రాములు బీటీ విత్తనాలు, 25 గ్రాములు నాన్ బీటీ విత్తనాలు ఉంటాయి.
మరోవైపు రైతులకు పంట సాగు చేసేందుకు ప్రతియేటా పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నాయి. విత్తనాలు, పురుగు మందులు, కూలీల కోసం భారీగా ఖర్చు చేయాల్సి వస్తున్నది. కూలీల రవాణా, కలుపు తీయడానికి ఎకరానికి 12 వేల నుంచి 15 వేల రూపాయల వరకు ఖర్చవుతున్నది. కాగా వచ్చే వానాకాలం సీజనులో రాష్ట్ర వ్యాప్తంగా 60 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. అయితే వర్షాలు పడే సమయంలో విత్తనాలు తీసుకుంటే డిమాండ్ పెరిగి వాటి ధరలు ఎక్కువగా ఉంటాయని భావించిన పలువురు రైతులు ఇప్పటి నుంచే కంపెనీల వద్దకు వెళ్లి విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. ఇందుకు తగినట్లుగా దళారులు కూడా క్వింటాళ్ల కొద్ది విత్తనాలు దిగుమతి చేసుకొని నిల్వలు అందుబాటులో ఉంచుకుంటున్నారు.

# అసమానతలు లేని సమాజ నిర్మాణమే ఘనమైన నివాళి

### సింగరేణ సిఎండి బలరామ్


**హైదరాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** అసమానతలు లేని సమాజ నిర్మాణమే అంబేద్కర్‌కు ఘనమైన నివాళి అని సింగరేణ సిఎండి ఎన్ బలరామ్ అన్నారు. సింగరేణి భవన్‌లో సోమవారం అంబేద్కర్ జయంతి సందర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్ జీవితం ప్రతీ ఒక్కరికీ ఆదర్శమన్నారు. రాజ్యాంగం ప్రసాదించిన హక్కుల వల్లే ప్రతీ ఒక్కరికీ స్వేచ్ఛ, సమానత్వం, సమాన అవకాశాలు లభించాయన్నారు. కార్మికులకు, మహిళలకు హక్కులను కల్పించిన ఆయన అన్ని వర్గాలకు సంబంధించిన వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇడి ఎం.సుభానీ తదితరులు పాల్గొన్నారు.

# భార్యను రోకలిబండతో కొట్టిచంపిన భర్త

### గొడవను ఆపేందుకు అడ్డువచ్చిన అత్తపైనా దాడి

### అత్తకు తీవ్రగాయాలు, పోలీసుల అదుపులో నిందితుడు

**హైదరాబాద్ (పటాన్‌చెరు), ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** పటాన్ చెరు మండలం పెద్ద కంజర్లలో దారుణం జరిగింది. భార్యాభర్తల మధ్య మనస్పర్ధల వల్ల భార్యను రోకలి బండతో విచక్షణారహితంగా కొట్టి చంపేశాడు ఓ భర్త. అడ్డొచ్చిన అత్తను సైతం కొట్టడంతో తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. పటాన్ చెరు సీఐ వినాయక్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం జిన్నారం మండలం కిష్టాయిపల్లికి చెందిన సురేష్ (32)తో పటాన్ చెరు మండలం పెద్దకంజర్ల చెందిన ప్రమీల(25)కు మూడు సంవత్సరాల క్రితం వివాహమైంది. కాక సురేష్ ఏమి పని చేయకుండా తాగుతూ జులాయిగా తిరుగుతుండడంతో భార్య, భర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండడంతో భార్య ప్రమీల కొంతకాలం క్రితం పుట్టింటికి వచ్చింది. భార్య వచ్చిన కొన్ని రోజులకే భర్త కూడా అత్తవారింటికి వచ్చాడు. ఇక్కడ కూడా సీన్ మారలేదు. తరచూ తాగుతూ భార్యను కొడుతుండడంతో ఇద్దరి మధ్యలో గొడవలు జరుగుతుండేవి. కాగా సోమవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఇద్దరి మధ్య మరోసారి గొడవలు జరగడంతో ఆవేశంలో భర్త సురేష్ ఇంట్లో ఉన్న రోకలి బండతో విచక్షణ రైతంగా భార్యాభలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. అడ్డొచ్చిన అత్త కవితను కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పటాన్ చెరు సీఐ వినాయక్ రెడ్డి సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని పూర్వపరాలను పరిశీలించారు తీవ్ర గాయాలైన కవితను మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మృతురాలిని పోస్ట్ మార్టం నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



# ప్రేమకథ ఉండదు ప్రేమికులకు అండగా ఉండే నాకథ ఉంటుంది

### వెండితెరపై మూడు విభిన్నపాత్రలు.. జగ్గారెడ్డి చిట్‌చాట్

**హైదరాబాద్,ఏప్రిల్14,ప్రభాతవార్త:** వెండితెరపై మూడు విభన్నపాత్రలు స్టూడెంట్ లీడర్,కౌన్సిలర్, చైర్మెన్‌గా ఉన్న సంఘటనలు వేరువేరు నటులతో చిత్రీకరణ జరుగుతోందని కాంగ్రెస్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే తూర్పు జయప్రకాష్‌రెడ్డితెలిపారు. చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ ఈ సినిమా లో నా ప్రేమ కథ ఉండదు. ఆ ప్రేమికుల కు అండగా నిలిచే పాత్ర లో నేను ఉంటాను.ఈ సినిమా కోసం నన్ను దర్శకుడు ఎంపిక చేసుకున్నాడు. జగ్గారెడ్డి గా నా జీవితం లో జరిగిన మూడు సంఘటనలు ఉంటాయి అప్పటి నా పాత్రలో వేరే నటుడు ఉంటాడని తెలిపారు. మూడు పాత్రలు తర్వాత నేను సినిమా లో ఎంటర్ అవుతానని అన్నారు ఈ మూడు ఘట్టాల్లో ఒక రాజకీయ పార్టీ కి చెందిన నాయకుడు నన్ను మర్డర్ చేసే ప్లాన్ చేశాడు. ఆ మర్డర్ కు బలి కాకుండా నేను ప్రతి వ్యూహం ఎలా చేశానో సినిమా లో చూపించ బొతున్నా అని వివరించారు. పోలీసుల నిర్బంధాలు, ఒత్తిళ్ల ను ధీటుగా ఎదుర్కుంటూ నిజ జీవితం లో ఎదిగిన తీరు ను ఈ మూడు పాత్రల ద్వారా ఈ సినిమాలో చూపించ బోతున్నాను. ఆరోజులలో స్టూడెంట్ లీడర్ గా కౌన్సిలర్ గా , చైర్మెన్ గా ఉన్న సమయం లో నా ఎలాంటి ఆర్థిక బలం లేదు, ఎలాంటి పొలిటికల్ బ్యాక్ గ్రౌండ్ లేదు. నాకు ఉన్నది కార్యకర్తల, ప్రజల బలం. నాకు ఎలాంటి ధనబలం లేదు కానీ కావాల్సినంత జన బలం ఉంది. నా జీవితంలో ఈ మూడు సందర్భాల్లో పోలీసులు నాపై చేసిన ఒత్తిడులు, నిర్బంధాలు , జిల్లా ఎస్పి తో గొడవ లు ప్రధానంగా ఉంటాయి. ఒక జిల్లా కలెక్టర్ విషయంలో కూడా నాకు గొడవ జరిగింది. కలెక్టర్ కు వ్యతిరేకంగా ధర్నాలు, రాస్తారోకోలు చేశాను. కలెక్టర్ ట్రాన్స్ఫర్ అయ్యే వరకు పోరాటం చేసిన. ఈ సంఘటనలు సినిమాలో ఉంటాయని తెలిపారు. కథ ను డైరెక్టర్ రామానుజం ప్రిపెర్ చేస్తున్నారు డైరెక్టర్ స్క్రిప్ట్ ను సిద్ధం చేసే పనిలో నిమగ్నం అయ్యిండు అని తెలిపారు.

# ఎమోషనల్ యాక్షన్ ఫిల్మ్ 'అర్జున్ S/O వైజయంతి'

నందమూరి కళ్యాణ్ రామ్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ అర్జున్ S/O వైజయంతి. ఈ చిత్రంలో విజయశాంతి పవర్ ఫుల్ పాత్రలో కనిపిస్తున్నారు. ఈయాక్షన్ ప్యాక్డ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో ఈ రెండు పాత్రలు మధ్య డైనమిక్స్ కీలకంగా వుండబోతున్నాయి. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహించి ఈ చిత్రాన్ని అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్లపై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రదీప్ చిలుకూరి విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. **అర్జున్ సన్నాఫ్ వైజయంతి ఆలోచన ఎలా వచ్చింది? కళ్యాణ్ రామ్‌ని ఎలా అప్రోచ్ అయ్యారు?** కళ్యాణ్ రామ్‌తో సినిమా చేయాలని ప్రొడ్యూసర్స్ అనుకున్నారు. అప్పటికే కళ్యాణ్ రామ్ డెవిల్ అమిగోస్ లాంటి ప్రయోగాత్మక చిత్రాలు చేసి ఉన్నారు. ముందుగా మాస్ సినిమా చేద్దామని ఫిక్స్ అయ్యాము. మాస్ జోనర్‌లో హీరో క్యారెక్టర్‌ని తయారు చేశాను. తర్వాత ఒక పవర్ఫుల్ మదర్ క్యారెక్టర్‌ని అనుకున్నాం. ఈ మదర్ వైజయంతి లాంటి పవర్ఫుల్ క్యారెక్టర్ అయితే బాగుంటుందని అనుకున్నాం. ముందు హీరోకి చెప్పాం. ఆయన చేద్దాం అన్నారు కానీ విజయశాంతి ఒప్పుకుంటేనే చేద్దాం అని క్లియర్‌గా చెప్పారు. విజయశాంతికి కథ చెప్పాం. **ఇందులో మెయిన్ కాన్ ఫ్లిక్ట్ ఏమిటి?**




హీరో క్యారెక్టర్ అండ్ మదర్ క్యారెక్టర్ ఎవరి ఐడియాలజీలో వాళ్ళు కరెక్ట్ గా ఉంటారు. అక్కడి నుంచే కాన్ ఫ్లిక్ట్ క్రియేట్ అవుతుంది. ఈ రెండు పవర్ ఫుల్ క్యారెక్టర్స్. **మీరు రాజా చెయ్యి వేస్తే సినిమా చేశారు ఆ తర్వాత ఇంత గ్యాప్ రావడానికి కారణం?** కథలు ఒకే అయ్యాయి. ఒక పెద్ద హీరో సినిమాకి అడ్వాన్స్‌లు ఇచ్చి కూడా తర్వాత కొన్ని కారణాల వల్ల ఆగాం. అలాగే యువీ క్రియేషన్ లో ఒక కథ కోసం మూడేళ్ల పాటు కూర్చున్నాం. అది నెక్స్ట్ చేయబోతున్నాం. **సినిమా బిజినెస్ ఎలా ఉంది?** చాలా బాగుంది. ప్రొడ్యూసర్స్ చాలా హ్యాపీగా ఉన్నారు. సినిమాకి చాలా మంచి బజ్ ఉంది. **ఎన్టీఆర్ కళ్యాణ్ అన్న కాలర్‌ఎగరేస్తాడు అని చెప్పారు ఆ నమ్మకం ఎలా వచ్చింది?** ఎన్టీఆర్ సినిమా చూశారు. చూసిన తర్వాత వచ్చిన కాన్ఫిడెన్స్ అది. **సాయి మంజ్రేకర్ క్యారెక్టర్ ఎలా ఉండబోతుంది?** ఎమోషనల్ యాక్షన్ ఫిలిం ఇది. అలాంటి సీరియస్ ఫిలింలో కాస్త కూల్ బ్రీజా ఉండే క్యారెక్టర్ తనది. తన కరెక్ట్‌కి ఒక ఇంపార్టెన్స్ ఉంది. **ఎన్ని ఫైట్స్ ఉన్నాయి? ఎలా డిజైన్ చేశారు?** విజయశాంతి ఫస్ట్ యాక్షన్ సీక్వెన్స్ పృథ్వీ మాస్టర్ చేశారు. రామకృష్ణ మాస్టారు ఇంటర్వెల్, క్లైమాక్స్ రెండు ఫైట్లు చేశారు.

# 'పాంచ్ మినార్' టీజర్ లాంచ్

**యంగ్ ట్యాలెంటెడ్** రాజ్ తరుణ్ హీరోగా రామ్ కడుముల దర్శకత్వంలో రూపొందిన క్రైమ్ కామెడీ ఎంటర్ టైనర్ పాంచ్ మినార్. గోవింద రాజు ప్రజెంట్ చేస్తున్న ఈ చిత్రాన్ని కనెక్ట్ మూవీస్ ఎల్‌ఎల్‌పి బ్యానర్‌పై మాధవి, ఎంఎస్‌ఎం రెడ్డి నిర్మిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన ఫస్ట్ లుక్ మంచి రెస్పాన్స్ వచ్చింది. ఫస్ట్ సింగిల్ మిడిల్ క్లాస్ ఆంథమ్ ఏం బతుకురా నాది సాంగ్ వైరల్ అయ్యింది. బ్లాక్ బస్టర్ డైరెక్టర్ మారుతి టీజర్‌ని గ్రాండ్‌గా లాంచ్ చేశారు.



టీజర్ లాంచ్ ఈవెంట్‌లో డైరెక్టర్ మారుతి మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. పాంచ్ మినార్ టైటిల్ చాలా బాగుంది. గోవిందరాజు చాలా పాషన్ ఉన్న వ్యక్తి. ఎలాగైనా సాధించాలి నిలబడాలనే కసి పట్టుదలతో ఈ సినిమాని తీశారు. కెమెరా వర్క్ చాలా ప్రామిసింగ్‌గా ఉంది. సినిమాని చాలా రిచ్ గా తీశారు. టీజర్ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది. డెఫినెట్‌గా ఈ సినిమా మంచి విజయాన్ని సాధిస్తుందని నమ్మకం ఉంది. ఈ సినిమాతో రాజ్ తరుణ్‌కి కూడా బెస్ట్ స్టార్ట్ అవుతుందని నమ్ముతున్నాను. టీజర్ చూడగానే సినిమా హిట్ అవుతుందని నమ్మకం కలిగింది. మంచి సినిమా. డెఫినెట్‌గా ఎంకరేజ్ చేయాలని ఈ వేడుకకు రావడం జరిగింది. ప్రొడక్ట్ చాలా ప్రామిసింగ్‌గా క్వాలిటీగా ఉంది. చిన్న బడ్జెట్‌లో క్వాలిటీ ప్రొడక్ట్ తీయడం అంత ఈజీ కాదు. చాలా కష్టపడాలి. అలాంటి కష్టం ఈ సినిమాకి పడ్డారు. ఇలాంటి మంచి సినిమాలు ఎంకరేజ్ చేయండి. గోవిందరాజు అండ్ టీంని బ్లెస్ చేయండి. అందరికీ థాంక్యూ సో మచ్ అన్నారు. నిర్మాత ఎస్ కే ఎన్ మాట్లాడుతూ, ఈ సినిమా చాలా మంచి విజయాన్ని సాధించి అందరికీ మంచి లాభాలు రావాలని కోరుకుంటున్నాను. డైరెక్టర్‌గా పరిచయం అవుతున్న రామ్‌కి అభినందనలు. శేఖర్ చంద్ర మంచి మ్యూజిక్ ఇచ్చారు. లిరిక్ రైటర్ అనంత శ్రీరామ్ ఇందులో మంచి పాట రాశారు. హీరోయిన్ రాశి సింగ్ తెలుగు నేర్చుకొని చాలా చక్కగా మాట్లడుతున్నారు. ఆమె మంచి సినిమాలు చేయాలని కోరుకుంటున్నాను. ఈ ఈవెంట్ చూస్తుంటే చాలా పాజిటివ్‌గా ఉంది. రాజ్ తరుణ్ టైమింగ్ చాలా బాగుంటుంది. ఈ సినిమాతో స్పాంటేనియస్ స్టార్ రాజ్ తరుణ్ అనే టైటిల్ ఇవ్వాలని నిర్మాతల్ని కోరుతున్నాను. తనది నేచురల్ టైమింగ్. తనకి ఇక్కడి నుంచి అన్ని మంచి శుభాలే జరగాలని కోరుకుంటున్నాను అన్నారు. డైరెక్టర్ సాయి రాజేష్ మాట్లాడుతూ, ఈ టీజర్ నాకు చాలా నచ్చింది. రాజ్ తరుణ్ నేను చాలా మంచి ఫ్రెండ్స్. శేఖర్ చంద్ర చాలా మంచి మ్యూజిక్ ఇచ్చారు. ఈ సినిమా దర్శకు లకు నిర్మాతలకి నటీనటులందరికీ ఈ సినిమా మంచి విజయాన్ని ఇవ్వాలని కోరుకుంటున్నాను. టీమ్ అందరికీ ఆల్ ది వెరీ బెస్ట్ అన్నారు. డార్లింగ్ డార్లింగ్ స్వామి మాట్లాడుతూ, గోవిందరాజు డబ్బులు దగ్గర చాలా స్ట్రిక్ట్. ఈ సినిమాకి అంత డబ్బు పెట్టి తీశారు అంటే డెఫినెట్‌గా సినిమా మంచి లాభాలు చేస్తుందని అర్థం. మా ఎస్ కే ఎన్ విషయం లేనిదే ఏ ఫంక్షన్‌కి రారు. ఆయన ఈ కథ విని వెంటనే రావాలని ఇక్కడికి రావడం జరిగింది. టీజర్ చాలా బాగుంది. ట్రైలర్ చూస్తే డెఫినెట్‌గా సినిమాకు రావాలనిపిస్తుంది. ఈ సినిమా అందరికీ మంచి పేరు తెస్తుంది అన్నారు.

# 'ఖేల్ ఖతమ్ దర్వాజా బంద్' నుంచి లిరికల్ సాంగ్

**రాహుల్ విజయ్,** నేహా పాండే హీరో హీరోయిన్లుగా నటిస్తున్నసినిమా "ఖేల్ ఖతమ్ దర్వాజా బంద్". ఈ చిత్రాన్ని వేదాన్ష్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై ప్యాషనేట్ ప్రొడ్యూసర్ అర్జున్ దాస్యన్ నిర్మిస్తున్నారు. "ఖేల్ ఖతమ్ దర్వాజా బంద్" సినిమాను హిలేరియస్ ఫన్ రైడ్‌గా నూతన దర్శకుడు అశోక్ రెడ్డి కడదూరి రూపొందిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ మూవీ నుంచి ఏదో ఏదో.. లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. ఏదో ఏదో.. రిలికల్ సాంగ్‌కు పూర్ణాచారి క్యాచీ లిరిక్స్ అందించగా, సురేష్ బొబ్బిలి బ్యూటిఫుల్‌గా కంపోజ్ చేశారు. కార్తీక్, హారిణి మంచి ఫీల్‌తో పాడారు. ఏదో ఏదో.. సాంగ్ ఎలా ఉందో చూస్తే...ఏదో ఏదో ఏదో జరిగెనే యెద లోపలా, ఏవో ఏవో కలలు విరిసెనే, నిన్నా మొన్నా లేదే అరే ఏంటిలా, ఉన్నట్టుండి ముంచేశావిలా, మనసే ముసుగులు తీసే, అడుగులు వేసే బయటకు నీతోనే, కలిసే నిమిషం వణికే, పెదవులు పలికే తకధిమి తందానే.. అంటూ ఆకట్టుకునేలా సాగుతుంది పాట. నటీనటులు రాహుల్ విజయ్, నేహా పాండే, అజయ్ ఘోష్, మురళీధర్ గౌడ్, గెటప్ శ్రీను, రచ్చ రవి, రవివర్మ, గంగవ్వ, జయశ్రీ, తదితరులు.



# 'దండోరా' సెకండ్ షెడ్యూల్

**నేషనల్ అవార్డ్** గెలుచుకున్న చిత్రం కలర్ ఫోటో బ్లాక్‌బస్టర్ మూవీ బెదురులంక 2012 చిత్రాలను నిర్మించి అందరి దృష్టిని ఆకర్షించిన లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత రవీంద్ర బెనర్జీ ముప్పానేని రూపొందిస్తోన్న తాజా చిత్రం దండోరా. మురళీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ మూవీ శరవేగంగా చిత్రీకరణను జరుపుకుంటోంది. ప్రస్తుతం సినిమా సెకండ్ షెడ్యూల్ చిత్రీకరణ శరవేగంగా సాగుతోంది. 25రోజుల పాటు కంటిన్యూగా జరగనున్న ఈ షెడ్యూల్‌లో విలక్షణ పాత్రలతో హీరోయిన్‌గా, నటిగా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సంపాదించుకున్న బిందు మాధవి భాగమయ్యారు. ఇందులో ఆమె వేశ్య పాత్రలో నటిస్తున్నారు. ఎమోషనల్ టచ్‌తో ఉంటూ ఆలోచింప చేసేలా ఆమె పాత్ర ఉంటుంది. ఇప్పటికే ఈ షెడ్యూల్‌లో వెర్సటైల్ యాక్టర్ శివాజీ పాల్గొంటున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు బిందు మాధవి కూడా జాయిన్ కావటం విశేషం. ఫస్ట్ బీట్ వీడియోతో అంచనాలు పెంచుకున్న దండోరా సినిమా సామాజిక స్పృహను కలిగించే అంశంతో తెరకెక్కుతోంది. అగ్ర వర్ణాలకు చెందిన అమ్మాయిల ప్రేమించి పెళ్లి చేసుకున్నా, అగ్ర వర్ణాలకు ఎదురు తిరిగినా ఎలాంటి దౌర్జన్యకాండ జరుగుతున్నాయనే అంశాన్ని ఆధారంగా చేసుకుని దండోరా సినిమాను తెరకెక్కిస్తున్నారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో మన పురాతన ఆచారాలు, సాంప్రదాయాలను ఆవిష్కరిస్తూనే వ్యంగ్యం, చక్కటి హాస్యం, హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాల కలయికగా ఈ సినిమాను ఆవిష్కరిస్తున్నారు. శివాజీతో పాటు నవదీప్, నందు, బిందు మాధవి, రవి కృష్ణ, మణిక, అనూష, రాధ్య తదితరులు. ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు మార్క్ కె.రాబిన్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. వెంకట్ ఆర్.శాఖమూరి సినిమాటోగ్రఫీ, సృజన అడుసుమిల్లి ఎడిటింగ్, క్రాంతి ప్రియమ్ ఆర్ట్ డైరెక్టర్, రేఖ బొగ్గారపు కాస్ట్యూమ్ డిజైనర్, ఎడ్వర్డ్ పేరజీ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్, అనీష్ మరిశెట్టి కో ప్రొడ్యూసర్‌గా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. త్వరలోనే ఈ మూవీకి సంబంధించి మరిన్ని వివరాలను తెలియజేస్తామని మేకర్స్ తెలియ జేశారు.



# ఎంజాయ్‌మెంట్ మూవీ 'గుడ్ బ్యాడ్ అగ్లీ'

**వెరీ సక్సెస్ ఫుల్** పాన్‌ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్, కోలీవుడ్ ఐకాన్ అజిత్ కుమార్ లేటెస్ట్ బ్లాక్ బస్టర్ సంభవం గుడ్ బ్యాడ్ అగ్లీ. టిసిరీస్ గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్ ఈ చిత్రాన్ని సమర్పించారు. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదలై అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించి బ్లాక్ బస్టర్ సంభవం సక్సెస్‌ని అందుకొని సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ బ్లాక్ బస్టర్ సంభవం సెలబ్రేషన్స్ నిర్వహించారు. బ్లాక్ బస్టర్ సంభవం సెలబ్రేషన్స్‌లో నిర్మాత నవీన్ యర్నేని మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ఈ సినిమా ఒకమంచి ఎక్స్పీరియన్స్. తెలుగులో చాలా బ్లాక్ బస్టర్ తీసాము. ఈ సినిమాని రోహిణి థియేటర్స్‌లో చూసాము. థియేటర్ ప్యాక్డ్‌గా ఆడియన్స్ ఎంజాయ్ చేస్తున్నారు. ఉత్సాహంతో కేరింతలు కొడుతున్నారు. ఆ విజువల్‌ని మర్చిపోలేను. సినిమా హ్యూజ్ బ్లాక్ బస్టర్. ఇదంతా మా హీరో అజిత్ వలన. డైరెక్టర్ అధిక్ అద్భుతమైన సినిమా ఇచ్చాడు. అజిత్ చాలా సింపుల్ పర్సన్. ఆయన మనసుతో మాట్లాడే మనిషి. ఆయనతో మరిన్ని సినిమాలు చేయాలని ఉంది. అధిక్ ప్రొడ్యూసర్స్ డైరెక్టర్. ఈ సినిమాని 95 రోజుల్లో పూర్తి చేశాడు. ఇంత గ్రాండ్ స్కేల్ ఉన్న సినిమాని 95 డేస్‌లో కంప్లీట్ చేయడం మామూలు విషయం కాదు. అధిక్ లాంటి డైరెక్టర్స్ ఇండస్ట్రీకి కావాలి. జివి, ప్రియా, కార్తీక్ అందరికీ థాంక్యు. సునీల్‌తో మరిన్ని సినిమాలు చేయాలని ఉంది. ఈ సినిమా రెండు గంటల రోలర్ కోస్టర్ రైడ్. ఎక్కడ ఆగదు. పరిగెడుతూనే ఉంటుంది. తమిళనాడు ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, ఓవర్సీస్ అన్నిచోట్ల సినిమాకి అద్భుతమైన రెస్పాన్స్ వస్తుంది. ఇది ఇక్కడితో ఆగదు. చాలా పెద్ద విజయం సాధించబోతుంది. అజిత్‌కి టీమ్ అందరికీ మరోసారి థాంక్యూ అన్నారు. డైరెక్టర్ అధిక్ రవిచంద్రన్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ఈ సినిమాకి మ్యూజిక్ స్ట్రాంగ్ పిల్లర్. జీవి ప్రకాష్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ చాలా ఎంజాయ్ చేస్తున్నారు. ప్రియా క్యారెక్టర్ ఆడియన్స్‌ని అలరించింది. కార్తికేయ క్యారెక్టర్ కూడా ఈ సినిమాకి చాలా క్రూషియల్. సునీల్ ఇందులో క్యారెక్టర్ చేయడం నాకు చాలా హ్యాపీనెస్ ఇచ్చింది. అజిత్ కూడా ఆ క్యారెక్టర్‌ని సునీల్ చేస్తేనే బాగుంటుందని అన్నారు. చాలా హార్డ్ వర్క్ చేశారు. డిఓపి అభినందన్ అద్భుతమైన విజువల్స్ ఇచ్చారు. మైత్రి మూవీ మేకర్స్‌కి థాంక్యూ. వాళ్లు తమిళ్లో చేసిన ఫస్ట్ సినిమా ఇది. నాకు చాలా సపోర్ట్ చేశారు. నవీన్ గారు లాంటి హంబుల్ స్వీట్ ప్రొడ్యూసర్‌ని నేను చూడలేదు. చాలా గొప్పగా చూసుకున్నారు. ఈ సినిమా హ్యూజ్ బ్లాక్ బస్టర్ హిట్ అయిందంటే కారణం నవీన్ గారు. మైత్రి మూవీ మేకర్స్ తమిళనాడులో హిస్టరీ క్రియేట్ చేశారు.





ఖుషీ కపూర్ నయా లుక్

# బంగారు బాబు కుమారుడి వివాహం

**ఫార్మా రంగానికి** చెందిన ఇద్దరు పారిశ్రామిక దిగ్గజాలు వియ్యమందితే ఆ వివాహ మహోత్సవం ఎంత ఘనంగా, ఎంత వైభవోపేతంగా జరుగుతుందో చెప్పటానికి వేదికగా నిలిచింది హైదరాబాదులోని హైటెక్స్ కన్వెన్షన్ సెంటర్. వివాహ వేడుకకు సినీ, రాజకీయ, ఫార్మా రంగాలకు చెందిన వేలాది మంది ప్రముఖులు తరలి రావటం వియ్యమందిన ఆ ఇద్దరు ప్రముఖుల పలుకుబడి, ప్రాభవాలకు నిదర్శనంగా నిలుస్తుంది. తెలుగు చలనచిత్ర పరిశ్రమలో ఎన్నెన్నో ప్రతిష్టాత్మక చిత్రాలకు ఫైనాన్స్ చేసిన ప్రముఖ ఫిలిం ఫైనాన్షియర్ ఆర్. సెక్యూర్డ్ ఫైనాన్స్ అధినేత బంగారు బాబు (ఈవీ రెడ్డి రాజారెడ్డి) చిన్న కుమారుడు క్రాంతి రెడ్డి వివాహ మహోత్సవం ప్రపంచ ఫార్మారంగంలో గొప్ప వ్యక్తిగా, శక్తిగా ఎదిగి వేలాది మందికి జీవనోపాధి కల్పించిన పారిశ్రామిక దిగ్గజం బాలాజీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత సీతారామిరెడ్డి రామ సీత దంపతుల కుమార్తె శిరీషతో వైభవోపేతంగా జరిగింది. కాగా బంగారు బాబుకు సినిమా రంగంతో ఉన్న విశేష అనుబంధం నేపథ్యంలో ఈ వివాహ వేడుకకు ఎందరెందరో సినీ ప్రముఖులు విచ్చేసి నూతన వధూవరులకు శుభాశీస్సులు అందజేశారు. ప్రముఖ నటీనటులు డాక్టర్ మురళీ మోహన్, నట కిరీటి డాక్టర్ రాజేంద్రప్రసాద్, లేడీ సూపర్ స్టార్ విజయశాంతి, సహజనటి జయసుధ, ప్రముఖ నటులు, నిర్మాత, దర్శకుడు ఆర్. నారాయణ మూర్తి, సాయికుమార్, రఘుబాబు, దాసరి అరుణ కుమార్, తదితరులతోపాటు అగ్రశ్రేణి నిర్మాతలు అల్లు అరవింద్, దిల్‌రాజు, కే.ఎస్.రామారావు, సి.కళ్యాణ్, సునీల్ నారంగ్, జెమినీ కిరణ్, మైత్రి మూవీ మేకర్స్ అధినేతలు రవి, యెర్నేని నవీన్, లగడపాటి శ్రీధర్, డాక్టర్ వెంకటేశ్వరరావు, కే.ఎల్. కుమార్ చౌదరి, కే. అచ్చిరెడ్డి, పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ అధినేత విశ్వ ప్రసాద్.



# అందరికీ కనెక్ట్ అయ్యే మూవీ 'ఓదెల 2'


**తమన్నా** భాటియా హైలీ యాంటిసిపేటెడ్ మూవీ ఓదెల2లో నెవర్ బిఫోర్ క్యారెక్టర్‌లో అలరించడానికి సిద్ధంగా వున్నారు. సూపర్ నాచురల్ థ్రిల్లర్ ఓదెల రైల్వే స్టేషన్‌కి సీక్వెల్ ఇది. సంపత్ నంది సూపర్ విజన్‌లో అశోక్ తేజ దర్శకత్వంలో, మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్ వర్క్స్‌పై డి మధు నిర్మించిన ఈ చిత్రం ప్రమోషనల్ కంటెంట్‌తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. తమన్నా నాగ సాధువుగా, మిస్టరీ ఎనర్జీతో కూడిన పాత్రలో కనిపించనున్నారు. ఈ సందర్భంగా మూవీ క్రియేటర్ సంపత్ నంది విలేకరుల సమావేశంలో సినిమా విశేషాల్ని పంచుకున్నారు.

**ఓదెల 2 ఐడియా ఎప్పుడు స్టార్ట్ అయింది?** పార్ట్ వన్ చేసినప్పుడు సీక్వెల్ చేయాలనే ఆలోచన లేదు. ఏదైనా అవకాశం ఉంటే చేయొచ్చు కదా అని చివర్లో ఒక లీడ్ ఇచ్చాం. పార్ట్ వన్ తెలుగులో చాలా పెద్ద సక్సెస్ అయింది. ఆహా వారు తమిళ్ రేట్స్ కూడా కొనుక్కున్నారు. దీన్ని హిందీలో రీమేక్ చేయాలనే ప్రతిపాదన వచ్చింది. డైరెక్టర్ అశోక్ ఈ సినిమాకి సీక్వెల్ ఎందుకు రాయకూడదు అని అడిగారు. ఒకసారి భీమ్స్‌తో మ్యూజిక్ సిట్టింగ్స్‌కి వెళ్లాను. అప్పుడు ఆ మ్యూజిక్ సిటింగ్స్ అవ్వలేదు కానీ ఈ సీక్వెల్ ఆలోచన అక్కడే క్రియేట్ అయింది. **తమన్నా నాగసాధు లుక్ కోసం ఎలాంటి ప్రయత్నాలు చేశారు?** మొదట మూడు లుక్స్ ట్రై చేసాం. తమన్నా చాలా ఫెయిర్‌గా ఉంటారు. నాగ సాధులు ఎండల్లో వుంటారు. ఆ స్కిన్ టోన్ వేరుగా ఉంటుంది. ఎన్ని మేకప్‌లు ట్రై చేసిన ఫేక్‌గా అనిపించేది. నాగ సాధువుల్లో ఫారినర్స్ కూడా ఉన్నారు. తమన్నా ఎండల్లో వుంటే పింకిష్‌గా మారతారు. అసలు మేకప్ లేకుండానే చేద్దామని అనుకున్నాం. **ఈ సినిమా గ్రాఫిక్స్ విషయంలో హ్యాపీగా ఉన్నారా?** వెరీ హ్యాపీ. ఇండియన్ సూపర్ స్టార్ సినిమాల్లో ఉండే క్వాలిటీ గ్రాఫిక్స్ ఈ సినిమాలో ఉన్నాయి. దాదాపు 150 మంది విఎఫ్‌ఎక్స్ నిపుణులు గత ఆరు నెలలుగా ఈ సినిమా కోసం వర్క్ చేస్తున్నారు. **అజినీస్ లోక్ నాథ్ మ్యూజిక్ గురించి?** ఈ కథ అనుకున్న వెంటనే ఫైనల్ చేసిన ఫస్ట్ టెక్నీషియన్ అజినిష్. దానికి కారణం కాంతార. ఈ సినిమాలో బ్యాగ్రౌండ్ స్కోరు ఎక్స్ట్రార్డినరీగా ఉంటుంది. ఈ సినిమాకి బిగ్గెస్ట్ బ్లెస్సింగ్ అజినీస్ మ్యూజిక్.




# 'మాస్ జాతర' సాంగ్ సూపర్

**మాస్ మహారాజా** రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న ప్రతిష్టాత్మక 75వ చిత్రం మాస్ జాతర. భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. ఇప్పుడు ఈ చిత్రం నుంచి మొదటి గీతంగా ఖితు మేరా లవర్‌ఖిను విడుదల చేశారు. ప్రోమోతోనే అందరి దృష్టిని ఆకర్షించిన తు మేరా లవర్ గీతం కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా చూశారు. తాజాగా విడుదలైన ఈ పాట, ఒక్కసారి వినగానే శ్రోతలకు అభిమాన గీతం మారిపోతోంది. ధమాకా జోడి రవితేజ శ్రీలీల అందరి అంచనాలను అందుకునేలా, అద్భుతమైన కెమిస్ట్రీతో మరోసారి మ్యాజిక్ చేశారు. ప్రేక్షకులకు వెండితెరపై పూర్తి స్థాయి ట్రీట్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు ఈ పాటతో చెప్పకనే చెప్పేశారు. సంగీత సంచలనం భీమ్స్ సిసిరోలియో తు మేరా లవర్ గీతాన్ని అద్భుతంగా స్వరపరిచారు. భాస్కరభట్ల సాహిత్యం మాస్ మెచ్చేలా ఉంది. రవితేజ బ్లాక్‌బస్టర్ చిత్రం ఇడియట్‌లోని ఐకానిక్ చార్ట్‌బస్టర్ "చూపుల్తో గుచ్చి గుచ్చి చంపకే" పాటకు ట్రిబ్యూట్‌గా మలిచిన తు మేరా లవర్ అభిమానులకు విందు భోజనంలా ఉంది. దీనిని ఒక ప్రత్యేకమైన సంగీత నివాళిగా మార్చడానికి నిర్మాతలు కృత్రిమ మేధస్సుని ఉపయోగించి దివంగత సంగీత దర్శకుడు చక్రి స్వరాన్ని తిరిగి సృష్టించారు. రవితేజ శైలి ప్రత్యేక డ్యాన్స్ స్టెప్పులు, శ్రీలీల అద్భుతమైన నృత్య ప్రదర్శనతో ఈ గీతం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. దర్శకుడు భాను బోగవరపు రవితేజ అభిమానులతో పాటు, మాస్ ప్రేక్షకులు మెచ్చే విధంగా మాస్ జాతరను మలుస్తున్నారు. ప్రముఖ ఛాయగ్రాహకుడు విధు అయ్యన్న తన ప్రభావవంతమైన విజువల్స్‌తో పాటకి తగ్గట్టుగా మాస్ వైబ్‌ను అద్భుతంగా చూపించారు. జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. రవితేజ నుంచి అభిమానులు, ప్రేక్షకులు కోరుకునే విధంగా మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా మాస్ జాతర రూపొందుతోంది. త్వరలోనే ఈసినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి. తారాగణం: సాంకేతిక బృందం: చిత్రం: మాస్ జాతర తారాగణం: మాస్ మహారాజా రవితేజ, శ్రీలీల, దర్శకత్వం: భాను బోగవరపు నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య, సంగీతం: భీమ్స్ సిసిరోలియో కూర్పు: నవీన్ నూలి, ఛాయాగ్రహణం: విధు అయ్యన్న, మాటలు: నందు సవిరిగాన, కళా దర్శకత్వం: శ్రీ నాగేంద్ర తంగాల, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: ఫణి కె. వర్మ.



# మొటిమల్ల సమస్యలకు గ్రీన్ టీ

**ఎంత అందమైన ముఖమైనా మొటిమలతో ఆ అందం మారిపోతుంది. బుగ్గలపై, చుబుకంపై వచ్చే మొటిమలు చాలా చిరాకుగా అనిపిస్తాయి. అయితే కొన్ని ప్రక్రియలతో వాటిని తొలగించుకోవచ్చు. చర్మ ఆరోగ్యం మనం తీసుకునే ఆహారం పైన కూడా ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా ఈ ప్రభావం ముఖం పైన ఎక్కువగా ఉం టుందం టున్నారు నిపుణులు. దీనికి ఉదా హరణే మొటి మల సమస్య.**



ఎం త అం దమైన ముఖా నికైనా వన్నె తగ్గించే సమస్య ఇది. అం దుకే వీటిని తగ్గిం చేందుకు ఇమె గా ఫ్యాటీ ఆమ్లాలు. ము ఖంపై మొటి మలు రావడానికి కారణమయ్యే సి బమ్ ఉత్పత్తిని అరికట్టే సామర్థం ఒమేగా3 ఫ్యాటీ ఆమ్లాల్లో ఉంది. చర్మాన్ని ఆరోగ్యవంతంగా ఉంచడానికే కాదు, మొటిమలను తగ్గించడంలోనూ ఈ ఆమ్లాలు సమర్థంగా పని చేస్తాయి. చేపలు, ఆకుకూరలు, వాల్‌నట్స్, బీన్స్, గుడ్లు, అవిసె గింజల్లో ఇవి పుష్కలంగా లభిస్తాయి. అందుకే వీటిని మధ్యాహ్నం లేదా రాత్రిపూట ఆహారంలో తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

గ్రీన్ టీతో చర్మానికి ఎంతో మేలు కలుగుతుందని చాలాసార్లు వినే ఉంటాం. చర్మ కాంతిని మెరుపరచడంలో ఇది కీలకపాత్ర పోషిస్తుంది. అయితే కేవలం సౌందర్యానికే కాదు, చర్మ ఆరోగ్యానికి కూడా గ్రీన్ టీ చక్కటి మందు లాంటిది. మొటిమల సమస్య ఎక్కువగా బాధిస్తున్నవారు రోజూ రెండు కప్పుల గ్రీన్ టీ తీసుకోవడం వల్ల శరీరంలోని విషపదార్థాలు బయటకు పోయి, మొటిమల సమస్య నుంచి త్వరగా ఉపశమనం పొందవచ్చు. దీనికి యాక్సిడెంట్ లక్షణాలే కారణం. టొమాటోతో..ఉండే లైకోపీన్ అనే యాంటీ ఆక్సిడెంట్ చర్మ సమస్యలను తగ్గించడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. వీటిని వంటల్లో ఎక్కువగా వాడడం వల్ల మొటిమల సమస్య నుంచి సులభంగా గట్టెక్కవచ్చు.

టొమాటోలను సూప్ రూపంలో తీసుకున్నా మంచి ఫలితాన్ని పొందవచ్చు. సరిపడినన్ని నీళ్ల తాగితే ఆరోగ్యానికి మంచిదనే విషయం మనందరికీ తెలుసు, కానీ ఈ సులభమైన చిట్కాను పాటించే వారు మాత్రం తక్కువే అని చెబు తున్నారు నిపుణులు. అయితే చర్మ ఆరోగ్యాన్ని పరిరక్షి ంచుకోవాలంటే అన్నిటికంటే కీలకమైంది నీరే అందుకే మొటిమల సమస్య దరిచేరకుండా ఉండేందుకు, వచ్చిన సమస్యను తగ్గించుకోవడానికి రోజుకు కనీసం 8 గ్లాసుల నీటిని తాగాలనేది నిపుణుల సలహా. వీటితో పాటు రోజూ ఒక గ్లాసు కొబ్బరినీళ్ల లేదా తాజా కూరగాయల రసం తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. •

# అక్షయ తృతీయ

హిందూ సాంప్రదాయంలో సంవత్సరంలోని 12 నెలల్లో అమావాస్య నుంచి పౌర్ణమి వరకు గల తిథులు విశిష్ట దినాలుగా సంతరించుకున్నాయి. అమావాస్య దీపావళికి, పాడ్యమి పోలి పాడ్యమిగా తృతీయ లేక తదియ అక్షయ తదియగా, చవితి గణేశ చవితిగా, పంచమి నాగుల పంచమిగా, షష్టి సుబ్రహ్మణ్య షష్టిగా, సప్తమి రథ సప్తమిగా, అష్టమి శ్రీకృష్ణాష్టమిగా, నవమి మహార్నవమిగా, దశమి విజయదశమిగా, ఏకాదశి వైకుంఠ ఏకాదశిగా, ద్వాదశి క్షీరాబ్ది ద్వాదశిగా, త్రయోదశి శని త్రయోదశిగా, చతుర్దశి నరక చతుర్దశిగా, పౌర్ణమి కార్తీక పౌర్ణమిగా విశేషతను సంతరించుకున్నాయి. అన్ని జన్మలలోకి ఉత్తమమైనది మానవ జన్మ. దీనిని సద్వినియోగం చేసుకుని అనంతమైన పుణ్యఫలాలు అందుకోవాలని అందరూ ఆకాంక్షిస్తారు. అక్షయ అంటే తరిగిపోనటువంటిది. నేడు చేసే పుణ్యకార్యాల ఫలం అక్షయం చేస్తూ తరిగిపోకుండా చేయమని చేసే వ్రతమే అక్షయ తృతీయ వ్రతం. ఈ రోజు చేసే దేవతా ప్రీతి కర్మలు, జపదాన, హోమాలు క్షయం కానంత మంచి ఫలితాన్నిస్తాయి. ఈ రోజు చేసే దానాలు అనుష్టాపరులకు, యోగ్యులకు చేసినట్లయితే శ్రీమహావిష్ణువు సంతృప్తి చెందుతాడని శాస్త్ర వచనం. మనలో జీవుడు మరొక శరీరంలో ప్రవేశించిన తరువాత కూడా అన్న సంకల్ప సహిత సముద్ర స్నానం విశేష ఫలితాన్నిస్తుంది.

నక్త వ్రతం, ఏక భుక్తం విశేషం. ఈ రోజు పరశురామ జయంతిగా కూడా కొలుస్తారు. క్లిష్ట సమస్యలకు పరిష్కారం కావాలనుకునేవారు ఈ రోజు నుంచి మండల కాలం పారాయణ చేసినట్లయితే అద్భుత ఫలితాలు కలుగుతాయి. రోజంతా ఉపవసించి రాత్రి సమయంలో స్త్రీలు లక్ష్మీదేవిని పూజించి కనకధారా స్తోత్రం, శ్రీసూక్తం, అష్టలక్ష్మీ స్తోత్రం మొదలైనవి పారాయణ చేసినట్లయితే సౌభాగ్యవంతులై, కుటుంబాలు సుఖసంతోషాలతో వర్ధిల్లుతాయి. ఈ రోజున నారికేళం, తేనె, చెరకు రసం, గోక్షీరం మొదలైన వాటితో అభిషేకం చేసి వాటిని గృహమంతా చిలకరించినట్లయితే క్షేమంగా జీవించగలుగుతారు. జాతక చక్రంలో పితృదోషం ఉంటే, దాని నివారణకు పరమ పవిత్రమైన పుణ్యదినం అక్షయ తృతీయ. మన కంటికి కనిపించే గ్రహాలు సూర్యుడు, చంద్రుడు. సకల పితృదేవతలను మనం సూర్యభగవానునిలో దర్శించవచ్చు. అక్షయ తృతీయ శుభకాలంలో పితృదేవతలను మనం సూర్యభగవానునిలో దర్శించవచ్చు. అక్షయ తృతీయ శుభకాలములో పితృదేవతలను తలచుకుంటూ అన్నం, నెయ్యి, పప్పు కలిపిన చిన్న ముద్దలను ఎండుకొబ్బరిలో నిక్షిప్తం చేసి ఆహుతి చేసినట్లయితే వంశ పారంపర్యంగా శుభఫలితాలు పొందవచ్చునని జ్యోతిష పండితులు చెబుతారు. అక్షల తృతీయ నాడు మహావిష్ణువుకు చందనం సమర్పిస్తే విశ్వమంతా చల్లగా సుభిక్షంగా ఉంటుంది. దేవాలయాలలో ధవళ వర్ణానికి అధిక ప్రాధాన్యమిస్తారు. ధవళ వస్త్రాలతో విగ్రహాలంకారులు చేస్తారు. ఈ రోజు చేసే ఏ దానానికైనా అక్షయ ఫలితం ఉంటుంది. మనం చేసే దాన ఫలితం మన తరువాత తరాలు కూడా అనుభవించవచ్చు అనే నమ్మకం.

**- డాక్టర్ దేవులపల్లి పద్మజ**

# నీటిలో పెరిగే మొక్కలు



**కాలుష్యాన్ని తగ్గించాలన్నా, ఇంటి అందాన్ని పెంచాలన్నా... మొక్కల్ని మించినవి ఏముంటాయి? అయితే, వీటిలో కొన్నింటిని మట్టిలోనే కాదు... నీళ్లలోనూ పెంచొచ్చు. స్పైడర్ ప్లాంట్ కోలియస్, లక్కీ బాంబూ, ఫిలోడెండ్రాన్, గోల్డెన్ పాథోష్, రబ్బర్ ప్లాంట్, కెలాడియం, ఇంగ్లీషు బలీతోపాటు బెగోనియా, హైసింగ్, మొరానియం వంటి పూల మొక్కల్ని నీళ్లలోనూ పెంచొచ్చు. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. నీటిలో మొక్కల్ని పెంచేటప్పుడు ముందుగా... ఏ మొక్క లక్షణం ఏంటో తెలుసుకోవాలి. కొన్ని ప్రత్యక్ష కాంతిని ఇష్టపడితే... మరికొన్ని చీకట్లో ఉన్నా చక్కగా. పెరుగుతాయి. నికి అనుగుణంగా ఏ వాటర్ ప్లాంట్లను పెట్టొచ్చో నిర్ణయించుకోండి.వ ఇత్తడి స్టీలు వంటి లోహపు పాత్రలు కాకుండా.. పారదర్శకంగా ఉండే గాజువాటిని ఎంచుకోవాలి. మట్టిలో పెరిగే మొక్కలతో పోల్చితే ఇవి కొంచెం నెమ్మదిగా ఎదుగుతాయి. కానీ, ఎప్పుడూ పచ్చగా ఉంటాయి. పాత్రల్లోని నీళ్లు దుర్వాసన రాకుండా ఉండటానికి కాస్త బొగ్గు పొడిని చల్లండి. •**

# ఒత్తిడితో అజీర్తి

భారతీయులకు పిండి పదార్థాల పట్ల మక్కువ ఎక్కువ. పప్పు దినుసులు, బియ్యం. మన ప్రధాన ఆహారం. కాబట్టే కడుపు ఉబ్బరం అత్యంత సాధారణమైన ఆరోగ్య సమస్యగా మారిపోయింది. అయితే ఈ సమస్యను పరిష్కరించుకునే మార్గాలు కూడా ఉన్నాయి. పప్పుదినులు, తృణధాన్యాల్లో పిండి పదార్థాలు ఎక్కువ వీటిని పేగులు శోషించుకోవడానికి ఎక్కువ సమయం పడుతుంది. దాంతో పేగులు బ్యాక్టీరియా ఉత్పత్తి అయి కడుపుబ్బరం, త్రేన్పులు వేధిస్తాయి. పేగుల్లోని మంచి, చెడు బ్యాక్టీరియాల్లో హెచ్చుతగ్గులు, సున్నితమైన జీర్ణాశయం, వేగంగా తినడం, ఆహారాన్ని సరిగా నమలకపోవడం, వల్ల పొట్టలో వాయువులు ఉత్పత్తవుతాయి. ఒత్తిడి అజీర్తిని పెంచుతుంది. కడుపులోని కండరాలు బిగుతూగా మారతాయి. వ్యాధి నిరోధకశక్తికి కూడా కుంటుపడుతుంది. పొట్టలో ఆమ్లం ఉత్పత్తి కూడా పెరుగుతుంది. దాంతో అవసరానికి మించి పిండి పదార్థాల మీద యావ పెరగడం, అవి జీర్ణం కాకపోవడం వల్ల కడుపులో వాయువులు ఉత్తత్తి మొదలవడం మొదలవుతుంది. ఇవన్నీ కడుపుబ్బరాని దారి తీస్తాయి. గోరువెచ్చని నీళ్లలో జీలకర్ర, వాము, సోంపు గింజలు నానబెట్టి తాగితే కడుపు ఉబ్బరం తగ్గుతుంది. అలాగే దాల్చిన చెక్క తీసుకుంటే, ఇన్‌ఫ్లమేషన్, రక్తంలో చక్కెర, ట్రైగ్లిజరైడ్స్ తగ్గుతాయి. వాంతులను తగ్గించి, జీర్ణశక్తిని పెంచే గుణం దాల్చిన చెక్కకు ఉంటుంది. వెల్లుల్లి, తోటకూర విత్తనాలు, అరటిపండ్లు వంకాయలు ప్రిబయాటిక్స్‌కు కోవకు చెందుతాయి. గ్రీన్‌టీ, యాపిల్స్‌లో ఉండే పాలిఫినాల్స్ పేగుల ఆరోగ్యాన్ని కాపాడుతాయి.



కాబట్టి ప్రొబయాటిక్స్, పాలిఫినాల్స్‌ను తీసుకుంటూ ఉండాలి. నెయ్యి, జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. కాబట్టి జీర్ణశక్తిని పెంచుకోవడానికి, కల్తీలేని తాజా నెయ్యి పరిమితంగా తీసుకోవాలి. నూనెలో వేయించే పదార్థాలు పేగుల్లో ఇన్‌ఫ్లమేషన్‌ను పెంచుతాయి. జీర్ణశక్తిని కుంటుపరుస్తాయి. కడుపుబ్బరాన్ని పెంచుతాయి. కాబట్టి వీటికి దూరంగా వుండలి. గ్లూటెన్, డైరీ , ప్రాసెస్ట్ ఫుడ్స్‌ను తగ్గిస్తే, కడుపుబ్బరం అదుపులోకొస్తుంది. తరచూ యాంటీ బయాటిక్స్ వాడుతూ ఉండడం, సలాడ్స్ తింటూ ఉండడం వల్ల పెగుల్లోనని బాక్టీరియాలో హెచ్చుతగ్గులు ఏర్పడతాయి. కాబట్టి వీటికి దూరంగా వుండాలి. •

# మష్రూమ్ మటర్ మసాలా

**కావలసినవి :** పుట్టగొడుగులు అర కిలో, గోధుమపిండి చారెడు, పచ్చిబఠాణీలు 2 కప్పులు, ఉల్లిపాయలు, టొమాటోలు, పచ్చిమిర్చి 4 చొప్పున, కొత్తిమీర తరుగు అరకప్పు, ధనియాల పొడి అల్లం వెల్లుల్లి పేస్టులు 2 చెంచాల చొప్పున, నూనె 2 టేబుల్ స్పూన్లు, ఉప్పు రుచికి తగిన కారం, పసుపు 1 స్పూను, పచ్చిమిర్చి ఉల్లి, **తయారీ** టొమాటో, పచ్చిమిర్చిలను ముక్కలుగా కోసుకోవాలి. మష్రూమ్ ముక్కలకు పట్టుకునేలా కలపాలి. వాటిని నీళ్లలో ముంచి మరో పాత్రలోకి తీయాలి. అడుగు భాగం మందంగా ఉన్న గిన్నెలో నూనె కాగనిచ్చి జీలకర్ర, కూరగాయ ముక్కలు, సాగానికి కోసి, గోధుపి పిండివేసి అల్లం వెల్లుల్లి పేస్టులను వేయించాలి. కాస్త వేగిన తర్వాత.. పుట్టగొడుగులు, ధనియాల పొడి, బస్థిరీ కారం, పసుపు, ఉప్పు, గరంమసాలా, వేసి కలిపి మూత పెట్టాలి. మెత్తగా ఉడికించుకున్నాడు. మెంతి ఆకుల పొడి, కొత్తిమీర తరుగు వేసి ఇంకో నిమిషం ఉంచి దించేస్తే సరి. ఘుమఘుమలాడే మష్రూవ్ మటర్ మసాలా రెడీ. •



## చెలి చిట్కాలు

సగం కోసిన నిమ్మకాయల్ని జిప్లాక్ కవర్‌లోనో ఎయిర్‌లైట్ కంటైనర్, బీప్ వ్యాక్స్ పేపర్‌లో చుట్టి ఫ్రిజ్‌లో పెడితే ఎక్కువ రోజులు తాజాగా ఉంటాయి.

# అగ్నిమాపక దళ వారోత్సవాలు ప్రారంభం

## విపత్తు ఉపశమనం సంక్షోభ నిర్వహణలో అగ్నిమాపక సేవల విభాగం ఎల్లప్పుడూ అప్రమత్తం: డైరెక్టర్ ఆఫ్ ఫైర్ సర్వీస్ డి. మురళీమోహన్

**విజయవాడ,ఏప్రిల్14,ప్రభాతవార్తప్రతినిధి:** విపత్తు ఉపశమనం సంక్షోభ నిర్వహణలో అగ్నిమాపక సేవల విభాగం ఎల్లప్పుడూ అప్రమత్తతో ఉంటుందని డైరక్టర్ ఆఫ్ ఫైర్ సర్వీస్ డి. మురళీమోహన్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన మరియు అగ్నిమాపక సేవల విభాగం ఆధ్వర్యంలో విజయవాడలోని రాష్ట్ర కార్యాలయం నందు అగ్నిమాపక సేవా వారోత్సవాల ప్రారంభ వేడుకలు సోమవారం ప్రారంభమయ్యాయి. ముందుగా విధి నిర్వహణలో అమరుడైన బీహార్ కు చెందిన ఎస్.హెచ్. రవికాంత్ మండల్ కు అధికారులు, సిబ్బంది ఘన నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగ నిర్మాత డాక్టర్. బి.ఆర్. అంబేద్కర్ జయంతిని పురష్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం అగ్నిమాపక సేవా వారోత్సవాలను డైరక్టర్ ఆఫ్ ఫైర్ సర్వీస్ డి. మురళీమోహన్ లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డి. మురళీమోహన్ మాట్లాడుతూ అగ్ని సురక్షిత భారతదేశానికి ఐక్యమవ్వాలని పిలుపునిచ్చారు. అగ్నిప్రమాదం జరిగిన విషయమై సమాచారం అందిన క్షణాల్లోనే అప్రమత్తమై అక్కడికి చేరుకుని ఆస్తి నష్ట నివారణకు, ప్రాణ నష్ట నివారణకు మా శ్రాయశక్తులా కృషి చేస్తున్నామని, అలాగే అగ్నికీలలు సమీప ప్రాంతాలకు వ్యాపించకుండ సమర్థవంతంగా అడ్డుకుని పెద్దమొత్తంలో నష్టం జరగకుండ నివారించగలుగుతున్నామన్నారు. విపత్తు, ప్రమాదాల సమయంలో కాకుండ ప్రజల్లో అవగాహన పెంచేందుకు వారోత్సవాలను సద్వినియోగం చేసుకుంటామని, పాఠశాలలు, కాలేజీలు, అపార్ట్ మెంట్లు, వైద్యశాలలు ఇలా ప్రజల వద్దకు తీసుకువెళ్లి వెళ్లి వారికి అగ్నిప్రమాద నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తామన్నారుఅగ్రిమాపక సేవా వారోత్సవాలు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో నిర్వహిస్తారని డి. మురళీమోహన్ తెలిపారు. 1944, ఏప్రిల్ 14న పోర్ట్ స్ట్రైకింగ్ అనే షిప్ బాంబే పోర్ట్ లో బ్లాస్ట్ అయిందని, దానిలో ఎంతో మంది సిబ్బంది, ప్రయాణికులు గాయపడ్డారని వివరించారు. ఆ సంఘటన దృష్టిలో పెట్టుకని 1956 నుండి దేశంలో అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వేసవిలో ఎక్కువగా అగ్నిప్రమాదాలు జరగడానికి అవకాశాలు ఉన్నాయని, ప్రజలు కూడా వేసవిలో




అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదం జరిగిన వెంటనే మాకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఏడాది కాలంలో 892 రెస్క్యూ కాల్స్, 14223 అగ్నిమాపక కాల్స్ కు హాజరై 1055 మంది ప్రాణాలను రక్షించడం జరిగిందన్నారు. అలాగే అగ్ని ప్రమాదాల నుండి రూ. 935.26 కోట్ల ఆస్తి నష్టాన్ని నివారించగలిగామన్నారు. గతేడాది విజయవాడ పట్టణంలో బుడమేరు వరద ప్రభావిత ప్రాంతంలో మట్టి, బురదతో పేరుకుపోయిన 74వేల ఇళ్లు, 325 కిలోమీటర్ల రోడ్లును శుభ్రం చేయడం జరిగిందన్నారు. 55 మీటర్లు,90 మీటర్ల కన్నా ఎత్తులో ఉండే బిల్డింగ్ ల్లో జరిగే ప్రమాదాల నివారణకు, ప్రజల ప్రాణాలను కాపాడటానికి అవసరమైన మూడు ల్యాడర్ వాహనాలు సమకూర్చుకున్నామన్నారు. రాష్ట్రంలో మరో 111 అగ్నిమాపక వాహనాలు త్వరలో అందుబాటులోకి రానున్నాయన్నారు. 15వ ఆర్థిక సంఘ నిధులు రూ. 253 కోట్లు విడుదల అయ్యాయన్నారు. ఆ నిధులతో సిబ్బందికి కావలసిన అధునాతనమైన పరికరాల కొనుగోలుకు వినియోగించనున్నామన్నారు. ఈ ఏడాది ఆఖరునాటికి అధునాతన పరికరాలు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడాలో శాలరీ అకౌంట్ కలిగియున్న వారు ప్రమాదవశాత్తు విధి నిర్వహణలో ప్రాణాలు కొల్పోతే రూ. కోటి నష్టపరిహారం అందిస్తున్నామని, విధి నిర్వహణ లో కాకుండ ఇతర కారణాలతో మృతిచెందిన వారికి రూ. 15లక్షలు అందిస్తున్నామని వివరించారు.అగ్నిమాపక సేవా వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 14 నుండి 20 వరకు అగ్నిమాపక భద్రతా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నామని డి. మురళీమోహన్ తెలిపారు. రెండవ రోజు అనగా 15న ముఖ్యమైన ప్రజా ప్రదేశాలలో అనగా బస్టాండ్, రైల్వే స్టేషన్, మాల్స్, మార్కెట్లు, సినిమా థియోటర్లు, మురికివాడల్లో ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 16న ఎల్ పి జీ భద్రత, నిర్లక్ష్యం, అగ్నిప్రమాదాలు, విద్యుత్ భద్రత మొదలైన వాటిని హైలెట్ చేయడానికి అన్ని నివాస అపార్ట్ మెంట్ లలో అగ్ని నిరోధక తనిఖీలు లేదా ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 17న విద్యాసంస్థలు లో అగ్నినిరోధక ఉపన్యాసం, అగ్నిమాపక కసరత్తుల నిర్వహణ చేపట్టనున్నామన్నారు. ఈ నెల 18న పరిశ్రమలు, పెట్రోల్ పంపులు, ఎల్ పి జీ నిల్వ గోడౌన్లు, ఆయిల్ ఇన్ స్టాలేషన్ లలో అగ్నినివారణ పై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ నెల 19న ఆసుపత్రులలో అగ్ని భద్రతా తనిఖీలు, ప్రథమ చికిత్స అగ్నిమాపక శిక్షణ నిర్వహిస్తామన్నారు. ఇక ఈ నెల 20న సొసైటీలలో వర్క్ షాపులు, సెమినార్లు నిర్వహిస్తామన్నారు అనంతరం అగ్నిమాపక శాఖ వాహ నాల ర్యాలీని డి. మురళీమోహన్ జెండా ఊపి ప్రారంభిం చారు. కార్యక్రమంలో ఏడీఎఫ్ఎస్ లు టి. ఉదయ్ కుమార్, జి. శ్రీనివాస్, ఆర్. జ్ఞానసుందరం, డిఎఫ్ ఓ ఏవీ శంకర్రావ్ తదితరులు ఉన్నారు.

# సీమలో రైలు మార్గం పనులు

## - మరికొన్ని పాక్షికంగా రద్దు

**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 14,ప్రభాతవార్త** దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్,గుంతకల్లు/గుత్తి–ధర్మవరం సెక్షన్‌లో జరుగుతున్న రెండో దశ రైల్వే భద్రత, సాంకేతిక పనుల కారణంగా రాయలసీమ మీదుగా వివిధ ప్రాంతాల మధ్య రాకపోకలు సాగించే పలు రైలు సర్వీసులను రద్దు చేయడంతో పాటు మరికొన్ని రైలు సర్వీసులను పాక్షికంగా రద్దు చేసినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి.

రద్దు చేసిన రైళ్లు :- తిరుపతి నుంచి గుంతకల్లు వెళ్లే నెంబర్ 57403పాసింజర్ రైలును ఈ నెల 16నుంచి మే 18వరకు రద్దు చేశారు. గుంతకల్లు నుంచి తిరుపతి వెళ్లే నెంబర్ 57404పాసింజర్‌ను ఈ నెల 15నుంచి 19వరకు, తిరుపతి నుంచి కదిరి దేవరపల్లి వెళ్లే నెంబర్ 57405పాసింజర్‌ను ఈ నెల 15నుంచి మే 16వరకు, కదిరి దేవరపల్లి నుంచి తిరుపతి వెళ్లే నెంబర్ 57406పాసింజర్‌ను ఈ నెల 15నుంచి మే 17వరకు రద్దు చేశారు. బెంగళూరు–ధర్మవరం–బెంగళూరు మధ్య తిరిగే 06595/96 మెమోపాసింజర్ రైలు సర్వీసులను మే 5నుంచి 17వరకు,గుంతకల్లు నుంచి హిందూపురం వెళ్లే నెంబర్ 77213పాసింజర్ మే 4నుంచి17వరకు, హిందూపురం నుంచి గుంతకల్లు వెళ్లే నెంబర్ 77214పాసింజర్ మే 5 నుంచి 18వరకు,తిరుపతి నుంచి అమరావతి వెళ్లే నెంబర్ 12765ఎక్స్‌ప్రెస్ మే 6,10,13,17వ తేదీల్లో,అమరావతి నుంచి తిరుపతి వెళ్లే నెంబర్ 12766ఎక్స్‌ప్రెస్ మే 5,8,12,15వ తేదీల్లో రద్దు చేశారు. యశ్వంత్‌పూర్ నుంచి బీదర్ వెళ్లే నెంబర్ 16571ఎక్స్‌ప్రెస్‌ను మే 12,13,15వ తేదీల్లో, బీదర్ నుంచి యశ్వంత్‌పూర్ వెళ్లే నెంబర్ 16572ఎక్స్‌ప్రెస్ మే 12,13,14,16తేదీల్లో,యశ్వంత్‌పూర్ నుంచి లాతూర్ వెళ్లే నెంబర్ 16583ఎక్స్‌ప్రెస్‌ను మే 14,16,17వ తేదీల్లో,లాతూర్ నుంచి యశ్వంత్ పూర్ వెళ్లే నెంబర్ 16584ఎక్స్‌ప్రెస్‌ను మే 15న, షోలాపూర్ నుంచి హాసన్ వెళ్లే నెంబర్ 11311ఎక్స్‌ప్రెస్‌ను మే 11నుంచి 16వరకు,హాసన్ నుంచి షోలాపూర్ వెళ్లే నెంబర్ 11312ఎక్స్‌ప్రెస్ మే 12 నుంచి 17వరకు రద్దు చేశారు.


పాక్షికంగా రద్దు చేసిన రైళ్లు :- నర్సాపూర్ నుంచి ధర్మవరం వెళ్లే నెంబర్ 17247ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 15నుంచి 16వరకు ధర్మవరం నుంచి నర్సాపూర్ వెళ్లే నెంబర్ 17248 ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను నర్సాపూర్–కదిరిల మధ్య మాత్రమే తిరుగుతుంది. ఈ రైలు సర్వీసులను కదిరి–ధర్మవరం మద్య పాక్షికంగా రద్దు చేశారు. మచిలీపట్నం నుంచి ధర్మవరం వెళ్లే నెంబర్ 17215ఎక్స్‌ప్రెస్‌ను మే 1 నుంచి 16వరకు, ధర్మవరం నుంచి మచిలీపట్నం వెళ్లే నెంబర్ 17216ఎక్స్‌ప్రెస్‌ను మే 2నుంచి 17వరకు మచిలీపట్నం–అనంతపురంల మద్య మాత్రమే తిరుగుతుంది. ఈ రైలును అనంతపురం,ధర్మవరం మద్య పాక్షికంగా రద్దు చేశారు.

# వైఎస్ జగన్‌కు హాని తలపెట్టేలా కూటమి ప్రభుత్వం కుట్ర

## వైసిపి నేత గడికోట శ్రీకాంత్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 14,ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై టీడీపీ చేస్తున్న కుట్రలు మరోసారి బయటపడ్డాయని వైఎస్ ఆర్‌సిపి సీనియర్ నేత, మాజీ చీఫ్ విప్ గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఈమేరకు సోమవారం హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ఒక పథకం ప్రకారం వైఎస్ జగన్‌కు హాని తలపెట్టేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో వైఎస్ జగన్‌పై హత్యాయత్నంకు పాల్పడిన నిందితుడితో గత టీడీపీ ప్రభుత్వంలో పనిచేసిన రిటైర్డ్ ఐపీఎస్ ఆఫీసర్ ఏబీ వెంకటేశ్వరరావు తాజాగా భేటీ అవ్వడాన్ని ఎలా అర్థం చేసుకోవాలని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారి ఉనికిని లేకుండా చేయడానికే వెంకటేశ్వర్‌రావును ప్రయోగిస్తున్నారని మండి పడ్డారు. ప్రతిపక్షంలో ఉన్న వైఎస్సార్సీపీని టార్గెట్ చేస్తూ కూటమి ప్రభుత్వం విద్వేషపూరిత రాజకీయాలకు తెరలేపుతోంది. మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను అంతం చేయాలన్న కుట్రకు టీడీపీ పథక రచన చేస్తుందా అనే అనుమానాలు కలుగుతున్నాయని శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. 2018 అక్టోబర్ 25న అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ పై శ్రీనివాస్ అనే వ్యక్తి హత్యాయత్నంకు పాల్పడగా ఈ ఘటనను అప్పుడు అధికారంలో ఉన్న చంద్రబాబు ప్రభుత్వం అవహేళన చేస్తూ మాట్లాడటమే కాకుండా..కేసును నీరుగార్చేందుకు తీవ్రంగా ప్రయత్నం చేశారన్నారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న శ్రీనివాస్‌ను హత్యాయత్నం జరిగిన సమయంలో ఇంటిలిజెన్స్ చీఫ్‌గా పనిచేసిన ఏబీ వెంకటేశ్వరరావు తాజాగా వెళ్లి పరామర్శించడం చూస్తుంటే గతంలో మిస్ చేసుకున్న అవకాశాన్ని ఈసారి పక్కాగా అమలు చేయాలన్న కుట్ర కనిపిస్తోంది. ఏబీవీ ఆలోచనపై అనుమానాలు ఉన్నాయన్నారు. మా అనుమానాలకు బలం చేకూర్చేలా జగన్ పర్యటనల్లో కూటమి సర్కార్ భద్రతను తగ్గించేసింది. గుంటూరు, అనంతపురం పర్యటనల్లో మాజీ ముఖ్యమంత్రికి కనీస భద్రత కల్పించడంలో ఈ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని పేర్కొన్నారు.

# రైల్వేలో ఘనంగా అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు



**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 14,ప్రభాతవార్త** భారత రాజ్యాంగ నిర్మాత, అణగారిన వర్గాల ఆశాజ్యోతి,భారతరత్న డాక్టర్ భీమ్‌రావు రాంజీ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు గుంతకల్లు రైల్వే డివిజనల్ ప్రధాన కేంద్రంలో సోమవారం ఘనంగా జరిగాయి. రైల్వే డివిజనల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, అదనపు డిఆర్ఎం సుధాకర్,డిపిఓహెచ్ ఎల్ఎన్ ప్రసాద్,ఎస్ఆర్‌పి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రైల్వే ఎస్‌సి రాహుల్ మీనా,స్థానిక రైల్వే డీజిల్ షెడ్ అంబేద్కర్ పార్కులో జరిగిన కార్యక్రమంలో సీనియర్ డిఎంఇ మంగాచార్యులు,సీనియర్ డిఇఇ యల్లయ్య,డిఇఇ ఆర్ నాగేశ్వరరావు,డివిజనల్ సహాయ కార్యదర్శి జిఎస్ కిషోర్ కుమార్,ప్రభుతులు అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి భక్తిశ్రద్ధలతో ఘనంగా నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అసమానతలు వీడి మానవత్వం వర్థిల్లడమే అంబేద్కర్ వాదం అని అన్నారు. కార్యక్రమంలో వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ విజయకుమార్,డీజిల్ షెడ్ బ్రాంచ్ కమిటీ సభ్యులు తిక్కస్వామి, వంల్లికార్జున, నాగేశ్వరనాయంక్, నారాయణ,సురేంద్రబాబు, ఆయా కార్మిక సంఘాల ప్రతినిధులు,సీనియర్ సబార్డినేట్లు, అధిక సంఖ్యలో రైల్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఫోర్లు, సిక్సర్లతో సెంచరీలు



క్రిస్ గేల్




బ్రెండన్ మెకల్లమ్



అభిషేక్ శర్మ



రిషబ్ పంత్



యశస్వి జైస్వాల్

## దుమ్ము రేపిన ప్లేయర్స్
## ఐపిఎల్‌లో నయా ట్రెండ్

**న్యూఢిల్లీ:** చాలా మంది బ్యాట్స్‌మెన్ ఫోర్లు, సిక్సులు, సెంచరీలు చేయడం సర్వసాధారణం. కానీ, పలువురు బ్యాట్స్‌మేన్లు ట్రెండ్‌ను మార్చారు. తమ ఇన్నింగ్స్‌లో కేవలం ఫోర్లు సిక్సర్లు అనే కాదు. ఆ ఇన్నింగ్స్‌లో వాళ్లు కొట్టిన సిక్సులు, ఫోర్లు కలిపితే సెంచరీ మార్క్ దాటింది. ఈ విధంగా ఐపిఎల్ 2008 నుంచి ఇప్పటి వరకు కేవలం 8 మంది బ్యాట్స్‌మెన్ మాత్రమే ఈ ఘనతను సాధించగలిగారు. సిక్సర్లు, ఫోర్ల ద్వారా అత్యధిక పరుగులు చేసిన రికార్డు క్రిస్ గేల్ పేరు మీద ఉంది. ఐపిఎల్ 2013లో ఆడిన 175 పరుగుల ఇన్నింగ్స్‌లో సిక్సర్లు, ఫోర్ల ద్వారా 156 పరుగులు చేశాడు. ఆ ఇన్నింగ్స్‌లో మొత్తం 13 ఫోర్లు, 17 సిక్సర్లు బాదాడు. అంతకు ముందు అతడు 2012లో తన 128 పరుగుల ఇన్నింగ్స్‌లో బౌండరీల ద్వారా 106 పరుగులు చేశాడు. అందులో 7 ఫోర్లు, 13 సిక్సర్లు ఉన్నాయి. అలాగే 2015 లో 115 పరుగులు చేసిన తన ఇన్నింగ్స్‌లో కూడా బౌండరీల ద్వారా 100 పరుగులు చేశాడు. అతను 7 ఫోర్లు, 12 సిక్సర్లు కొట్టాడు. ఇక ఈ జాబితాలో బ్రెండన్ మెకల్లమ్ రెండవ స్థానంలో ఉన్నాడు. అతను 2008 ఐపిఎల్‌లో తన 158 పరుగుల ఇన్నింగ్స్‌లో బౌండరీలు అంటే సిక్సర్లు, ఫోర్ల ద్వారా 118 పరుగులు చేశాడు. కేకేఆర్ తరపున ఆడుతున్న మెకల్లమ్ ఆర్సీబీతో జరిగిన ఆ ఇన్నింగ్స్‌లో 10 ఫోర్లు, 13 సిక్సర్లు కొట్టాడు. ఇక 2025లో పంజాబ్ కింగ్స్‌పై తుఫాను ఇన్నింగ్స్ ఆడిన అభిషేక్ శర్మ, సిక్సర్లు, ఫోర్ల ద్వారా అత్యధిక పరుగులు చేసిన వారిలో మూడవ స్థానంలో ఉన్నాడు. అతని 141 పరుగుల ఇన్నింగ్స్‌లో బౌండరీల ద్వారా 116 పరుగులు చేసి 14 ఫోర్లు, 10 సిక్సర్లు కొట్టాడు. కాగా 2016 ఐపిఎల్‌లో డివిలియర్స్ 129 పరుగుల ఇన్నింగ్స్‌లో 10 ఫోర్లు, 12 సిక్సర్లు బాదాడు. అలా బౌండరీలతో 112 పరుగులు సాధించాడు. 2015లో 133 పరుగుల ఇన్నింగ్స్‌లో బౌండరీల ద్వారా 100 పరుగులు చేశాడు. ఆ ఇన్నింగ్స్‌లో అతను 19 ఫోర్లు, 4 సిక్సర్లు బాదాడు. యశస్వి జైస్వాల్ బౌండరీలద్వారా 112 పరుగులుచేశాడు. 2023లో జైస్వాల్ 124 పరుగుల ఇన్నింగ్స్‌లో 16 ఫోర్లు, 8 సిక్సర్లు బాదాడు. 2008 ఐపిఎల్‌లో సనత్ జయసూర్య 114 పరుగులు చేసినప్పుడు, అతను బౌండరీల ద్వారా 102 పరుగులు చేశాడు. ఆ ఇన్నింగ్స్‌లో సనత్ జయసూర్య 9 ఫోర్లు, 11 సిక్సర్లు కొట్టాడు. అలాగే ఐపిఎల్ 2018లో సన్ రైజర్స్‌పై రిషబ్ పంత్ 128 పరుగులు చేసినప్పుడు, ఆ ఇన్నింగ్స్‌లో పంత్ 15 ఫోర్లు, 7 సిక్సర్లు బాదాడు. 2022లో డికాక్ తన 140 పరుగుల ఇన్నింగ్స్‌లో బౌండరీల ద్వారా 100 పరుగులు చేశాడు. అతను తన ఇన్నింగ్స్‌లో 10 సిక్సర్లు, 10 ఫోర్లు కొట్టాడు.



## ఐసిసి మహిళల వన్డేలో..
## కొనసాగుతున్న బంగ్లాదేశ్ జోరు
### ఐర్లాండ్‌పై 2 వికెట్ల తేడాతో గెలుపు

**న్యూఢిల్లీ:** ఐసిసి మహిళల వన్డే ప్రపంచ కప్ క్వాలిఫయింగ్ టోర్నీలో బంగ్లాదేశ్ జట్టు జోరు కొనసాగుతోంది. లాహోర్‌లో జరిగిన పోరులో బంగ్లాదేశ్ జట్టు 2 వికెట్ల తేడాతో ఐర్లాండ్‌పై గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ మహిళల జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లు నష్టానికి 235 పరుగులు భారీ స్కోరు చేసింది. లౌరా డెలానీ (75 బంతుల్లో 63, 6 ఫోర్లు) హాఫ్ సెంచరీ సాధించగా, ప్రెండర్‌గాస్ట్ (41), అమీ హంటర్ (33) రాణించారు. బంగ్లాదేశ్ బౌలర్లలో రాబియా ఖాన్ 3, ఫహిమా ఖాతూన్ 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్య ఛేదనలో బంగ్లాదేశ్ మహిళల జట్టు 48.4 ఓవర్లలో 8 వికెట్లు నష్టానికి 240 పరుగులు చేసింది. ఒక దశలో బంగ్లాదేశ్ 94 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే రీతూ మోనీ (61 బంతుల్లో 67 పరుగులు నాటౌట్, 6 ఫోర్లు, 1 సిక్స్, లోయర్ ఆర్డర్ బ్యాటర్ల సహకారంతో బంగ్లాదేశ్‌ను విజయతీరానికి చేర్పించిది. అంతకు ముందు కెప్టెన్ నిగార్ సుల్తానా (68 బంతుల్లో 51, 7 ఫోర్లు) అర్ధశతకంతో ఆకట్టుకుంది. ఐర్లాండ్ బౌలర్లలో ప్రెండర్‌గాస్ట్, అర్లీనా కెల్లి చెరో 2 వికెట్లు తీశారు. కాగా ఈ టోర్నీలో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన బంగ్లాదేశ్ 4 పాయింట్లతో పట్టిన అగ్రస్థానానికి చేరింది. తదుపరి మ్యాచ్‌లో ఈ నెల 15న స్కాట్లాండ్‌తో బంగ్లాదేశ్ తలపడనుంది.

## స్విమ్మింగ్‌లో 16 యేళ్ల
## వరల్డ్ రికార్డు బ్రేక్



**న్యూఢిల్లీ:**నపురుషుల స్విమ్మింగ్ 400 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో 16 ఏళ్లుగా ఎవరూ అధిగమించని ప్రపంచ రికార్డు తాజాగా బద్దలైంది. స్విమ్ ఓపెన్ స్టాక్ హోమ్ టోర్నమెంట్‌లో జర్మనీకి చెందిన లుకాస్ మార్టిన్ ఈ విభాగంలో కొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు. పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం నెగ్గిన లుకాస్ మార్టిన్ 400 మీటర్లను 3 నిముషాల 39.96 సెకన్లలో పూర్తి చేసి విజేతగా నిలిచాడు. ఈ క్రమంలో 2009 నుండి పాల్ బీడెర్మన్ (3 నిముషాల 40.07 సెకన్లు) పేరిట ఉన్న ప్రపంచ రికార్డును మార్టిన్ అధిగమించాడు.. 2009లో రోమ్‌లో జరిగిన ప్రపంచ ఛాపియన్‌షిప్‌లో సూపర్ సూట్స్ ధరించి బీడెర్మన్ ఈ రికార్డును నెలకొల్పాడు. ఇక 2010లో ప్రపంచ స్విమిఇ్మంగ్ సమాఖ్య సూపర్ సూట్స్‌ను నిషేధించింది.

## వరల్డ్ కప్ ఆర్చరీలో..
## భారత్‌కు రజతం




**న్యూఢిల్లీ:** ప్రపంచ కప్ ఆర్చరీ స్టేజ్-1 టోర్నమెంట్‌లో పురుషుల రికర్వ్ టీమ్ విభాగంలో భారత్ జట్టుకు రజత పతకం లభించింది. అమెరికాలోని సెంట్రల్ ఫ్లోరిడాలో జరిగిన ఫైనల్లో భారత్‌కు చెందిన బొమ్మదేవర ధీరజ్, అతాను దాస్, తరుణ్ దీప్ రాయ్‌లతో కూడిన భారత్ జట్టు 1-5 సెట్‌ల తేడాతో లీ జాంగ్‌యువాన్, కావో వెన్‌చావో, వాంగ్ యాన్‌లతో కూడిన చైనా జట్టు చేతిలో ఓటమి చవి చూసింది. తొలి సెట్‌లో రెండు జట్లు 54-54తో సమంగా నిలిచి చెరో పాయింట్ దక్కించుకున్నాయి. రెండో సెట్‌ను చైనా 58-55తో నెగ్గి 3-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత మూడో సెట్‌ను చైనా 55-54తో సొంతం చేసుకుని 5-1తో స్వర్ణ పతకాన్ని ఖరారు చేసుకుంది. ఆర్చరీ సీజన్ తొలి టోర్నీలో ఇప్పటి వరకూ భారత్‌కు మూడు పతకాలు లభించాయి.


## ఓపెన్ ఎటిపి ఛాలెంజర్‌లో..
## భారత్ డబుల్స్ ఓటమి



**న్యూఢిల్లీ:** మెక్సికో సిటీ ఓపెన్ ఎటిపి ఛాలెంజర్-125 టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత్ డబుల్స్ మూడో ర్యాంకర్ శ్రీరామ్ బాలాజీ జోడీ పోరాటం ముగిసింది. మెక్సికో సిటీలో జరిగిన ఈ టోర్నీ డబుల్స్ సెమీ ఫైనల్లో టాప్ సీడ్ శ్రీరామ్-మెక్సికో చెందిన మిగెల్ రేయ్ వరేలా ద్వయం 4-6, 5-7తో మెక్సికోకు చెందిన సాంటియాగో గొంజాలెజ్-అమెరికాకు చెందిన ఆస్టిన్ క్రాయిసెక్ జోడీ చేతిలో పరాజయం పాలైంది. 86 నిముషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బాలాజీ-వరేలా మూడు ఏస్‌లు సంధించి, ఎనిమిది డబుల్ ఫాల్ట్‌లు చేశారు.. తమ సర్వీస్‌ను మూడు సార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేశారు. సెమీ ఫైనల్లో ఓడిన శ్రీరామ్-వరేలాలకు 3,470 డాలర్లు (2లక్షల 98 వేల రూపాయలు) ప్రైజ్‌మనీతో పాటు, 45 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

## చైనాలో ఆపిల్ ఉత్పత్తి స్టార్ట్: టిమ్ కుక్

**వాషింగ్టన్, ఏప్రిల్ 14:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దేశీయంగా తయారీ రంగాన్ని వృద్ధి చేయాలనే లక్ష్యంతో టారిఫ్ యుద్ధానికి తెరతీయగా.. పెద్ద కంపెనీలు మాత్రం అది సాధ్యం కాదంటున్నాయి. అపిల్ సీఈవో టిమ్ కుక్ ఈ విషయాన్నే వెల్లడిస్తున్న ఓ పాత వీడియో ఇప్పుడు ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారింది. దీనిలో ఆయన అపిల్ భవిష్యత్తులో కూడా అక్కడ ఉత్పత్తిని కొనసాగిస్తుందని వెల్లడించారు.
చైనా విషయంలో కొంత గందరగోళం ఉంది. దీనిపై కనీసం నా అభిప్రాయం చెబుతాను వినండి. చైనాలో కార్మికులు చౌకగా లభిస్తారు కాబట్టి అందరూ.. అక్కడ ఉత్పత్తి చేపడతారని భావిస్తుంటారు. మరి చైనాలో చాలాఏళ్ల క్రితమే తక్కువ వేతనాలను రద్దు చేశారు. కానీ, అక్కడ అత్యంత నైపుణ్యం ఉన్న కార్మికులు ఒకే ప్రదేశంలో లభించడం మాత్రం కంపెనీలకు ఓ అడ్వాంటేజ్. ఆపిల్ ఉత్పత్తికి అత్యాధునిక పరికరాలు, అత్యంత కచ్చితత్వం అవసరం. పరికరాల వినియోగంలో నిపుణులైన వారి విషయంలో చైనా ముందుంది. ఇక అమెరికాలో టూలింగ్ నిపుణులు మొత్తాన్ని కలిపినా.. ఓ గది కూడా నిండరు. అదే చైనాలో వారిని కలిపితే కొన్ని ఫుట్‌బాల్ గ్రౌండ్లు నిండిపోతాయి అని వెల్లడించారు. ఈ వీడియోకు నెటిజన్ల నుంచి సానుకూల స్పందనలు వస్తున్నాయి. ఐఫోన్ సహా ఇతర పరికరాల విషయంలో పెద్దఎత్తున ఉత్పత్తి చేయడానికి యాపిల్ చైనాలోని తయారీ రంగ నెట్‌వర్క్‌పై ఆధారపడుతోంది. అదే సమయంలో ఇతర మార్కెట్లపై ఆ సంస్థ దృష్టిపెట్టింది. ముఖ్యంగా భారత్‌లో ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం మెరుగుపడటంతో ఆపిల్ ఇక్కడి ప్లాంట్లను కూడా బలోపేతం చేస్తోంది.



## ఎఫ్‌పిఐలు రూ.31,575 కోట్లు విత్‌డ్రా

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 14:** భారత్‌తో సహా చాలా దేశాలపై అమెరికా విధించిన భారీ సుంకాల కారణంగా విదేశీ పోర్ట్ ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పిఐ) ఈ నెలలో ఇప్పటి వరకు భారీ మొతనతంలో నిధులను ఉపసంహరించు కున్నారు. దేశ ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ ఇన్వెస్టర్లు రూ.31,575 కోట్లను ఉపసంహరించుకున్నారని డిపాజిటరీ గణాంకాలు వెల్లడించాయి. అంతర్జాతీయంగా ఆర్థిక మార్కెట్లలో నెలకొన్న అస్థిరత, పెరుగుతున్న టారిఫ్ ఆందోళన కారణంగా పెట్టుబడిదారుల సెంటిమెంట్ బలహీనంగా ఉందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. డేటా ప్రకారం ఏప్రిల్ 1-11 తేదీల మధ్య ఎఫ్‌పిఐలు భారతీయ ఈక్విటీల నుంచి రూ.31,575 కోట్లను ఉపసంహరించుకున్నాయి. దీంతో 2025లో ఇప్పటి వరకు ఎఫ్‌పిఐలు మొత్తం ఔట్‌ఫ్లో రూ.1.48 లక్షల కోట్లకు చేరుకుంది. ప్రస్తుతానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన టారిఫ్‌ల ప్రభావం కారణంగా మాత్రమే భారత్ ఈక్విటీల్లో అమ్మకాలు జరుగుతున్నాయి. కీలక భౌగోళిక రాజకీయాల్లో రిస్క్ ఆధారంగా మార్కెట్లు ప్రతిస్పందిస్తున్నాయి. అమెరికా, చైనా మధ్య కొనసాగుతున్న వాణిజ్య యుద్ధం నేపథ్యంలో కొంతకాలానికి ఎఫ్‌పిఐలు తిరిగి భారత్‌ను పెట్టుబడులకు ఎంచుకుంటాయని ఇన్వెస్టర్లు తెలిపారు. భారత్‌కు స్వతహాగా ఉన్న స్థానిక డిమాండ్, వాణిజ్యపరమైన నిర్ణయాలు దీర్ఘకాలంలో ఎఫ్‌పిఐలకు భారత్ సరైన ఎంపికగా ఉంటుందని పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి.




## బెల్జియంలో చోక్సీ అరెస్ట్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 14:** పంజాబ్ నేషనల్ బ్యాంకును వేల కోట్లు మోసం చేసిన వజ్రాల వ్యాపారి మెహుల్ ఛోక్సీని బెల్జియం పోలీసులు అరెస్టు చేసినట్టు తెలుస్తోంది. భారత దర్యాప్తు సంస్థల అభ్యర్థన మేరకు అతడిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. కాగా ఛోక్సీని అరెస్టు చేయగా, ప్రస్తుతం అతడు జైల్లోనే కొనసాగుతున్నాడు. అయితే, అనారోగ్య కారణాల రీత్యా అతడు వెంటనే బెయిల్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశాలు ఉన్నాయి. ఈ అరెస్టు నేపథ్యంలో సీబీఐ, ఈడీ అధికారులు చోక్సీ అప్పగింతకు బెల్జియం ప్రభుత్వాన్ని కోరినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను దాదాపు రూ.13,500 కోట్లకు పైగా మోసం చేశారని అభియోగాలున్నాయి. 2018లో ఆరోపణలు వెలువడిన అనంతరం అనంతరం చోక్సీ, అతడి మేనల్లుడు నీరవ్ మోదీ (కేసులో మరో ప్రధాన నిందితుడు) విదేశాలకు పారిపోయారు. ఛోక్సీ ఆంటిగ్వాబార్బుడా పౌరసత్వం పొందగా, నీరవ్‌మోదీ లండన్‌లో ఆశ్రయం పొందాడు. వీరిని ఇండియాకు రప్పించేందుకు భారత ప్రభుత్వం విశ్వప్రయత్నాలు చేస్తూనే ఉంది. ఇటీవల ఇండియా పర్యటన కోసం ఆంటిగ్వాబార్బుడా విదేశాంగ మంత్రి ఈపీ ఛెత్ గ్రీన్ వచ్చారు. మెహుల్ చోక్సీ ప్రస్తుతం తమ దేశంలో లేరని, వైద్యం కోసం విదేశాలకు వెళ్లినట్లు తెలిసిందని చెప్పారు. అయితే ఛోక్సీ తమ దేశ పౌరుడేనని, ఆయన్ను అప్పగించే విషయంలో ఇరుదేశాలు కలిసి పనిచేస్తు న్నాయని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే చోక్సీ బెల్జియం పౌరసత్వం తీసుకు న్నాడని గతనెల అక్కడి ప్రభుత్వం ధ్రువీకరించింది. ఆ దేశ జాతీయురాలైన తన భార్య ప్రీతి చోక్సీ సాయంతో 2023 నవంబరులో అతడు ఎఫ్ రెసిడెన్సీ కార్డ్ పొందినట్లు సమాచారం. అయితే ఈ కార్డు ద్వారా కొన్ని షరతుల కింద జీవిత భాగస్వామితో కలిసి బెల్జియంలో చట్టబద్ధంగా ఉండొచ్చు. దీనికోసం ఛోక్సీ తప్పుడు పత్రాలు ఉపయోగించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఇక, ఛోక్సీ ఇప్పటికీ భారత పౌరసత్వాన్ని వదులుకోలేదు. ఇదిలా ఉండగా ఈ కేసులో మరో నిందితుడు నీరవ్ మోదీ ప్రస్తుతం లండన్ జైల్లో ఉన్నాడు. పై పంజాబ్ నేషనల్ బ్యాంక్ స్కామ్ విజిల్ బ్లోవర్ హరిప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. భారతదేశానికే ఛోక్సీ వల్ల మోసపోయిన వారందరికీ ఇది శుభవార్త. వీలైనంత త్వరగా భారతదేశానికి తిరిగి తీసుకొచ్చి, దోచుకున్న డబ్బును తిరిగి పొందడం ముఖ్యం. అయితే ఛోక్సీ భారతదేశానికి తిరిగి తీసుకురావడం అంత సులభం కాదు. ఎందుకుంటే దీని నుంచి తప్పించుకునేందుకు విజయ మాల్య చేసినట్లుగా యూరప్‌లో ఉన్న ఉత్తమ న్యాయవాదులను నియమిస్తారు. గతంలో కూడా ఆంటిగ్వా బార్బుడాలో పట్టుబడినప్పుడు మంచి న్యాయవాదులను నియమించుకోవడం వల్ల తప్పించుకోగలిగాడు. ఈ సారి మాత్రం భారత ప్రభుత్వం విజయం సాధిస్తుందని నేను కోరుకుంటున్నా అని హరిప్రసాద్ అన్నారు.



## పెరగనున్న ఎసి ధరలు

**ముంబై, ఏప్రిల్ 14:** దేశవ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఏప్రిల్‌లో ఎయిర్ కండీషనర్లకు గిరాకీ పెరుగుతుందని కంపెనీలు భావిస్తున్నాయి. అయితే దక్షిణాదిన అడపాదడపా వర్షపాతం, ఉత్తర, తూర్పు ప్రాంతాల్లోకి కొన్ని చోట్ల మోస్తరు వర్షం కారణంగా అమ్మకాలపై ప్రభావం చూపినప్పటికీ, తాజా వాతారణ సూచనల్లో తీవ్రమైన ఎండలు ఉంటాయనే సంకేతాలు రెండంకెల స్థాయిలో డిమాండ్‌ను పెంచుతాయని ఆశిస్తున్నాయి. ఈ క్రమంలో అందుకు తగినట్లు విడిభాగాల కొరత ఏర్పడుతోందని, ఫలితంగా ధరలు పెరుగుతాయని పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. బ్లూస్టార్, శాంసంగ్, హైయర్ సహా ఎసి తయారీ కంపెనీ ఈ నెలలో 5శాతం మేర ధరలు పెంచనున్నట్లు సంకేతాలిచ్చాయి. ముడిసరుకుల వ్యయానికి తోడు కరెన్సీ మార్పిడిలో హెచ్చుతగ్గులను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికీ రూమ్ ఎసి విభాగం ప్రధానంగా చైనా నుంచి వచ్చే కంప్రెసర్లు, పిసిబిలు, ఫ్యాన్ మోటార్లు వంటి కీలక భాగాల దిగుమతులపైనే ఆధారపడి ఉంది. ట్రంప్ టారిఫ్ పరిణా మాలపై పరిశ్రమ అప్రమతనతంగా ఉంది. హైయర్ ఇండియా ఏప్రిల్ 15 నుంచి రూమ్ ఎసిల ధరలను 4-5శాతం పెంచుకున్నామని హెయిర్ ఇండియా ప్రెసిడెంట్ ఎన్ సతీష్ అన్నారు. ముడిసరుకు ఖర్చు, మారకపు రేటు ఆధారంగా ఇప్పటికే ఎసి ధరలను 5శాతం పెంచామని బ్లూస్టార్ ఎండి బి త్యాగరాజన్ పేర్కొన్నారు. రాగి, ఉక్కు, అల్యూమినియం సహా పలు ముడి పదార్థాల ధరలు పెరుగుతున్నాయి. అదే సమయంలో డాలర్ వర్సెస్ రూపాయి మారకం విలువ అస్థిరంగా ఉందని ఆయన అన్నారు. శాంసంగ్ కూడా 3శాతం పెంచాలని నిర్ణయించినట్లు కంపెనీ ఇండియా డిజిటల్ అప్లయెన్సెస్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ జూప్రాన్ ఆలం వెల్లడించారు.



# వాణిజ్యం

## జుకర్‌బర్గ్ సేల్స్ లిస్ట్‌లో వాట్సప్, ఇన్‌స్టా..

**వాషింగ్టన్, ఏప్రిల్ 14:** టెక్ దిగ్గజం, ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటాకు చిక్కులు ఎదురయ్యాయి. ఈ కంపెనీ అతిపెద్ద యాంటీ ట్రస్ట్ ట్రయల్‌ను ఎదుర్కోబోతోంది. అమెరికా కాలమానం ప్రకారం సోమవారం నుంచి ఈ విచారణ ప్రారంభం కానుంది. 37 రోజుల పాటు కొనసాగే ఈ ప్రక్రియలో.. మెటాపై యూఎస్ ఫెడరల్ ట్రేడ్ కమిషన్ ప్రశ్నల వర్షం కురిపించనుంది. మార్కెట్లో గుత్తాధిపత్యం ఆరోపణలపై విచారించనుంది. ఈ క్రమంలోనే ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్‌ను విక్రయించాలని కంపెనీపై ఎఫ్‌టీసీ ఒత్తిడి తెచ్చే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. పోటీని తొలగించడానికి దీర్ఘకాలిక వ్యూహంలో భాగంగానే ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్‌ను మెటా కొనుగోలు చేసిందని ఎఫ్‌టీసీ ఆరోపించింది. సామాజిక మాధ్యమ రంగంలో ఏకఛత్రాధిపత్యం కోసం ఆ కంపెనీ ప్రయత్నించిందని దుయ్యబట్టింది. ఈ సందర్భంగా కొన్ని అంతర్గత మెయిల్స్‌ను కమిషన్ ప్రస్తావించింది. అందులో మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ చేసిన ఇ-మెయిల్ కూడా ఉంది. 'పోటీ పడడం కంటే వాటిని కొనుగోలు చేయడమే ఉత్తమం' అని జుకర్‌బర్గ్ ఆ సందేశంలో పేర్కొన్నారని, దాన్ని బట్టి వారి వ్యూహం ఏంటో అర్థమవుతుందని కమిషన్ వ్యాఖ్యానించింది. న్యాయమూర్తి జేమ్స్ బోస్‌బర్గ్ నేతృత్వంలో ఈ విచారణ జరగనుంది. పర్సనల్ సోషల్ నెట్‌వర్కింగ్ సేవల్లో మెటాకు గుత్తాధిపత్యం ఉందా? లేదా? అనే అంశాన్ని మొదట కమిషన్ నిర్ణయించనుంది. మరోవైపు, ఈ విచారణపై మెటా న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. తమ కంపెనీ పెట్టుబడులు పెట్టకపోయి ఉంటే.. ఆ యాప్స్‌నకు ఇంత ఆదరణ వచ్చేది కాదని మెటా న్యాయవాది తమ ఫైలింగ్‌లో పేర్కొన్నారు. ఒకవేళ, కోర్టు ఉత్తర్వులు మెటాకు వ్యతిరేకంగా వస్తే.. కమిషన్ తీసుకునే నిర్ణయాలు కీలకం కానుంది. ఫలితంగా ఈ టెక్ కంపెనీ ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్‌ను విక్రయించాల్సి రావొచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆ పరిణామాలు టెక్ ఇండస్ట్రీని కుదిపేస్తాయని పేర్కొంటున్నారు. ఆర్థికంగానూ మెటాకు ఇది పెద్ద ఎదురుదెబ్బగా మారనుంది. ఈ కంపెనీ ఆదాయంలో 50శాతం ఇన్‌స్టా నుంచి ఆర్జిస్తున్నదేనని తెలుస్తోంది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.